
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రి




ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL



"కోవెల"

కత్తిరింపుచిత్రం   చిత్రకారుడు వెల్లటూరి పూర్ణానందశర్మ


28
అనార్కలి
ప్రొడ్యూసర్ ఆదినారాయణరావు
అంజలిదేవి కన్నాంబ నాగేశ్వరరావు రంగారావు
నాగయ్య బాలసరస్వతి పేకేటి
మాటలు పాటలు సముద్రాల
పూర్ణా రిలీజ్

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 35
11.5.55

మన్మథ వైశాఖ బహుళ చతుర్థి బుధవారం

కాంబోడియా కబుర్లు 13:

గాలిపడగలు


క్రొవ్విడి లక్ష్మన్న

కాంబోడియాలో గాలిపడగలకి ఓ గాథ; ఓ తంతూన్నూ. గాలిపడగలు ముఖ్యంగా మార్గశిరమాసంలో ఎగరెయ్యాలని విధి. మార్గశిర పున్నంనాటి రాత్రి, సింహాసనం అదీ ఉన్న కోటం లో బుద్ధభిక్షువులకి పెద్ద విందుచేసి, మంత్రులతో సహా రాజుగారు స్వయంగా గాలిపడగలు ఎగరవెయ్యడం ఆచారంగా ఉంటూ ఉండేది. ఆ సందర్భంలో ఏవో మంత్రాలూ, బుద్ధభిక్షువులు ప్రవచనాలు చదవడం అదీ ఇదీ ఉండేదిట గాని యిప్పుడవన్నీ పోయి, ఊరికే సరదాగా గాలిపడగలు ఎగరవేసుకోవడం మాత్రమే మిగిలిపోయింది. కానయితే మార్గశిరమాసంలో గాలిపడగలు తప్పకుండా ఎగరేస్తారు, పిన్నా పెద్దా కూడాను!

విషయానుక్రమణిక

ముఖచిత్రం : పద్మిని.

కాంబోడియా—	2
చుట్ట—	4
విజ్ఞానవీధులు—	9
అపస్వరాలు (సీరియల్)—	12
మూడో పిల్ల—తలికోటి సభాపతి	19
వక్రకిరణాలు—	25
వనితాలోకం—	27
వ్యక్తిత్వ్యసం—	33
బాలసాహితి—	35
స్కార్లెట్ పింపర్నల్ (సీరియల్)	36
అల్లరపిల్లలు—	41
విక్రమసింహుడు—	44
నాన్నగారి పేనా—	46
సినిమా—	50



వీళ్ళ గాలిపడగలు మన గాలిపడగల్లా మాత్రం ఉండవు. T ఆకారంలో వెల్చని వెదురుబద్దలతోనూ, కాగితంతోనూ కట్టుకుంటారు. వీటికి ముందుభాగాన కొబ్బరి ఆకో, అలాంటిదిమరేదో (చిన్నపిల్లలు బూరా అకే ఉండేలాంటిది) పెడతారు. గాలికి ఎదురుగా గాలిపడగవెళుతూ ఉంటే జోరుగా వీచేగాలిమూలాన్ని యీ కొబ్బరిఆకు ఊః శబ్దం చేస్తుంది, కీచుమంటూనూ!

గాలిపడగలే కాకుండా యీ రోజుల్లో వీళ్లు బుట్టదీపాలు కూడా ఎగరేస్తారు (వీటిని మనవేపు ఆకాశదీపాలని కాబోలు అంటారు.)

గాలిపడగలు ఎవరిమట్టుకు వారు ఎగరేసుకోవడం అలా వుండగా, మనవేపు లాగే పోటీలు కూడా ఉన్నాయి. ఎవరి గాలిపడగ ఎక్కువ శబ్దం చేస్తోందీ అన్నది ఒకరకం పోటీ; ఎవరిది ఎంతఎత్తు ఎగిరిందీ అన్నది యింకోరకం; ఈ పోటీలో గెలవడానికి బలంగా ఉన్న ట్వైనుదారం లాంటి దారం ప్రత్యేకించి తెచ్చుకుని, గాజుముక్కలు గుండనూరి, అపాడి బంకలో కలిపి యీ దారం అందులో నానపెట్టి— యిలా నానాఅవస్థలూ పడతారు, పోటీదారుల పడగ తెంపెయ్యడానికి! రెండు పార్టీలవాళ్లు యీ పోటీలు జరుపుతూ ఉంటే, వేడుక చూడ్డానికి విరగబడిపోతారు. జనం!!

ఈ సందర్భంలోనే, వాడుకలో ఉన్న ఓ చిన్న కథ చెప్పి యీ ప్రసంగం ముగిస్తాను. "త్మెన్చ్" అనే కాంబోడియానాయకుణ్ణి సైనాసేశపు చక్రవర్తి ఓసారి ఖైదుచేసి, మరి విడుదలచేసేడు కాదుట ఎన్నాళ్లయినానూ. ఓ కుర్రాడు ఆపాళంగా ఓ గాలిపడగచేసి రాజుగారి కోటమీద ఎగరేసేట్ట — రాత్రల్లా అది ఊః సైరనులాగ కీచుమని గోలచేస్తూ కోటమీద ఎగురుతూనే ఉంది. అగోల ఏమిటో ప్రభువులకి అర్థంకాక, పురోహితులనీ జ్యోతిష్కులనీ పిలిపించి అడిగేరు. "ఇదేదో అపశకునపక్షి కూత, స్వామీ! గొప్పవిపత్తు ఏదో రాబోతూంది. ఎందుకయినా మంచిది అ "త్మెన్చ్"ని వొదిలెయ్యండి, తక్షాంతి కలుగుతుంది," అని చెప్పేరు. జైల్లోంచి బయటికివొచ్చి, రాజుగారికి అసలుకిటుకు తెలియబరచి; రాత్రికి రాత్రి ఉడాయించేసేడు, "త్మెన్చ్", కోటలో ఉన్న వెండి బంగారులూ అలాగే చాలా పడవల్లో సర్దుకుని!!

సర్వపాప పరిహారార్థం!

నిజంగా చూస్తే "సెయిమాలు" ఉంచడం ఏ కేటూ వొచ్చే పండుగల లిస్టులో చేర్చడానికి వీలు లేదు గాని, కాంబోడియాలో చాలా చోట్ల యిది సాధారణంగా చైత్రమాసంలో జరుపుతూ ఉండడం మూలాన్ని, యీ బాపతుకూడా కొస్త రాస్తాను, మరి. ఇలా రాయడానికి కారణంకూడా లేకపోలేదు. ఈ "సెయిమా"ల ఉత్సవం కాని జరిపిస్తే చేసినపాపాలన్నీ ఒక్క దెబ్బతో తుడుచుకు పోతాయని, గొప్పనమ్మకం వీళ్ళకి. అంచేత యిది ఎంతో శ్రద్ధాభక్తులతో చేస్తారు.

బుద్ధదేవాలయంలో తొమ్మిది సెయిమా లుంచాలి; యిందులో తొమ్మిదోదాన్ని బుద్ధవిగ్రహానికి ఎదరగా భూస్థాపితం చేస్తారు. 'ఈ సెయిమా' లన్నవి ఓరకం దుంపలు (ఆకులతో సహా తీసుకువస్తారు — కందా బచ్చలి నోముకి కంద ముక్క తీసుకు వొచ్చినట్టు!). ఈ దుంపల మీద కళ్లూ ముక్కు అవీ పెట్టిగాని, చెగిసిగాని, వీటికి దేవతా స్వరూపం ప్రసాదిస్తారు. ఈ బొమ్మ దేవుడి చేతుల్లో ఓ కలవపువ్వు!!

సంపాదకునకు లేఖ:

లావెక్కడంలో తమాషా?

ఆర్యా,

గత వారం ఆంధ్ర వార పత్రికలో "అసలు లావెక్కడంలోనే వుంది తమాషా అంతా" అనే హాస్య వ్యాసం చదివి, దేశంలో ఉన్న లావుపాటి మనుషులందరూ చాలా ఆనందించి వుంటారనడానికి సందేహం లేదు. కాని మన భారతదేశం ఆధ్యాత్మికంగా పేరెన్నిక గన్న దేశం. ఈ దేశంలో స్థూలకాయులకంటె స్వల్పకాయులదే మెజారిటీ కావడంవల్ల అధిక సంఖ్యాక పక్షానికి ఆ వ్యాసం అవమానకరంగా ఉన్నది. అందులోని కొన్ని అంశాలతో నేను ఏకీభవించ లేకపోతున్నాను.

తెలివితేటల విషయంలో సన్నటి వాళ్లకీ లావాటివాళ్లకీ హస్తిమశకాంతరం వున్నది. మనుషులు లావెక్కినకొద్దీ వారి తెలివితేటలు సన్నగిలిపోతాయనేది జగద్విదితం. ఇది అన్ని దేశాలవారూ, అన్ని కాలాలవారూ అంగీకరించిన విషయం. అందుచేతనే "వాడు వట్టి బండ, మొద్దు," ఇత్యాది పదాలు వాడుకలోకి వచ్చాయి.

ఈ సందర్భంలో ప్రాచీనమైన గ్రీకు కథ ఒకటి మనవిచేస్తాను. గ్రీకు దేవుడు 'జీయస్' మనుషులను సృష్టిచేశాక వారిలో తెలివితేటలు పోయవలసిందనీ 'హెర్మిస్'కు ఆజ్ఞాపించాడు హెర్మిస్ ఒక చిన్న గిన్నె తయారు చేసి, దాంతో తెలివితేటలు కొలిచి అందరినోళ్లలోనూ సమానంగా పోశాడు. సన్న మనుషులు గిన్నెడు తెలివితేటలూ తాగేసరికి కడుపు పూటుగా నిండిపోయింది. అందుచేత వారు మంచి విజ్ఞానవంతులయ్యారు. లావాటి వాళ్లకు కడుపులో నాలుగోభాగం కూడా నిండలేదు. అందుచేత వారు మందబుద్ధులయ్యారు.

ఈ కథను బట్టి ప్రాచీనకాలంలో కూడా సన్నటివాళ్లు మేధావంతులని, లావాటివాళ్లు జడులని ప్రజాభిప్రాయమైనట్లు తెలుస్తుంది.

అతికాయులకు తెలివితేటలు బొత్తిగా శూన్యమనే విషయం తీసుకుని ప్రసిద్ధ అమెరికన్ రచయిత జాన్ స్టీన్ బెక్ "ఆఫ్ మైస్ ఎండ్ మెన్" (*Of mice and men*) అనుచక్కని నవల వ్రాశాడు. అందులో విపరీతమైన దేహబలం, లావూ కలిగిన మనిషి ఒకడు కథానాయకుడు. అయితే ఆ వైపరీత్యంచేతనే అతగాడికి చిన్నమెత్తు తెలివి లేకుండా పోతుంది. ఈ నవల లావెక్కడంలోని ప్రమాదాలను బాగా బోధపరుస్తుంది. కనుక సన్నటివాళ్లు మీ పత్రికలోని వ్యాసం చదివి బెంగపెట్టుకోకుండా యీ వుత్తరం వ్రాయడమైనది.


పద్మనాభం

అసలు మొట్టమొదటి బుద్ధదేవాలయం కట్టినప్పుడు — బుద్ధుడి కాలంలో — ఇంద్రుడు స్వయంగా వొచ్చి అక్కడి ముఖ్య సెయిమాకి కాపలా కాసేట్ట! అంచేత యిప్పటికీ, తొమ్మిది సెయిమాల్లోనూ ఓదాన్ని "ఇంతో కల్" (ఇంద్రుడి సెయిమా) అంటారు. ఈ ఇంద్రుడి సెయిమాకి పెద్ద దుంపా అదీ — కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి, మరి!! ఈ సెయిమాలు, పూజలూ పునస్కారాలూ అయినతరువాత ప్రత్యేకించి తవ్వినగోతుల్లో భూస్థాపితం చెయ్యాలి.

సెయిమాలపూజ మూడు రోజులు, రాత్రింబగళ్లు, జరుగుతుంది. దీనికి అథమ పక్షం యిరవైఒక్క బుద్ధభిక్షువులని పిలవాలి; యీ యిరవైయొక్కమందీ యిరవై యొక్క దేవాలయాలనుంచీ ఉండాలిగాని, ఒక దేవాలయంలో ఉన్నవాళ్లని ఏకమొత్తంగా పిలవడానికి వీల్లేదు. వీళ్లుకాక, తొమ్మండుగురు బ్రాహ్మలు (ఆచార్యులు) ఉండాలి. ముఖ్యంగా ఈ బ్రాహ్మల్ని దేవతలతృప్తికోసం పిలుస్తారు. తొమ్మిది సెయిమాలలోనూ ఒకటి యమధర్మరాజు కోసం; ఓ బ్రాహ్మణుడు ఆ సెయిమా పూజా అదీ చూస్తూ ఉండాలి.

ఈ సెయిమామీద భక్తకోటి పుష్పాలూ అవీ ఉంచి పన్నీరూ అదీ జల్లుతారు. దీనికి ముందు వీళ్లంతా పెద్ద ఊరేగింపులా వెళ్లి కోవెల చుట్టూ మూడు ప్రదక్షిణం చెయ్యాలి రెండోరోజున భక్తులంతా భిక్షువులకి కానుకలు సమర్పించుకుంటారు. మూడోరోజు ఈ సెయిమాలు భూస్థాపితం చెయ్యడానికి గోతులూ అవీ తవ్వుతారు. వీటిలో భక్తులు అంతా యథాశక్తి, యథాభీష్టంగా నగలూ, వంటసామాన్లూ, జుట్టూ, సగ్గరాలు పడేస్తారు. జుట్టు గాని యీలాగ సమర్పిస్తే వచ్చే జన్మంలో తుమ్మెద రెక్కలా నల్లగా నిగనిగలాడుతూ పెద్దజుట్టు వస్తుందిట! వేలుకొం చెంకోసి పెత్తురుకానీ సమర్పిస్తే మళ్ళీ జన్మలో సిరిసంపదలతో

(56-వ పేజీ చూడండి)



చుట్ట

మునిమాణిక్యం నరసింహారావు

చుట్ట తాగడము సనాతనమైన ఆచారమేనా, లేక ఈ యుగము వారు అలవరుచుకొనిన ఒక దురభ్యాసమా అని ప్రశ్న వచ్చింది.

పోర్చుగీసునావికుడు వాస్కోడిగామా మన దేశానికి పొగాకు తీసుకొని వచ్చినాడనీ, అంతకుముందు మన దేశవాసులకు పొగాకు సంగతి తెలియదనీ ఒక వదంతిమాత్రము ఉన్నది.

కాని ఈ విషయం అంగీకరించడానికి ఏమాత్రమూ వీలుపడదు. మన ప్రాచీన గ్రంథాలలో ఈ చుట్ట ప్రశంస వచ్చినది. కాబట్టి, చుట్టతాగడము చాలా ప్రాచీనమైన ఆచారముగా మనము అంగీకరించవలసి ఉంటుంది.

భీముడు చుట్టతాగేవాడని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పవచ్చును. భారతములోనే కావలసినంత సాక్ష్యము దొరుకుతుంది.

విరాటపర్వంలో అన్నాడూ "మొల జూపి పెక్కుచుట్టల్ పలుత్రాటంజుట్టి గోపభావం బమరన్" అని.

భీముడు క్షణక్షణానికి చుట్టుకోలేక చాలా పెద్దవైనవినీ, బరువైనవినీ అయిన చుట్టలు ఎక్కువగా ఒకేసారి చుట్టుకొని వాటిని చాలా త్రాళ్ళతో బిగించి, ఒకచోట పడేసి ఉంచుకొనేవాడు, కావలసినప్పుడల్లా ఒకటో రెండో తీసి కాల్చుకొనేందుకు.

'కోపభావం బమరన్' అని ఎందుకు అనవలసివచ్చిందీ అంటే.

.. వెధవ చుట్టలు చుట్టీ చుట్టీ ప్రాణం విసిగిపోయి, చివరకు తనమీద తనకే కోపం వచ్చింది అని చెప్పవచ్చు.

లేకపోతే ఇంకొక విధంగా చెప్పవచ్చు. పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నారు. వారంతా విరటుని కొలువులో ఉన్నారు. అప్పుడు తిరిక సమయంలో ఎప్పుడో భీముడు ఈ చుట్టలు చుట్టుకొని, 'మహారాజునై యుండికూడా ఎంతగతి పట్టింది నాకు; చుట్టలు చుట్టి ఇచ్చేందుకు ఒక్క సేవకుడైనా లేకపోయెనుగదా!' అని వాపోయినాడు అని చెప్పినా చెప్పవచ్చు.

సాహిత్యంలోనే ఇంకో నిదర్శనం చూపిస్తాను; చుట్టసంగతి మనవాళ్లకు తెలుసును అంటానికి.

"ఎంచక నా గమనమునకు ఇంచుక చుట్టయిన కానిమ్మ" అని కళాపూర్ణోదయంలో ఉన్నది కళాపూర్ణోదయుడే ఈమాట అని ఉంటాడు. ఏమనీ అంటే, ఈ ప్రయాణంలో నాకు ఒక చుట్ట అయినాసరే ఇయ్యవలసిందీ, అని!

'చుట్ట అయినకాని, ఇమ్మ' అంటే ఒక చుట్టముక్క అయినా ఇయ్యవయ్యా అన్న మాట.

అంటే ఆ కళాపూర్ణోదయుడు చుట్టే తరంకూడా తాగేవాడని ప్రాకరణికార్థం. అది ఏదో మనము ఇప్పుడు ఊహించలేము.

ధర్మరాజు ఒకసారి ఏదో ప్రసంగంలో చుట్ట అంటే ఎవరికీ కోపం రాకూడదు అని చెబుతూ, "చుట్టయును పగయును భేదం బెట్టి జనులకు తగదు" అన్నాడు. చుట్ట త్రాగేవాడు కాకపోతే దానిని అంతగా పెనకేసుకురాడు.

కాటూరు వెంకటేశ్వరరావుగారు పడుకొనేబోయేముందు రెండు మూడు చుట్టలు చుట్టుకొని, పక్కనున్న బల్లపై పెట్టుకొని నిద్రపోయేవారు. "పడుకోబోతూ ఉంటిరి. ఇప్పుడు తాగరుకదా! ఎందుకండీ చుట్టలు చుట్టుకొన్నారూ?" అని అడిగాను.

"రేపు ప్రొద్దున నిద్ర లేవడముతోనే కావాలయ్యా. అప్పుడు చుట్టుకోటం అంటే బద్ధకంగా ఉంటుంది. అందుకని ఇప్పుడే చుట్టలు చుట్టుకొని పరుంటాను.

"భూభారాన్ని మోసే ఆదిశేషు కూడా ఇల్లాగే చేసేవాడట. 'చుట్ట చుట్టుకొని పరుండె' అని భాగవతంలో ఉన్నది" అన్నారు.

విష్ణుమూర్తికి 'చుట్టవాలుజోదు' అని పేరు ఎందుకు ఉన్నది, అని అడిగితే ఏమి సమాధానం చెపులేరు? ఏదో పోనీలే అని ఊరుకుంటూ ఉన్నా కాబట్టి సరిపోయింది కాని! అసలు చుట్టతో ఆయనకు ఏమి సంబంధం? ఎందుకు గ్రంథంలోకి దిగడము! ఆయన చుట్ట తాగేవాడని తేగేసి చెప్పి ఊరుకుంటాను

అయితే శ్రీ విష్ణు పాదారవింద సేవకులూ శ్రీ ఏడుకొండల వేంకటరమణుని భక్తులూ మొదలైనవారిచే త్రాగబడే చుట్టలకు తిరుచుట్టలు అని పేరు. మనము తాగేవి మామూలు చుట్టలు. అంతే భేదం.

కాబట్టి భారతకాలం నాటికే చుట్ట త్రాగే అలవాటు మనకు ఉన్నట్లు తేలిపోయింది.

మరొక్క విషయము కూడా తెలుస్తున్నది. గురుజనుల సమక్షంలోనూ, స్త్రీల ఎదుటా చుట్ట తాగేవారు కారని భారతంలో ఉన్నది.

ఎక్కడ ఉన్నదీ అనవచ్చు. త్రాగవచ్చునని ఎక్కడ ఉన్నది? త్రాగవచ్చునని లేదు కాబట్టి, త్రాగకూడదు అనే ఉన్నట్లు మనము విధిగా భావించవలె. ప్రతిపక్షులకు అనుకూలదృష్టాంతము లేనపుడూ, మనము చెప్పినదానికి దృష్టాంత విరోధము లేనపుడూ స్వపక్షస్థాపన జరిగినట్లే భావించుట తర్కసమ్మతము. ఇతి తర్కః.

స్త్రీల సమక్షంలో చుట్ట తాగడము నిషేధమే అయినప్పటికీ, ప్రియురాలితో ఏకాంతంగా ఉన్న సమయంలో చుట్ట తాగడము ఆనుపూర్వికసంప్రదాయముగా కనిపిస్తుంది.

భార్య ప్రియునిదగ్గరకుచేరి తములపాకుల

'చుట్టలు' ఇచ్చినట్లు అనేకచోట్ల వర్ణితము. పాండురంగ మాహాత్మ్యంలో ఈ విషయము స్పష్టంగా చెప్పినాడు "తనదు తోయ్యలి, వీడ్యము చుట్టయీగన్" అని ఉన్నది భార్య తమలపాకులూ, చుట్టా కూడా, ఇచ్చినట్లు చెప్పబడి ఉన్నది

బంధువులు, స్నేహితులు వచ్చినపుడు భోజనానంతరం అందరికీ తలాక చుట్ట ఇయ్యడము ఇప్పటికీ మనలో ఆచారంగా ఉన్నది

ఈ ఆచారము భారత కాలంనాటికే ఉన్నదని ఊహించడానికి ఆధారాలు దొరకుతున్నవి

శ్రీకృష్ణ భగవత్పాదులవారి ఇంటికి బంధుజనులంతా వచ్చినారు ఆ వచ్చినవారిలో పాండురాజు తనయులూ, ధృతరాష్ట్రుని కుమారులూ కూడా ఉన్నారు

శ్రీకృష్ణుడు మొదటినుంచీ పాండవుల యందు స్నేహభావంలో ఉంటూ, ఆదరణ చూపిస్తూ, పక్షపాతం ప్రకటిస్తూ ఉండినాడు

ఒక సందర్భంలో చుట్టలు ఈయడములో కూడా ఈ పక్షపాతమే ప్రదర్శించి, పాండుతనయులకు తలాక చుట్ట ఇచ్చి, ధార్తరాష్ట్రులకు ఇయ్యలేదు

అల్లాగ పక్షపాతంతో ప్రవర్తించడానికి కారణము ఊహించడమూ కష్టముకాదు పొగాకు ఆ రోజులలో చాలా ప్రియంగా ఉండి సర్వజన లభ్యంగా ఉండేదికాదు మహారాజులు మాత్రమే చుట్ట తాగేవారు

పాండువులు అయిదుగురు ఆ అయిదుగురికి అయిగు చుట్టలు ఇయ్యడము అంత కష్టమైన పనికాదు

ధార్తరాష్ట్రులు నూర్గురు అంతమందికీ చుట్టలు ఇయ్యడము కష్టం

ఈ కారణముచేతనో, లేక పాండవ పక్షపాతి కావడముచేతనో శ్రీకృష్ణభగవానులు పాండవులకు మాత్రము చుట్టలు ఇచ్చి, ధార్తరాష్ట్రులకు ఇయ్యలేదు

అప్పుడు భీష్మాచార్యుడో కృపాచార్యుడో అంటాడూ; "పాండవులు ధార్తరాష్ట్రులు పుండరీక నేత్ర చుట్టరికంబున నీకు నొక్క రూప" అంటాడు

'ఓ మహానుభావా, కృష్ణా, పాండవులు, ధార్తరాష్ట్రులు అనే భేదం ఉండకూడదు చుట్టరికంబున అనగా చుట్టలు పంచియిచ్చేవిషయంలో అందరూ నీకు ఒక్కరూప, అందరూ సమానులే సుమా' అంటున్నారు ఆ ఆచార్యులవారు చుట్టకు సంబంధించిన శ్లేషే చుట్టరికమని ముందు నిరూపిస్తాను

ఆచార్యులవారితో సంబంధం ఉన్నది కాబట్టి అవి తిరుచుట్టలే అయిఉంటవి

చుట్టతాగడము ప్రధానంగా రాజులపరంగానే కనపడుతుందిగాని సామాన్యులవిష

రచయితలకు మనవి

ఇటీవల కొందరు రచయితలు ఇదివరలో అచ్చయిన తమ రచనలను క్రొత్త రచనలన్నట్లు ఇప్పుడు తిరిగి మాకు పంపడం, కొందరు ఇతరుల రచనలను అన్యభాషలలోనుంచీ, తెలుగులోనుంచీ సంగ్రహించి స్వతంత్ర రచనలుగా పంపడం జరుగుతున్నది వీరు సోదర రచయితలకు, మాకు జరుగుతున్న అపచారాన్ని గుర్తించడంలేదు మాకు వచ్చే రచనలను, అనుమానంతో పరిశీలించడం రచయితలకుగాని మాకుగాని గౌరవప్రదం కాదని గుర్తించవలసిందిగా వీరిని ప్రార్థిస్తున్నాము ఇందువల్ల చిక్కులకు లోనుకావచ్చునని ఇట్టివారు గ్రహించడంమేలు ఇదివరలో మా పత్రికలోగాని, ఇతర పత్రికలలోగాని ప్రచురించబడిన వేలాది రచనలను చదివి జ్ఞప్తిలో ఉంచుకోడం ఏ సంపాదకునికైనా అసాధ్యమైన విషయమని ప్రత్యేకం చెప్పనవసరంలేదు

అన్యథా సూచించినప్పుడు తప్ప, మాకు వచ్చే రచనలు మొదలైనవి, పంపినవారి స్వతంత్ర రచనలేననే, భావంతోనే మేము ప్రచురించడం జరుగుతుందని అందరూ గుర్తించ ప్రార్థన

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలనుకూడా గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి నెగటివ్‌లు స్వీకరించబడవు

చిత్రాలు ఇండియన్ ఇంకులో వేసిపంపాలి రంగుల చిత్రాలు స్వీకరించబడవు

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము

—సంపాదకుడు



శాఖాకరములు

ఫోటో: ఆర్. శివారెడ్డి—ముద్దనూరు.

★ చుట్ట ★

యుంలో అంతగా వ్యాప్తిలో ఉన్నట్లు కనపడదు.

ధర్మరాజు నిర్మించిన మయసభ సంగతి చెప్పే సందర్భంలో సభాపర్వంలో, "సామంత రాజులు చుట్టుకొనిరి"- అని ఉన్నది.

ఏమి [illegible]టారు! చుట్టలే చుట్టుకొని ఉం[illegible] ప్రాకరణికార్థము.

ఇల్లాగ [illegible]తంలో ఎక్కడ చూచినా చుట్టలసంగతి బహుళంగా ఉన్నది.

ఇంకొక సంగతి జ్ఞాపకం వచ్చింది. విష్ణుమూర్తికి చుట్టలంటే మహా ఎక్కువైన ప్రీతి అని చెప్పటానికి రెండు మూడు నిదర్శనాలు కనపడుతున్నవి. విష్ణువుకు శంఖచక్రాలు ఉన్నవి అన్నది అందరికీ తెలిసినవిషయమే. శ్రీరంగనాథునికి చుట్టయందు ఉండు కున్నటువంటి ప్రేమవల్లనే తిరుశంఖమునకు 'చుట్టుకుళ్ళ' అని పేరు పెట్టుకొన్నాడు. చుట్టుకుళ్ళఅన్నా చుట్టగుళ్ళఅన్నా ఒకటే అర్థము. అల్లాగే తన చక్రాయుధానికి చుట్టు కైయిదువు అనికూడా ముద్దుపేరు.

అసలు ఆయనకే చుట్టువాలుడనాకి, చుట్టువాలుడోడు అనేపేర్లు ఉన్నవి. చుట్టకే రూపాంతరము చుట్టు. చుట్టబడినది కాబట్టి చుట్టు - పెట్టు, తిట్టు, కట్టు, నెట్టు, మట్టు శబ్దంబులవలె ఏర్పడినది.

పూర్వకాలంలో రాజులకోసం చుట్టలు తయారుచేయడానికి ప్రత్యేకంగా ఒక ఇల్లు ఉంటూ ఉండేది. దానినే చుట్టిల్లు అనే వారు. చుట్టలు చుట్టడానికే ఏర్పడ్డ ఇల్లు 'చుట్టిల్లు' అయింది. ఇది నట్టిల్లు వంటి శబ్దము. నడుము + ఇల్లు నట్టిల్లు అయినట్లే చుట్టు ఇల్లు చుట్టిల్లు అయింది.

చుట్టలు తాగేవారు ఇద్దరు కలియడము తోనే వారిద్దరికి ఇట్టే స్నేహము కలిగే వుండి. ఆ ఇద్దరిలో ఒకరు చుట్ట చుట్టుకొని, నోట పెట్టి ఏమాటా అనకుండానే రెండవ వానివైపు చెయ్యి చాచడముతోనే, ఆ రెండవ మనిషి నిప్పుపెట్టె తీసి అతని చేతిలో పెడతాడు.

సాధారణంగా మొదటి పెద్ద మనిషి రెండు చుట్టలు చుట్టి పక్కనున్న పెద్ద మనిషికి ఒకటి ఇయ్యడమే ప్రాకటము.

ఇల్లాగ చుట్ట సంబంధంగా ఇద్దరు మనుష్యుల మధ్య ఏర్పడిన సంబంధమే చుట్టరికము అయినది. ఇదే చుట్టరిక శబ్దముయొక్క వ్యుత్పత్తి తత్వార్థము.

ఈ వ్యాపారం ప్రాముఖ్యంగా బంధువుల మధ్యనే జరుగుతూవచ్చిన కారణాన చుట్టరికము అంటే బంధుత్వము అనే అర్థము నిరూఢిగాయి స్థిరము అయింది. దీనినే నిరూఢార్థము అని కూడా అంటారు.

ఇప్పటికే చుట్టము అంటే బంధువు అనే అర్థమే కాకుండా స్నేహితుడు అనే అర్థము కూడా ఉన్నది.

చుట్ట, పొగ అనే మాటలకు తర్కశాస్త్రంతో ఉన్న సంబంధమువల్లనే, చుట్ట యొక్క ప్రాశస్త్యము కొంత, తర్కశాస్త్రమును రచించిన గౌతముడూ, వాత్స్యాయనుడూ, గంగాచార్యులవారూ, గంగేశోపాధ్యాయులూ మొదలైనవారు చుట్ట, పొగా, ఈ రెండిటికిని గల సంబంధమును బాగా గుర్తించినవారు అని స్పష్టంగా బోధపడుతుంది.

తర్కంలో అనుమాన ప్రమాణవాదము అనబడే ఒకవాదము ఉన్నది. ఆ వాదమ

“ఉదయ కిరణాలు”

నవలా రచన పోటీలో బహుమతి పొందిన నవల

కర్త: శ్రీ పోతుకూచి సాంబశివరావు, హైదరాబాద్.

మే 25 వ తేదీ సంచికలో ప్రచురణ ప్రారంభం

★

ఈ యేడాది ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రిక జరిపిన నవలా రచన పోటీలో రు **250/.** బహుమతి పొందిన నవల 'ఉదయ కిరణాలు” ప్రచురణ మే **25** వ తేదీ వారపత్రికలో ప్రారంభమౌతుందని మా పాఠకులకు తెలియపరచడానికి ఆనందిస్తున్నాము.

—సంపాదకుడు.

ఇల్లాగ ఉంటుంది “ఎక్కడ ధూమము ఉన్నదో అక్కడ అగ్ని ఉన్నది. ఇక్కడ ధూమము ఉన్నది, కాబట్టి ఇక్కడ అగ్ని ఉన్నది” ఈవాదననే ఇంగ్లీషులో సిలోజిజమ్ అంటారు.

ఈరకము వాదనకు ప్రాణం నాచే వ్రాయబడిన విచిత్రతర్కం చూడనగును “ఎక్కడెక్కడ ధూమము ఉన్నదో అక్కడక్కడల్లా అగ్ని ఉన్నది” అన్నది హేతు వాక్యము.

ఆ హేతువాక్యమే దోషయుక్తము అయితే వాదము దోషభూయిష్ఠము అవుతుంది హేతునిర్ణయము చేయడంలోనే తార్కికుని ప్రతిభ ప్రదర్శితము అవుతుంది.

అందుచేత తార్కికుడు హేతుపుష్టి కోసమూ వైయాకరణి ధాతుపుష్టికోసమూ చూస్తూ ఉంటారు.

ఆసంగతి అల్లాగ ఉంచి ప్రకృతానికి వద్దాము.

ఇప్పుడు పైన చెప్పినవాదనలో హేతుపుష్టి ఉన్నది. ఎందుచేతనూ అంటే పొగ ఉన్నచోటల్లా అగ్ని ఉంటుందీ అన్న విషయాన్ని కాదని ఎవరూ అనలేరు

కొంచెము తార్కిక పరిభాషలోకి దిగితే, ధూమానికి, అగ్నికీ, నియత సంబంధము ఉన్నది అని అంటారు. ఆ రెండూ ఎప్పుడూ కలిసిఉంటవి. పొగ ఉన్నదీ అంటే, అగ్ని ఉన్నదన్నమాటే, అందుకనే ‘యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః’ అని చెప్పారు శాస్త్రకారుడు

పై హేతువాక్యాన్ని తార్కికుడు ఎట్లా నిర్మించగలిగినాడు? అని ప్రశ్న “చుట్ట తాగడాన్ని చూసి!” అని జవాబు చెప్పినట్లు చెప్పి తీరాలి! ఇంకోమార్గం లేదు!

ఎందుకంటే ఆ నియత సంబంధం ఒక్క ఈ విషయంలోనే అనుమానానికి అవకాశం లేని పద్ధతిలో కనిపిస్తుంది. చుట్టలో అగ్ని ఉంటే నోట్లోనుంచి ధూమము వస్తుంది అగ్ని లేకపోతే ధూమం రాదు. యత్ర యత్ర వహ్నిర్నాస్తి తత్ర తత్ర ధూమోఽపినాస్తి

అయితే “చుట్ట కాల్చుచుండగా ధూమము వచ్చుటయూ అచ్చట అగ్నియు ధూమమును కలిసియుండుటయూ, మేము చూచితిమి” అని ఈ తార్కికులు ఒప్పుకోరు ఒప్పుకోక ‘యత్ర ధూమస్తత్రాగ్నిః, యథా మహానసః’ అంటారు. ధూమమూ అగ్నీ వంటయింటియందు నియత సంబంధముతో ఉన్నవి అని అన్వయ దృష్టాంతము ఇస్తారు.

ఇల్లాగ అనడము చుట్టయందు కేవల వ్యతిరేక భావము ఉండడమువల్లనే గాని మరొకటి కాదు. చుట్టకు ఈ విధంగా అన్యాయం జరిగింది తార్కికుల చేతులలో.

ఈ కారణముచేతనే ఈనాటికీ తర్కం చదువుకొన్నవారి చేతిలో చుట్ట ఛస్తే కాలదు అందుకనే వాళ్లు చుట్ట తాగరు. ఈ విషయం నిజమో అబద్ధమో తెలుసుకోవలెనంటే జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని, తిరువేంగళాచార్యులు గారిని అడుగవచ్చు.

నిజానికి ధూమానికి, అగ్నికి ఏకాంతిక సంబంధం మహానసములో వస్తే కుదరదు. అక్కడ సంగతి మా కాంతాన్ని అడిగాను, “ఏమిటి నిజం సంగతి చెప్పు; ధూమము ఉన్న చోట్లనెల్లా అగ్ని ఉంటుంది అంటాడు న్యాయదర్శన గ్రంథకర్త. అది నిజమేనా!” అని

తర్కశాస్త్రం రచించిన గౌతముడే కాని ఆ గ్రంథాన్ని తెలిగించిన వెంకటరమణశాస్త్రిగారే గానీ ఎవరైనా సరే, ఈ ధూమాగ్నుల మధ్య ఉన్న సంబంధం విషయంలో కాంతం చెప్పినదానికి కట్టిక్కన తల వంచవలసిందే గాని కాదంటానికి వీలు లేదు ఈ విషయంలో ఆమె నిర్ణయము ప్రమాణవాక్యము. దానికి విప్రతిపత్తి లేదు కాబట్టి ఆమెవాక్యం సర్వతంత్రసిద్ధాంతముగా, అనగా ఇతరశాస్త్రములకు వైరుధ్యంబులేనిదానినిగా అంగీకరింపక తప్పదు.

“అనేకసార్లు ఊరికే పొగ రాజుతుందే గాని నిప్పు రాజదు. ఎప్పుడైతే నిప్పురాజి అగ్ని ఏర్పడుతుందో అప్పుడు పొగఉండదు” అని ఆమెగారు తెగేసి చెప్పింది.

★ చుట్ట ★

మహానసములో ధూమాగ్నులకు, నియత సంబంధం లేదు. ఒక్క చుట్ట కాలుస్తున్న పుడే ఎప్పుడైనా నిప్పూ, పొగా కలిసి ఉంటవి.

కాబట్టి యత్రయత్ర ధూమః తత్రతత్ర అగ్నిః అన్న వాక్యం చుట్ట దహనసంస్కారాన్ని చూచే అనబడ్డది.

గౌతముని కాలం నాటికి చుట్ట కాల్చడము మిక్కిలి వ్యాప్తిలో ఉండవలె.

అభ్యుదయ రచయితలు అన్నట్లు ఆ కాలంలో రాజులను సంతోషపెట్టడానికే సకల శాస్త్రములూ, కావ్యాలు పుట్టినవి కాబట్టి, రాజులు చుట్టకాల్చడానికి సంబంధించిన ఈ వాక్యం తర్కశాస్త్రంలోకి ఎక్కింది.

కాబట్టి ఇంతకూ తేలిన విషయము ఏమిటీ అంటే, చుట్ట పంఘీనీమీదే తర్కశాస్త్రం పుట్టిందీ అని!

ఉదాహరణలో మహానసములోవలె అని చెపుతారు తార్కికులు. అల్లాఅనక యత్ర యత్ర ధూమస్తత్రాగ్నిః యథా, చుట్ట దహనసంస్కార వైఖరీః అని ఉండాలి సింది.

సాధర్మ్యనిరూపణ ఇల్లాగ చుట్టకు సంబంధంగా ఉండకపోవడానికి కారణముకూడా మనము ఊహించవచ్చు. మొదట్లో రాజులకు సంబంధించిన ఆచారాన్ని తర్కశాస్త్రంలోకి ఎక్కించారు. కాని తరువాత రాజుల ప్రతిభ తగ్గింది. బ్రాహ్మణుల ప్రాబల్యం వచ్చింది. చుట్ట త్రాగడము రాజులలో ఉండేదని చెప్పాను. వారు క్షత్రియులు. అనగా బ్రాహ్మణేతరులు. బ్రాహ్మణేతరుల ఆచారాన్ని పేర్కొని, దానికి తర్కశాస్త్రంలో ప్రాధాన్యము ఇయ్యటము, తర్కశాస్త్ర గ్రంథకర్తలైన బ్రాహ్మణులకు ఇష్టం లేకపోయివుంటుంది. అందుకనే తమకు ఇష్టమైన మహానస విషయము ఉదాహరణగా చేర్చినారు.

బ్రాహ్మణులవలన బ్రాహ్మణేతరులకు జరిగిన అన్యాయాలలో ఇది యొకటి.

ఇక అలంకారశాస్త్రంలో చుట్టకు కావలసినంత ప్రమేయము ఉన్నది. అదిప్పుడు తేలే విషయం కాదు. సంస్కృత వాఙ్మయంలో చుట్ట ప్రశంస కొద్దిగా ఉన్నదని చూపిస్తాను. కాళిదాసు మేఘసందేశంలో మేఘములు చుట్టలతో పోల్చబడినవి. మేఘములు చుట్టలుచుట్టుకొని వగనమార్గాన సంచరిస్తున్నవట!

ధూమజ్యోతి స్సలిలమరుతాం అన్నచోట ధూమప్రశంస వచ్చింది. కాబట్టి కాళిదాసుకు చుట్ట త్రాగడమూ, దానివలన పొగను పుట్టించడము అనే విషయాలు తెలిసే ఉండాలె.

చుట్ట త్రాగడములో రెండు విశిష్టమైన పద్ధతులున్నవి. దక్కని ఒక పేటికలో కొన్ని చుట్టలను పేర్చి దానినీ, ఒక నిప్పు పెట్టెనూ, పక్కనున్న గుండ్రని బల్లపై పెట్టి, ఒక పడక కుర్చీలో శయనించి ఠీవిగా చుట్టను ముట్టించి, ఆహ్లాదంగా ధూమపానం చేయడము ఒక పద్ధతి. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఈ పద్ధతిలో చుట్ట కాలుస్తారు

అరుగుపైనగాని లేక మరొకచోటగాని చాపపై నడ్డిగం వేసి కూర్చుని చుట్ట త్రాగడము మరొక పద్ధతి. కాటూరువారు ఈ పద్ధతిలో చుట్ట త్రాగుతారు.

ఈ రెండవ పద్ధతిలోకూడా రీవి, రాజసము పొందా తినము సరళత, స్నేహభావమూ, రాజభూయము మొదలైన సుగుణాలు ప్రదర్శితము కావడానికి అవకాశాలు ఉన్నవి.

చక్రవాకములు సూర్యునియందు, చకోరికలు చంద్రునియందు, తుమ్మెదలు పువ్వుల గుత్తియందు ఎల్లాంటి అనురక్తికలిగిఉన్నవో అలాగే కవులుకూడా కాటూరివారి చుట్ట త్రాగేపద్ధతియందుఅనురక్తికలిగియున్నారు.

చుట్టా, బీడీ, సిగరెట్టు అనేవి ఉపాధి భేదంచేత వేరువేరు వస్తువులుగా కనపడుతూ ఉన్నప్పటికీ, వానిలో ఉపహితమైయున్న మూలపదార్థము ఒక్కటే.

ఒకటే పరమాత్మ పదార్థము త్రిమూర్త్యాకారమును పొందినట్లే, ఇదీనూ.

ఈ మహదర్థమును ఎఱిగిన కారణాన పండితులూ కవులూ అయినవారు ఈ త్రిమూర్తులనూ సేవిస్తూ ఉంటారు.

ఎట్లాగయినా ఈ త్రికములో పర్వతాలలో మేరువువలె శిఖరాలలో, కైలాసము లాగ, సముద్రాలలో క్షీరసముద్రమురీతి, యశోవైభవముకలిగి జగద్వ్యాపకమైనకీర్తిని కలిగియున్నది ఒక్క చుట్ట అనే చెప్పవలసి వస్తుంది.

చుట్ట త్రాగడమువలన అనేకప్రయోజనములు సిద్ధిస్తూఉన్నవి. రాజకీయాలలో శేముషీధురంధరుడైన చర్చిల్ చుట్ట త్రాగడమువల్లనే అసమానమైన ప్రజ్ఞను సంపాదించినట్లు జగద్విదితము.

దేవులపల్లి, కాటూరి ప్రభృతులు చుట్ట త్రాగుతూఉన్న కారణానే, మహాకవులైనట్లు మనము ఊహించవచ్చును.

చుట్టను ముట్టించి విలాసంగా పొగను వదలి, వర్తులాకారమైన చిన్న చిన్న మేఘమండలాన్ని సృష్టించగా అవి మందమందగతిని ఆకాశంలో విహరిస్తూఉంటే, పంక్తులుగా నిలచిన బలాకములవలెనూ, బిసకిసలయముల 'సపాథేయ'ముగా గొని మేఘుని వెంట కైలాసమునకైపోవుచున్న రాజహంసలవలెను కనిపిస్తవి.

అదీకాక, ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయందదర్శ, అనే శ్లోకపాదంకూడా జ్ఞాపకం వస్తుంది.

చుట్ట మనస్సుకు కలిగిన వ్యాకులతను పోగొడుతుంది అలసటను తీరుస్తుంది. దాహాన్ని ఉపశమింపజేస్తుంది. విరహార్తులను శమింపజేస్తుంది.

చుట్ట త్రాగడమువలన కలిగే ఆనందము, మధురమైన కావ్యమును చదివినపుడూ, ప్రియురాలు చెంపపై చిటిక వేసి సరసోక్తులు ఆడేటప్పుడూ కలిగే ఆనందముతో సమానమైనది అని చెప్పవచ్చును

కోపము ద్వేషము మొదలైన మనోవికారాలను పోగొట్టటానికి చుట్టవంటి వస్తువు ఇంకొకటి లేదు.

మిత్రునివలె ఆదరించేది, ప్రియురాలివలె లాలించేది, తల్లివలె బుజ్జగించేది ఒక్క చుట్టే కాని మరొకటి కాదు.

ఈ వ్యాపారము ఒక్కటే పీయూషపానమువలె మధురమైనదీ, శరద్రాత్రివలె మనోహరమైనదీ అయిఉన్నది.

కాబట్టి మనము అందరమూ కూడా ఈ చుట్టకు ప్రణత శిరస్కులము కాకతప్పదు.

చుట్టయొక్క మాహాత్మ్యమునూ, పరువమునూ, ప్రయోజనమును గుర్తింపని కొందరు నాస్తికులు, దానినిగురించి అపభాషణ చేస్తూఉండటము చాలా శోచనీయము.

హే చుట్టే, అహంత్వాం ఉపాసే తమసోమాజ్యోతిర్గమయ. ★

విజ్ఞానవీధులు

“డాక్టర్”

జ్యోతిషము శాస్త్రమేనా?

వసంతరావు వెంకట్రావుగారి వాదానికి ప్రతివాదాలు

బొంబాయినుంచి కె. యస్. వెంకటేశ్వర్లుగారు (యం. యస్. సి.) ఇలాగ వ్రాస్తున్నారు:—

“ఈచర్చ విజ్ఞానానికా, వినోదానికా” అంటూనే, ఏదీకాకుండా హాస్యధోరణిలోకి దించేసి శ్రీ వసంతరావు వెంకటరావుగారు 27 4 1955 పత్రికలో ఒకజాబు ప్రకటించారు. దానిలో ‘నాఉద్దేశాలం’టూ నాల్గువిషయాలు ప్రస్తావించారు. ఆ నాల్గింటిలో రెండు, మూడు అంశములుమాత్రమే చర్చించవలసినవి.

జ్యోతిషాన్ని వాతావరణము, స్టాటిస్టిక్సు శాస్త్ర విభాగాలతోటి ముడిపెట్టారు. స్టాటిస్టిక్సనున్న గణితశాస్త్రపాటవము, ఉపయోగములు దానిని అనుభవికశాస్త్ర శ్రేణిలోకి చేర్చవు. ఇక వాతావరణశాస్త్రం దేనిమీదనైనా ఆధారపడిఉన్నదా అంటే అది పరిశీలనమీదే. దానికి కావలసిన సంపూర్ణ సాంకేతికసామగ్రి ప్రస్తుతం భారతదేశంలో లేకపోవచ్చు. కాని పశ్చిమదేశాలలో వాతావరణసూచన గుడ్డిగుఱ్ఱపుతాపులా కాకుండ, చాల నిర్దుష్టంగా ఉంటుంది. అయితే శ్రీ వేంకటరావుగారు జ్యోతిషంతో ముడిపెట్టడానికి కారణం బహుశా వాతావరణశాస్త్రం అంటే వారి దృష్టిలో మృగశిరకార్తె ప్రవేశించిననాడు వానకురుస్తుందని మొదలైన నమ్మకాలేమో. ఈ వర్షించడం నిజంగా దృశ్యాదృశ్యమే.

రెండవవిషయం. కోటానుకోట్ల తరంగాలవలన మానవునిలోకల్గు మార్పులు. మాటవరసకి శ్రీ వెంకటరావుగారి ప్రాతిపదిక అంగీకరించామనుకొందాం. ప్రతిగ్రహానికీ జ్యోతిషంలో సౌమ్యభావం, దుష్టభావంకూడా ఉంటవి. పై ప్రాతిపదికవల్ల ప్రతిగ్రహం సౌమ్యభావతరంగాలు, దుష్టస్వభావతరంగాలు కూడా మనమీదికి పంపిస్తున్నాయన్నమాట. శని దగ్గరనుంచి కొన్నితరంగాలొచ్చి ఒకవ్యక్తిని (దగ్గరున్న మరొకవ్యక్తి కాకూడదూ!) బాధిస్తే, బుధుని కిరణాలు నివారణచేస్తూ ఉంటాయన్నమాట!! ఈ ప్రక్రియ అటునుంచి ఇటుకూడా జరగవచ్చు!!! శక్తిరూపాలు ఐన విద్యుదయస్కాంత తరంగాలను బాధాకారణ, విమోచన గ్రహాలతో ముడిపెడితేనే వ్యాసం విజ్ఞాన, వినోదపక్కనుంచి హాస్యధోరణికి దిగుతుంది. ఇది వారు “మానలేక కనుక్కున్నదే.”

విషయాన్ని కొంచెం సూక్ష్మంగా పరిశీలనచేస్తే అసలు వింతలు బయటపడతాయి. ఆదికాలంనుండి ప్రతిపర్వదినం, ఒక నిశ్చిత ఋతువులో ఉండాలని, ఆఋతువులో తిథిని బట్టి అది నిర్ణయమవాలనివాడుక. దరిదాపు 570 *A. D.* వరకు ఈలాగేజరిగింది. అప్పటినుంచి నేటివరకు (1380 సంవత్సరములు పైగా) మన పంచాంగకర్తలు, సంవత్సరానికి 50.2 సెకనుల పరిమితిగల *Precision of equinoxes* (అయనచలనము) లెక్కించుటమాని వేశారు. ఆతేడా 1950 కి రమారమి 19 డిగ్రీల 36 నిముషాలు. ఈరోజులో మేషసంక్రాంతి (*Vernal-equinox*) పంచాంగరచయితల లెక్కకి 28 రోజులు ముందు జరుగుతున్నది. ఈలాగే తిథి, నక్షత్రాల లెక్కల్లోకూడా తేడాలున్నాయి. అంచేత ఏ పూర్వీకుల్ని అనుసరిస్తున్నామంటున్నారో, వారి భావనకే వ్యతిరేకంగా ప్రస్తుత పర్వదినాలు నిర్ణయమౌతున్నాయి. ఈ పంచాంగాల మీద ఆధారపడి తయారుచేయబడినవే జాతకచక్రాలు. అసలు జ్యోతిషమే దృశ్యాదృశ్యం. ఈ తేడాలు కూడ ఉంటే ఇక చెప్పక్కరలేదు. ఎప్పుడైతే అయనచలనం (*Movement of equiinoxes*)గూర్చి ప్రజలకి అవగాహనౌతుందో, అప్పుడే వాటి మహత్తులనుగూర్చిన నమ్మకంకూడ తగ్గిపోతుంది. ఈ విషయంగూర్చి కూలంకషంగా ప్రఖ్యాత భారతశాస్త్రవేత్త శ్రీ. యం. యస్. సాహా, “సైన్స్ ఎండ్ కల్చర్” అనే పత్రికలో (ఆగస్టు, సెప్టంబరు, 1952) చర్చించి, మన పంచాంగాలు ఈతప్పును ధోరణిలో ఉండకపోతే జ్యోతిషశాస్త్రవేత్తలకు కొంత ఆర్థికదుస్థితి కలుగుతుందన్నారు.

ఇక శ్రీ వెంకటరావుగారి కత్తిరించబడిన మూడు పేజీలనుంచి ప్రచురించబడిన ప్రశ్న! “ఎలక్ట్రానుతత్వము కణత్వమా, తరంగస్వభావమాఅన్న విషయం తేలిందిగనకనా!”

ఈ విషయంగూర్చి ఈమధ్యనే బరోడాలో జరిగిన విజ్ఞానశాస్త్ర సభలలో ప్రొఫెసర్ ***P. A. M. Dirac*** మాట్లాడుతూ చక్కని ఉపమానం చెప్పారు. చదరంగంలో బలము కఱ్ఱతో చేశారా లేక దంతంతో చేశారా మొదలైన ప్రశ్నలన్నీ అనవసరం. మనకు కావలసినది అవి ఎలాగు ప్రవర్తిస్తాయన్నది. ఎలక్ట్రానులు కొన్ని పరిస్థితులలో కణత్వభావము, మరికొన్ని పరిస్థితులలో తరంగస్వభావము ప్రదర్శిస్తాయి. ఏ పరిశోధనలలో మనం ఎలక్ట్రాన్ ఉనికి (***Position***) కనుగొనేందుకు ప్రయత్నిస్తామో, ఆ పరిస్థితుల్లో కణస్వభావము, ఏపరిశోధనలలో ఎలక్ట్రాన్ శక్తి(***Energy or any related quantity***) కనుగొనుటకు ప్రయత్నిస్తామో అందు తరంగభావము గోచరమౌతవి. అనిర్దేశసిద్ధాంత ప్రకారం ఈరెండుగుణాల్ని ఒకేసారి (***Simbltaneous***) గా నిర్ణయించడం (***Determination***) అసాధ్యం. ప్రొఫెసర్ ఇ. ష్రోడింగర్ “***Science and humanism***” అన్న పుస్తకంలో ఈ ప్రక్రియనే విచ్ఛిన్న పరిశీలనసూత్రం. (***Principle of dicsontinuous observation***) అన్నారు. పరమాణు జగత్తులో అవిచ్ఛిన్న పరిశీలన సాధ్యంకాదు. అయితే ఈసిద్ధాంతం పరమాణుజగతిలోనే వర్తిస్తుందికాని,ఎదురుగా

★ విజ్ఞాన వీథులు ★

చెట్టును చూచి అదిఉండాలేదా అని శంకించ డానికి ఉపయోగించదు.

కాకినాడనుంచి సత్యంగారు ఇలాగ వ్రాస్తున్నారు.

చాలామంది కప్పదాటు వేసేచోటే వసంతరావు వెంకటరావుగారూ వేశారు. ఏమంటే జ్యోతిషంపై మనకు పూర్తి నమ్మక ముంటే, మనం డిటర్మినిజాన్ని పూర్తిగా స్వీకరించామన్నమాట అంటే ప్రపంచ మంతా ఒక నిర్దిష్టపథంలో నడుస్తోందని ఒప్పుకొన్నామన్నమాట. గత శతాబ్దంలో శాస్త్రీయ హేతువాదుల (*Rationalists*) యొక్క పట్టుగొమ్మ ఈ సిద్ధాంతం. ఐతే వారు జ్యోతిషాన్ని శాస్త్రంగా పరిగణించ లేదు; నమ్మలేదనుకోండి. అయినా ప్రపంచ మంతా ఒక నిర్ణీతపథంలో నడుస్తూంటే "సంభవామి యుగేయుగే" అనే దేవుడు అనవసరం అని వారి వాదన. జ్యోతిష శాస్త్రం సిద్ధాంతరీత్యా నిజమని నమ్మే వెంకటరావుగారు, మన జీవితాలకీ స్వభావాలకీ, ఏవో కొన్ని ఛాయలు (రాహు కేతువులు) గ్రహాలు (*Planets*) మాత్రం కర్తలని నిర్ణయించాలి. మనం, మన చుట్టూ వున్న వాతావరణం, ప్రపంచం, జ్యోతిష శాస్త్ర మార్గంలో పట్టాలను తప్పకుండా పురోగమిస్తే, మధ్యమధ్య వేలుపెట్టి ఆపు చేసే దేవుడు, పాపం, పుణ్యం, వీటన్నింటినీ సమాధానపరచడ మెలా? ఇక అదే వృత్తిగా పెట్టుకున్న జ్యోతిష్కులు చెప్పే గ్రహశాంతులూ, ఉపక్రియలూ కూడా శాస్త్రీయమని నమ్ముతారా వెంకటరావు గారు? అక్కడ మళ్ళీ జ్యోతిషశాస్త్రపు బాటను కొంచెం తప్పించాలే? లేకపోతే, ఒకనికో దుష్టగ్రహం దుష్టఫల మివ్వగల దనుకోండి. దాని కేదో శాంతింపజేసే ప్రక్రియ చెబుతారు జ్యోతిష్కులు, వీలుంటే శాంతులు చేయిస్తారు కూడాను. అయితే ఈ గ్రహశాంతులు ఏ గ్రహబలము వల్ల జరుగుతాయి? దుష్టగ్రహం ఫల మిస్తోంటే దాని కడ్డుగా ఒక మంచిగ్రహం వచ్చి "శాంతి చేయించుకోనే" బుద్ధిని ప్రసాదిస్తుందా? శాంతి ప్రక్రియలు సల్పే వారి గ్రహబల మెలాటిది? తార్కికంగా పరస్పర విరుద్ధములైన కర్మ, దేవుడులాంటి భావాలు ఒకేమాటు ప్రయోగించటంద్వారా ఇటువంటి *Paradox* లకు (విరోధాభాసలకు) తావుంటుంది. అయితే "మసిబూసి మారేడుకాయ" చేయగోరేవారు, ఇటువంటి విభిన్న తత్వాలను బాదప్రయత్నిస్తారు.

ఇక మామూలు మతవాదులు (*Religionists*) లాగే భౌతికశాస్త్రపు లోతులు చూసిన వెంకట్రావుగారు "ఎలక్ట్రాను తరంగమో కణమో" తేలలేదు గనుక ఆ శాస్త్రం పూర్తిగా నమ్మబడజాలనిదని వేళాకోళం చేశారు. సరే, మామూలుగానే, అనిర్దిష్ట సిద్ధాంతాన్ని ఎత్తిచూపారు (*Principle of indeterminism*). అయితే ఆ సిద్ధాంతం ప్రకారం అనిర్దిష్టత్వపు ప్రమాణము నిర్దిష్టమేననీ ($\Delta p \times \Delta q = h$), అది కేవలం మనం కొలవడములో ఏర్పడ్డ అవరోధముల (*limitations*) వల్ల ఏర్పడిందేననీ వెంకటరావుగారూ ఎరుగుదురు. అలాగే "కణత్వమూ, తరంగస్వభావాల" ఉనికిలో వైరుధ్యం లేదనీ, అవి పదార్థంయొక్క గాని, శక్తియొక్క గాని తత్వాన్ని తెలుసుకొనడంలో పరస్పరంగా (*Complementary*) ఉపకరిస్తాయనీ ఆయనకు చెప్పనక్కర్లేదు. "కణత్వమేనా నిజమవ్వాలి, తరంగత్వమేనా నిజమవ్వాలి. రెండూ ఎలాగ నిజము కాగలవు?" అనేవాళ్ళకు చెప్పలేం కాని, ద్వంద్వ స్వభావాన్ని సమన్వయ దృష్టితో అవగాహన చేసుకుంటే శాస్త్రాన్నావిధంగా పరిహసించనక్కరలేదు.

మానవాభ్యుదయాన్ని దృష్టిలో ఉంచుకొని అనండి, కేవలం తత్వజిజ్ఞాసతో కానివ్వండి, విజ్ఞాని (*Scientist*) కొత్త సంగతులను కనిపెడుతూంటాడు. కనుక్కొన్న కొత్తవాటిని చూచి అప్పుడప్పుడు శాస్త్రజ్ఞుడు దిగ్భ్రాంతి, విస్మయం పొందడం సహజం. అందుకనే అనేకమంది శాస్త్రజ్ఞులు, పరిశీలనలో ఉన్నత శిఖరాలనందుకొన్నాక "మిస్టిక్స్"గా మారిపోవడం చూస్తున్నాము. వారి నాధారంగా గొని, మతాల్లోని పాత సూత్రాలను పునరుద్ధరింపజూస్తారు కొంతమంది *Theologians* ఐతే శాస్త్రపరిశోధకులు క్రిందిస్థాయిలోనే "మిస్టిసిజా" న్నాశ్రయిస్తే, శాస్త్రాభివృద్ధి కుంటువడుతుంది. ★

207. కొండల పుట్టుక

కొండలు ఏ విధముగా పుట్టును అని విజయనగరమునుండి కె. కృష్ణమూర్తి రాజుగారట అడిగినారు.

భూగర్భమునుంకి రాళ్లు కరిగిన లావా ద్రవము భూమిని చీల్చుకుని పైకి చిమ్ము బుడ్డిలోవలె ఎగురునని మీరు చదివి ఉంటారు. ఈ ద్రవము అది వచ్చే బిలమునకు చుట్టూ గట్టువలె ఏర్పడడము సహజము కదా? ఇది పర్వతము లేర్పడేతీరే; మొదటిది.

భూమికి పైభాగ ముఖ్యముగా సిలికను అల్యూమినియము అనే మూలధాతువులు చేరి ఏర్పడ్డది. క్రిందిపొర సిలికను, మాగ్నిషియములు చేరి ఏర్పడ్డది. పైపొర అడుగు పొరకంటే తేలిక భూపరిభ్రమణమువల్ల తేలిక అయిన పైపొర అడుగు పొరమీద జరుగుతుంది. ఇలాగ జరగడమువల్ల భూమికి నరుకులు ఏర్పడి భూ భాగాలు విడిపోతాయి. విడినతర్వాత జరుగుతాయి కూడాను. ఇలాగ జరుగుతూన్నప్పుడు పొర అంతా పలకలాగ జరగక ముడతలు పడడము కద్దు. అలాగ ఏర్పడినవే హిందూదేశపు హిమాలయాలూ, అమెరికా రాకీ పర్వతాలూను. అమెరికాల తూర్పు తీరానికీ, యూరపు ఆఫ్రికాల పశ్చిమతీరానికీ పోలిక గుర్తించండి

ఇలాగ జరుగుతూ, కలిసిరాని బరువు భాగాలను దిగవిడిచి ఆసియా పశ్చిమానికి జరుగుటవల్ల మిగిలిపోయినవి జపాన్ దీవులూ, హిందూ, కాంబోడియా దేశములనుంచి దిగబడిపోయినవి లంక, సుమత్రా, బలి, జావా ద్వీపాలూను.

ఈరీతిగా జరుగుతూ గట్టిపొరను తారసిల్లే విశాలభూమివల్ల ఈ రెంటికీ నడుమనున్న మట్టి నొక్కబడి పైకి పెరుగవచ్చును. పర్వతాలు పెరగడము అంటే ఇదే.

బలమైన భూకంపముల ఫలితముగా కొండలు ఏర్పడగలవు.

ఇవన్నీ కేవలము ఊహలు కావు. హిమాలయాపర్వతాలమీద 17000 అడుగులఎత్తున ప్రభూతకాలపు చేపల చిహ్నములు దొరికినవి కటకమునకు చేరువన తాల్చిర్ అనే చోట మంచుగడ్డ చిహ్నాలు దొరికినవి.

* * *

చిట్టిప్రశ్నలకు జవాబులు

గాదె పార్థసారథి—సంబల్పూరు

—జోడియక్ అంటే సూర్యచంద్రులు తిరిగే దారి. అశ్వని, భరణి, కృత్తిక అనే 27 నక్షత్రాలూ ఇంచుమించు ఆదారిలోనే ఉన్నాయి. ఇరవైయేడు నక్షత్రాలూ ఉన్న ఆ పెద్ద వర్తులాన్ని 12 రాసులుగా విభజించుకున్నారు. ఒక్కొక్క రాశిలో కొండగుర్తుగా ఈ ఈ నక్షత్రాలున్నాయన్నారు. ప్రతీరోజూ సూర్యాస్తమానమయిన తరువాత పశ్చిమాన్న కనపడే నక్షత్రాన్ని గమనిస్తే సూర్యుడు రోజురోజుకీ తూర్పువైపు సుమారు ఒక డిగ్రీ జరుగుతున్నట్టు కనపడుతుంది సంవత్సరము అయేసరికి 360 డిగ్రీలూ పూర్తి అయి సూర్యుడు మనము మొదట చూచినచోట కనపడతాడు అంటే ఏమన్న మాటా? సూర్యుడు మనకి కనబడే దానినిబట్టి 27 నక్షత్రాలలోనూ తిరిగినాడన్నమాటే కాదూ? ఇలాగ తిరగడములో ఇంగాకా చెప్పిన 12 రాసులూ గడిచాయన్నమాట. ఒక్కొక్క రాశిలో

ఒక్కొక్క నెల వుంటాడు సూర్యుడు తర వాత 'మరొక రాశిలో ప్రవేశిస్తాడు' అంటాము. కాబట్టి రాశి అంటే నక్షత్రాకాశాన్ని ఆధారము చేసుకుని సూర్యుడి పథాన్ని 12 భాగాలుగా విభజిస్తే వచ్చే ముక్క

ఫలాని రాశిలో గురుడు ఉన్నాడంటే అర్థము చెప్పడానికేముంది? మేష రాశిలో గురుడు ఉన్నాడంటే గురుడు అన్న గ్రహం, అశ్విని, భరణీ, కృత్తిక పాదమూ కలిసినభాగంలో ఉన్నట్టు మనకి కనబడుతున్నదన్నమాట

వాస్తవానికి మనభూమికి గ్రహాలు దగ్గఱ నక్షత్రాలు ఎక్కడో కోట్లకొద్దీ మైళ్ళలో ఉన్నాయి కనక సూర్యచంద్రాదులు రాసులలో ప్రవేశించడమంటే, మనదృష్టికి ఫలాని రాశి ఉన్నవైపున ఉండడము అన్నమాట

గ్రహాలకు ఫలకారకశక్తి ఉన్నదని జ్యోతిషగ్రంథాలు చెప్తాయి విజ్ఞానశాస్త్రరీత్యా ఈ మాటన్ను సమర్థించలేము పూర్వపు "శాస్త్రాల" మీద అకారణంగా అభిమానము బలిసిన ఆధునికప్రాచీనులు (*Neoclassicists*) గురుత్వాకర్షణమూ, విద్యుదయస్కాంతతరంగాలూ అంటూ సరిగ్గా వంటపట్టని ఆధునిక వైజ్ఞానిక పదావళిని విసురుతూ తమ్మనూ ఇతరులనూ మోసపుచ్చుతున్నారు రాహుకేతువులకు ఇందాకటి రెండుగుణాలూ లేవు వాటిని ఫలకారకగ్రహకూటాన్ని ంచి తొలిగించమనండి ఇక గురుత్వాకర్షణవల్ల సహోత్పత్తితము మన కళేబరాలు తేలికవడమో బరువెక్కడమో మాత్రమే ఎంతమట్టుకు అన్న ప్రశ్న వారినే అడగండి "విద్యుదయస్కాంతతరంగాలు" పెద్దమాట అమ్మబాబో యనిపిస్తుందీ, అబ్బనుకాబోలని పిస్తుంది అసలు ఏమిటంటే "వెల్తురూ, వేడిమీ, వెద్యుతము తక్కువైనతరంగాలూను ఇవి నక్షత్రాలనుంచీ నిశీథాకాశము నుంచీ వస్తాయి ఈతరంగాల కన్నిటికీ ఫలకారకశక్తి లేదా? సూర్యుడి వెల్తురే గ్రహాల మీదపడి భూమిమీదికి వస్తే దానికి ఫలకారకశక్తి వచ్చేశిందా? గ్రహాల వెల్తురులో ఈ ఆధునిక ప్రాచీనులు కనిపెట్టిన విశిష్టత యేమిటి? ఏమీ లేదు

ఇక యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో, ఆస్టిరాయిడ్స్ను, శనిగ్రహపు రింగులూ, గురుని చంద్రులూ, శుక్రుని మబ్బూ, వీటి మాట ఏమిటి?

కంటికి గాని, టెలిస్కోపులకు గాని అగపడ వీలులేని - అంటే వెల్తురు చిమ్మని చల్లని నక్షత్రాలు అవి చిమ్మే రేడియోతరంగాలవల్ల కనుక్కొంటున్నారు. వాటికేమీ శక్తి లేదూ?

* * *

పుటలలో సమాధానాలిచ్చాము ప్రాసినదే మళ్లీ రాయడము భావ్యమా?

* * *

మాదిరెడ్డి రాము—మద్రాసు

—దృష్టి తగులుట, చేతబడులు చేయుట, అంటే ఏమిటో విజ్ఞానశాస్త్రమున కిప్పటికి తెలియదు

★

గ్రంథసమీక్ష

నూతిలో గొంతుకలు — గేయ కావ్య సంపుటి, కర్త బైరాగి, వెల 1-0-0 ప్రచురణ గ్లోబ్ ట్రేడర్స్, గుంటూరు-2

ఈ గ్రంథ నామానికి అర్థం విశదీకరిస్తూ బైరాగిగారు, ఈ గొంతుకలు వస్తున్న నుయ్యి పాడు నుయ్యి అనీ, పాడు నుయ్యి పతనానికీ, మరణానికీ సంకేతమనీ, ఈ కావ్యంలో నాయకులు హామ్లెట్ అర్జునుడు, రాస్కల్నికావ్ అనీ తొలి పలుకులో చెప్పారు

మొదటి ప్రపంచయుద్ధం తరువాత ఇంగ్లీషు కవిత్వంలో కొత్త దారులు తొక్కిన కవి టి ఎస్ ఇలియట్ యుద్ధ ఫలితంగా కలుషితమైపోయిన మానవుని ఆధ్యాత్మిక, నైతిక జీవితాన్ని, తారుమారైపోయిన విలువలను, ఆధునిక నాగరికతలోని అనాగరికతను ఆయన కవిత్వం వ్యక్తీకరిస్తుంది ఆయన కవితాప్రభావం రెండో ప్రపంచయుద్ధం తరవాత తెలుగు కవిత్వంలోకి బాగా ప్రవేశించింది ఈ పంథాలో కవిత్వం వ్రాస్తున్న వారిలో బైరాగిగారొకరు టి ఎస్ ఇలియట్‌కు వీరు ఏకలవ్యులని "నూతిలో గొంతుకలు" కావ్యారంభంలో 'వేస్ట్‌లాండ్'నుంచి ఉదహరించిన పంక్తులే కాకుండా, ఈ కావ్యధోరణి అంతా ఋజువుచేస్తుంది అశాంతి, అసంతృప్తి, జవాబులు దొరకని ప్రశ్నలు, జీవితభయం ఈ కావ్యంలో ఏ పేజీ తెరిచి చూసినా కనిపిస్తాయి మొత్తంమీద బైరాగిగారు నిరాశావాదిగా కనిపిస్తారు మానవుడు "బాధ" నుండి తప్పుకోడానికి మార్గం పలాయనం, కృతకశక్తుల పూజనం, ఆత్మహననం అనీ వీరి అభిప్రాయం జీవితసత్యంలోని ఒకభాగాన్ని మాత్రమే వీరు దర్శించినట్లు, మరొక భాగాన్ని వీరు దర్శించనట్లు అనిపిస్తుంది జీవితంపట్ల సమ్యక్‌దృక్పథం ఈ కావ్యంలో కొరవడినట్లుకూడా కనిపిస్తుంది కనీసం అర్జునుడు, రాస్కల్నికావ్ జీవితానికి పరిపూర్ణత్వాన్ని, అర్థాన్ని, ప్రయోజనాన్ని ప్యాలనో, ప్రత్యక్షంగానో పరోక్షంగానో దర్శించారనడానికి ఆధారాలున్నాయి బైరాగిగారి కవిత మరి కొంతకాలానికైనా అటువంటి పరిపూర్ణత సాధించుతుందని ఆశించవచ్చు

కవిత్వశిల్పంలో ఒక ముఖ్యమైన అంశం కుదింపు ఒకమాటలోనో, ఒకవాక్యంలోనో విస్తృతమైన అర్థాన్ని, ఉద్వేగాన్ని ధ్వనింపజేయడం ఏమాటలకు అటువంటి శక్తివున్నదో వాటినే పట్టుకోవడం ఈ కావ్యంలో ఒకభావాన్నే అనేకపదాలలో చర్వితచర్వణంగా రచయిత విపులీకరించారు అక్కడక్కడ అస్పష్టతకూడాఉన్నది "కవిసమస్య"అనే ఖండికలో కవిగారు దోషమంతా శబ్దాలమీదకు త్రోసివేయజూచారు కాని శబ్దాలను లొంగదీసుకుని స్వారీచేయడానికి కవిచేసే ప్రయత్నంలోనే కవితాశిల్పం జనిస్తుందని పలువురి మతం

ఈ కావ్యం అంతటిలోకీ అర్జున విషాదయోగం, రాస్కల్నికావ్ అనే ఖండికలలో కవిశక్తి బాగా ప్రస్ఫుటమవుతున్నది

"విలుగు లెక్కడ సోనియా! ఓ
శైశవేషుల కల్పవల్లీ!
వలపుకోల్లని చిలిపి ఎల్లల
చిన్నిచల్లని కన్నతల్లీ!
బ్రతుకు లోతులు తరచిచూచిన
దానవమ్మా!
విశ్వశోకాశ్రువుల పూరం
నీకు మౌక్తిక కంఠహారం
పంకసంకుల పాపసరసిని
పూచినది నీ ప్రేమపద్మం

ఇత్యాది పంక్తులు చాలా కరుణార్ద్రంగా ధ్వనిస్తున్నాయి "క్రైమ్ ఎండ్ పనిష్మెంట్"లోని సోనియా మహత్వం, రాస్కల్నికావ్ వేదన ఈ ఖండికలో బాగా ప్రతిధ్వనిస్తున్నాయి

ఈ కావ్యం చదివినమీదట బైరాగిగారు పరిగణించవలసిన ఆధునిక కవి అనిపిస్తుంది

పుష్పాంజలి —ఖండకావ్యసంపుటి; కర్త చల్లర భావనారాయణరావు, వెల 0-8 0, నవ్యకళా సమితి, శంకర... సికింద్రాబాదు

బాల సుమతి శతకము: టీకా తాత్పర్యాంగ్లపద వివరణసహితము ప్రచురణకర్త కె నారాయణరావు, జయలక్ష్మి & కో, ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్ నెల్లూరు, వెల 0 4-0

కమ్యూనిజం అంటే. కె. కె. వి వి ఎస్ శాస్త్రుడు, డి ఎస్ సోమయాజులు; వెల 0 8 0, శాప్రచారకసంఘం కాకినాడ



35

జీవితం ఆశావహంగా కన్పిస్తోంది సదానందానికి. రోజురోజుకీ మారిపోతున్నాయి అతని గాలిమేడలూ ఊహాలూ; అటు దైనందిన జీవితమూ, ఇటు శ్యామలమీది అనురాగమూ అతనికి చాలా అనుకూలంగా వున్నట్టే కన్పిస్తున్నాయి. 'దీపం' పార్టీ పత్రికలో అతని బొమ్మలకి విలువ హెచ్చింది. సత్యనారాయణపురంలో నివసించే బీదవాళ్ళకి అతనంటే ప్రేమ ఎక్కువౌతోంది. డాక్టర్ వీరభద్రరావుగారు అతి స్నేహంతోనూ ఉత్సాహపరుస్తున్నాడు.

హాస్పిటల్‌కి ఇప్పుడు రోగుల రాక హెచ్చింది; రాబడిమాట దేవుడెరుగును. డాక్టర్ మంచికేసులు నాలుగు తీసుకుని తన ఖర్చులీ ఆస్పత్రి ఖర్చులీ సమర్థిస్తున్నాడు.

సదానందానికి బైట జీవితం ఎంత ఆశావహంగా కన్పిస్తోందో, ఇంటికి వొస్తే అంత నీరసమూ ఏర్పడుతోంది. రంగయ్యగారు కొడుకును చూడగానే "అమ్మాయి ఎట్లావుందో ఏమిటో!" అంటాడు విచారంగా. ఆయన కిప్పుడు కళ్లు బొత్తిగా కనపడ్డం లేదు. ఒట్టినీడల్ని బట్టి చప్పుడునుబట్టి అన్నిటినీ గుర్తిస్తున్నాడు. ఆయనకళ్లకి ఇప్పుడన్నీ చీకటే. అయితే మనస్సులో మిగిలిపోయిన అనేకజ్ఞాపకాలు, దృశ్యాలు వరసలు వరసలుగా అనుక్షణం కన్పిస్తూ ఆయన్ని మరింత వేధిస్తున్నాయి. పచ్చని చెట్లని, వివిధ వర్ణసంఘటమైన మనోహరప్రకృతిని చూసి కొంతకాలం కళ్లుండి ఆనందించి అంధుడైపోవడం దారుణం. అందులోనూ కవి. ఊహలు సదా పరిగెత్తుతూ, ఏదో రాయాలని, చెప్పాలనీ మనస్సు సదా వేధిస్తూవుంటే ఆయన భరించలేకపోతున్నారు.

ఈ కల్లోలంలో ఆయన కప్పుడప్పుడు తనకూతురు జ్ఞాపకం వొచ్చేది. ఆ వెంబడే అసంపూర్ణమైన తన భాగవతమూ జ్ఞాపకం వొచ్చేది. నిలవలేక తడుముకుంటూ ఆ ఇరుకుగదిలో అటూ ఇటూ అలవాటుకొద్దీ పచార్లుచేసేవాడు. రంగయ్యగారిపరిస్థితి బోనులో పడినసింహంలా వున్నది. ఆయనభార్యకి ఇదంతా చూస్తుంటే మరింత వేదనగావుంది. దీనికితోడు ఆర్థికంగా ఆ కాపురం చాలా దిగజారిపోయింది. అరవైరూపాయల ఆర్జనతో సరిపెట్టడం చాలా కష్టంగా వుంది. రెండొందలరూపాయలలో కొంత మెరుగ్గా బతికిన కుటుంబం అది.

రంగయ్యగారు వివిధరుచులతో కూడిన భోజనంకోసం కాక, తన పుస్తకం పూర్తయ్యేదెలా, అచ్చయి ప్రకటింపబడేదెలా అనే ఆలోచిస్తూంటాడు పొద్దస్తమానూ.

ఇంట్లోకి వొస్తే సదానందానికి తన చెల్లెలి పెళ్లిప్పటి ఫోటో తను రాసిన బొమ్మలమధ్య కన్పిస్తుంది. చెల్లెలి అత్తవారికివ్వవల్సిన బాకీ తీర్చేదెట్లా, అనేసమస్య అతన్ని వేధించేది. తీర్చేమార్గమే కన్పించటంలేదు. ఐదొందలు! మాటలా! అసలాసంఖ్య ఊహించటమే భయం అతనికి. బ్యాంకీల్లోనూ, ట్రెజరీల్లోనూ వంద కాయితాలుంటాయి, బాగా వున్నవారిదగ్గర వుంటాయి .. తనబోటివాడికి వంద కాయితం కల్లోకూడా తటస్థపడదు ..

అయితే సదానందం ఇంట్లోంచి అడుగు బైటికి పెట్టాడంటే ఇవన్నీ కొంతవరకు మర్చిపోయి, దీపం పార్టీ రాజకీయాల్లోనూ, డాక్టర్ గారి రోగుల మందుల్లోనూ మనస్సును లీనంచేసి తిప్పుకుంటాడు. రకరకాల రోగాలకి వీరభద్రరావుగారిచ్చే అరకులు అంతగా పనిచేయకపోయినా రోగులకి మందు తాగుతున్నామనీ, రోగం కుదురుతుందనీ ఒక గట్టివిశ్వాసాన్ని అవి కలిగిస్తున్నాయి. డాక్టర్ ఆ బీదరోగులరోగాల్ని తియ్యని ఉపశమనవాక్యాలతోనూ, పరీక్ష పేరిట జరిపే తతంగంతోనూ నీళ్లకంటె మరేం లేని ఎర్రరంగుమందుతోనూ, తాత్కాలికోపశాంతి కలగచేస్తుంటాడు. వీటిని గురించిన శంకలు నిరర్థకమని సదానందానికి తెలుస్తూనేవుంది. ధర్మాస్పత్రిలోమాత్రం ఇంతకంటే మంచిమందు లిస్తారన్న ఆశేం వుంది గనుక!

సదానందం ఖచ్చితంగా జీవితసంఘర్షణలోపడి, ఏ కొద్దిపాటి వెలుగేనా ఈ చీకటిలోనుండి బైటపడ్డానికి కనపడుతుందేమోనని చూస్తున్నాడు. ఏదో కన్పిస్తున్నట్టే వుంది అయితే చాలా దూరంలో—లీలగామాత్రమే.

ఒకనాడు మధ్యాహ్నం బొమ్మలసంగతి మాట్లాడ్డానికి "ప్రసన్న" ఆఫీసుకి వెళ్లాడతను. వాకిట్లో మామిడాకులతోరణం కన్పించింది. లోపల కేసులకింద "స్వాగతం" అని పెద్ద అక్షరాలతో కాయితం అంటించిన మేదగతడిక కన్పించింది. ఆపక్కనే చిన్నచిన్న అట్టలమీద దీపం పార్టీ నినాదాలు ఇంగ్లీషులోనూ తెలుగులోనూ రాసి పెట్టి వున్నాయి. ఆఫీసులో ఎన్నడూ లేనిది ఐదారుగురు నీలంచొక్కాలు, ఖాకీనిక్కర్లతో [illegible] పార్టీగుర్తు 'డవాలీ'లు అపసవ్యంగా వేసుకుని గర్వంగా తిరుగుతున్నారు. ఇంకా ఏవో బోర్డులు రాస్తున్నారు హడావుడిగా. లోపల ఎడిటర్ గారిగదిలో ఓ ఇద్దరు పెద్దలు [illegible] ఎడిటర్ గారితో ఏవో చర్చిస్తున్నారు.

సదానందం ఈ హడావుడినంతా అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ, ఎడిటర్ గారి గదిలోకి వెళ్లి ఆయనకి నమస్కరించి నిలబడ్డాడు. ఎడిటర్ వినాయకరావుగారు ఖాళీగావున్న స్టూలు చూపిస్తూ, "కూర్చోవోయ్!" అని, తన ఎదుట కూర్చునివున్న ఒకాయనకి సదానందాన్ని పరిచయంచేస్తూ, "ఈ యువకుడు

మనపత్రిక చిత్రకారుడండి. పైకి రావలసినవాడు. మనపార్టీ అభిమానికూడా" అన్నాడు.

సదానందం ఆ పెద్దమనిషివైపు చూశాడు. ఆయనకి నలభైఏళ్లుంటాయి. పెద్దలాల్చీ మోకాళ్లదాకా వేళ్లాడుతోంది. మొహం రక్తహీనతవల్ల వెలవెలబోతున్నా గంభీరంగావుంది. జుట్టు సగం నెరిసింది... ఈలోగా ఎడిటర్ గారు "సదానందం వీరు విజయవాడ దీపంపార్టీ ప్రధాన కార్యదర్శిగారు. పేరు కోదండపాణిగారు. నువ్వు వినేవుంటావు" అన్నాడు.

సదానందం తలవూపాడు. కార్యదర్శి కోదండపాణిగారు మిగతావారినికూడా పరిచయంచేశారు. ఆ వొచ్చినవాళ్లందరూ బాగా డబ్బున్నవాళ్లు.

ఆతర్వాత సదానందంతో ఎడిటర్ గారు "రేపు ఢిల్లీనుంచి అఖిలభారత దీపక్ పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీ గోవర్ధనదేశపాండే గారు వొస్తున్నారోయ్. పెద్దసభ — ఆతర్వాత బహిరంగసభ జరుగుతాయి. ఒకవారంవుంటా రిక్కడ. ఆంధ్రలో దీపంపార్టీ స్థితిగతుల్ని తెలుసుకొని దాని అభివృద్ధికి కొన్నిసలహా లిస్తారు. గొప్ప రాజకీయతాత్త్వికవేత్త. నువ్వు రేపు స్థానికసభకి రావాలి మనపార్టీ ఆశయాల్నిగురించి చాలావిషయాలు తెలుసుకోవచ్చు" అన్నాడు.

సదానందం "సరేలెండి" అని సెలవు తీసుకున్నాడు అక్కణ్ణించి.

మర్నాడు మధ్యాహ్నం మూడుగంటలకి పాత బెజవాడలో కోదండపాణిగారి మేడలో దీపంపార్టీవారి సర్వసభ్యసమావేశం ఏర్పాటయింది.

సదానందం ఈ వివరాలు డాక్టర్ తో చెప్పాడు. "వెళ్లొస్తానండి. ఏమంటారు?" అని అడిగాడు.

డాక్టర్ మాటినీ సినిమాకు వెళ్తూ, "వెళ్ళిరావోయ్. అదొక కొత్తఅనుభవంగా వుంటుందిలే. కొత్తగా క్లాసులోకి అప్పుడే ప్రవేశించిన ఒకటోక్లాసు అబ్బాయల్లే మొహం పెట్టకుండా, ఏదో కాస్త తెలిసినవాడల్లే కనిపించు. లేకపోతే అభిమానుల్లూ పార్టీ వర్కర్లూ నీకు తాటాకులు గడ్తారు. జాగ్రత్త" నవ్వుతూ అన్నాడు. ఆయన వెళ్లాక సదానందం డిస్పెన్సరీ మూసేసి పాత బెజవాడ వెళ్లాడు.

దుర్గకొండదిగువున పెద్దమేడ అది. రెండోఅంతస్తుమధ్య పెద్ద హాలు పార్టీసభ్యులతో అభిమానులతో వర్కర్లతో వాలంటీర్లతో కిటకిటలాడుతోంది. ఇంకా కార్యక్రమం ఆరంభం కాలేదు. చాలా రాజకీయ, సాహిత్యసమావేశాల్లోలాగే ఇక్కడకూడా ప్రధాన కార్యక్రమం, టీపార్టీ.

ఢిల్లీనుంచివొచ్చిన అఖిలభారత దీపక్ పార్టీ (అ. భా. దీ. పా.) కార్యదర్శి గోవర్ధనదేశపాండేగారు హాలు చివర ఎత్తయిన వేదికమీద హుందాగా కూర్చుని ఆంధ్ర దీపంపార్టీ కార్యకర్తలతో చాలా సన్నిహితంగా చర్చిస్తున్నారు. వారితో మరింత సన్నిహితంగా మాట్లాడ్డానికి కార్యకర్తలు ఒకరినొకరుతోసుకుంటూ అటూయిటూ కదుల్తున్నారు.

పదినిమిషాలకల్లా మాడరన్ కేఫ్ వాన్ లో టీపార్టీ సరుకు దిగింది. హాల్లోవున్న జనం నెమ్మదిగా సర్దుకుని కూర్చున్నారు. సదానందం వేదికకు దిగువ నాలుగో వరసలో, ఎడిటర్ గారి పక్కన కూర్చుని చూస్తున్నాడిదంతా. అందరూ ఏ పదిమందో తప్ప—నీలం చొక్కా, ఖాకీ నిక్కర్లు తొడుక్కుని వున్నారు. వాలంటీర్లు దీపం ప్రమిద గుర్తుగల డవాలీలు అపసవ్యంగా వేసుకుని పొట్టి లాటీకర్రలతో అందర్నీ సర్దుతూ అదుపులో పెడుతున్నారు. అందరి మొహాలూ ఆదుర్దాగా వున్నాయి.

సదానందానికి ఆశ్చర్యంవేసింది. ఇందర్ని ఆకర్షించేంత గొప్పతనం, టీ—ఫలహారాలదా, ఢిల్లీనుంచి వొచ్చిన నాయకుడిదా అని అతని సంశయం.

ఫలహారాలు ఘనంగా వున్నాయి. రెండేసి స్వీట్లూ, రెండేసి కారం సరుకులు, కాఫీ—కిల్లీ సిగరెట్టూ—టీ పార్టీ గొప్పగా వుంది.

కార్యకర్తలు అభిమానులూ విలేఖరులు అడిగి వడ్డించుకుని తింటున్నారు. సర్వర్లు సతమతమౌతున్నారు. ఎనిమిదివందల మందికి ఒక్కసారి అన్నీ అందించడం మాటలా! మొత్తానికి ఢిల్లీ నాయకుడి గౌరవార్థం టీ పార్టీ అఖండవిజయంగా సాగి, సంతృప్తిగా ముగిసింది. చివరికి సభ్యులు వొదిలేసిన పొట్లాల్నీ కాఫీల్నీ మోసుకు క్లీనర్లు పోతూంటే సదానందం చూశాడు. అతని ప్రాణం వుసూరుమంది. ఇంకో ఐదువందలమంది బీదవాళ్ళ కవి ఉపయోగపడివుండేవి...డబ్బు దుర్వినియోగం చెయ్యడం అంటే ఏమిటో మొదటిసారి తెలుసుకున్నాడతను.

టీపార్టీ గోల అరగంటకి తగ్గింది. తర్వాత సన్మానపత్రాలు చదివి గోవర్ధన దేశపాండేగారికి సమర్పించారు వివిధప్రాంతాల పార్టీ నాయకులు. సదానందం వింటున్నాడు. "నువ్వు గొప్పవాడివి. దేవుడంతటివాడివి. నీ కీర్తి అమోఘం. నువ్వులేనిదే దీపక్ పార్టీ లేదు..." అని—ఒకటే భట్రాజు పొగడ్తలవి. మనిషన్నవాడిని ఎదుట గుండ్రాయల్లే కూర్చోబెట్టి ఇలా ఒక్క వరసని పొగిడేస్తూవుంటే అతనికి సిగ్గెయ్యదేమో! అనిపించిం దతనికి. వీళ్ళకీ సిగ్గులేదే! ఇంకొకడు దేవుడే కావచ్చు, వాణ్ణి నువ్వు గౌరవించ వొచ్చుగాక, "నీవే తప్ప నితఃపరం బెరుగ"నని మొహంమీద పొగిడెయ్యడం ఏమిటి దరిద్రం! అనిపిస్తోంది. కాని పైకి ఏమనగలడు? అందరితో పాటే చప్పట్లు చరుస్తున్నాడు. జేజేలు కొడ్తున్నాడు. కిల్లీనములుతూ, సిగరెట్ పొగ వూదుతూ, ఈ తతంగమంతా వింటున్నాడు. అతనికి ఎడంవేపాళ లావాటి పార్టీమెంబరే గావును కూర్చుని ఉత్సాహం పట్టలేక సదానందంవీపు రెండుసార్లు చరిచాడు. సదానందం రెండుసార్లూ ఆయన్ని మెల్లగా పిల్చి, "అలా కొట్టకండి నన్ను దయచేసి. బక్కవాణ్ణి!" అని మనవిచేశాడు. ఆ లావాటాయన ఇతన్ని పక్కచూపుచూసి వూరుకున్నాడు. తర్వాత వీపు చరచలేదు. కుడివేపు ఒకపార్టీవర్కరు కూర్చుని వున్నాడు. ఇంకా అధ్యక్షుడు వుపన్యాసం ప్రారంభించలేదు. ఆ పార్టీ వర్కరు సదానందాన్ని "ఏమండి మీరు, పార్టీమెంబర్ కాదా?" అని అడిగాడు.

"కాదండి, నేను అభిమానినండి" అన్నాడు సదానందం క్లుప్తంగా.

ఆపార్టీవర్కరు "మనపార్టీ మెంబర్ కానివాడూ వున్నాడా ఈ భూమ్మీద!" అన్నంత ఆశ్చర్యంగాచూశాడు సదానందంవంక.

ఇంతలో సమావేశానికి అధ్యక్షతవహించిన ఆంధ్రప్రదేశ దీపంపార్టీ అధ్యక్షుడు లేచాడు చప్పట్లమధ్య. ఈయన సన్నగా నల్లగా వున్నాడు కళ్లజోడు పెట్టుకున్నాడు. బాగా పొడగరి. చప్పట్లు అంతరించి హాల్లో చప్పున నిశ్శబ్దం అలుముకుంది.

బయట వాన చినుకులు కనపడసాగాయి. ఆకాశం దట్టమైన మబ్బులలో చీకటి కమ్మేసింది. లోపల హాల్లో ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి.

అధ్యక్షుడు గొంతు సవరించుకుని, ఢిల్లీనాయకుణ్ణి సభికులకి పరిచయంచేస్తూ, "వారికి తెలుగురాదు. ఇంగ్లీషు మ్లేచ్ఛభాష గనక మాట్లాడరు; మంచి వ్యాకరణయుక్తమైన హిందీలో మాట్లాడ్డమే నిజమైన భారతీయుని విధియని గట్టిగా నమ్మినవారు. గనక, వారు అటువంటి హిందీలోనే వుపన్యసిస్తారు. దాన్ని మన విజయవాడ హిందీ అనురాగమండలి ప్రచారకులలో ఒకరు తెలుగున అనువాదం చేసి చెబుతారు" అన్నాడు.

మళ్ళీ చప్పట్లు మోగాయి, టపాకాయలు పేలినట్టు. ఇందాక వున్నంతవుత్సాహం సభికుల్లో కన్పించలేదు. వ్యాకరణ యుక్తమైన హిందీ అనేప్పటికి చాలామందికి చిన్నప్పుడు చదివిన తెలుగు వ్యాకరణం జ్ఞాపకంవొచ్చి భయమేసిందేమో!

★ అపస్వరాలు ★

సదానందం అయోమయంగా వింటున్నాడు చుట్టూ చూస్తున్నాడు అతనెప్పుడూ సూటిగా నిర్మలాంతఃకరణతో ఆలోచిస్తాడు

సభాధ్యక్షుడు కూర్చోగానే ఢిల్లీనాయకుడు లేచి మైక్ ముందు నిలబడ్డాడు మళ్లీ బ్రహ్మాండంగా చప్పట్లు మోగాయి యాంత్రికంగా సదానందంకూడా చప్పట్లు చరిచాడు

గోవర్ధన దేశపాండే నొక్కి వక్కాణించినట్టుగా ఏదో హిందీలో చెబుతున్నారు పక్కనే నుంచున్న ఒకరు తెలుగు అనువాదం ప్రారంభించారు

మొదట ఆంధ్రలో దీపక్ పార్టీగురించి ఉపన్యసించారు. ఆతర్వాత పార్టీగురించీ, పార్టీఆదర్శాలనుగురించి చెబుతూ, "అందరూ నీతిగా వుండాలి" అన్నారు దీనికి తెలుగులో వివరణ కొండంత అయింది ఉపన్యాసం రసపట్టులో వుంది సభలో సందడిలేదు

"మనం నీతిగా ప్రవర్తించాలి ప్రజల్ని నీతి తప్పకుండా ఉండేట్టు చూడాలి" అన్నారు దేశపాండేగారు

సదానందం సభికులవంక చూశాడు. సభాధ్యక్షుడితో సహా అక్కడ కూచున్న వాళ్లల్లో సగంమంది వ్యాపారాలుచేసి కొంప లార్పి బాగుపడ్డవాళ్లే వాళ్లు వినక నీతి తప్పారేమోగాని ప్రస్తుతం వ్యాపారాలు మానేసినవాళ్లుమాత్రం ఉన్నది తింటూ నీతిగానే బతుకుతున్నారు. ఇంకా వ్యాపారాలుచేసేవాళ్లూ, కంట్రోళ్లు లేవు గనక నీతిగానే వుండవల్సి వస్తున్నది ఇంక ఈ ఉపదేశం ఎవరికి?

మిగతా సగంమంది మధ్యతరగతి దౌర్భాగ్యులు — జీతా నిరుద్యోగులు వాళ్లు నీతితప్పటానికి వీల్లేకండా, కావల్సినన్ని కష్టాలూ పోలీసులూ — ఇంకేముంది?

ఉపన్యాసం సాగుతోంది విషయం మారింది వ్యాకరణ యుక్తమైన హిందీకి అనువాదకులు వ్యాకరణయుక్తమైన తెలుగులో "మనలో చాలమందికి తమ ఆరోగ్యము నెట్లు కాపాడుకొనవలెనో పూర్తిగా దెలియదు వారికి భుజించుట ఎట్లోగూడ దెలియుటలేదు "అంటూ భోంచేసేపద్ధతుల్ని ఏకరువు పెడుతున్నారు. ఇది ఢిల్లీనాయకుని స్వానుభవం గావును, తెగవర్ణించేస్తున్నాడు

సదానందానికి ఆశ్చర్యం వేసింది రాజకీయ మహాసభలో భోజనోపదేశం ఏమిటి? అనిపించిం దతనికి "భోజనము మానవుని మొదటి అవసరము!" అని నాయకుడు గర్జించుతున్నాడు

కాని సదానందానికి ఇంకో అనుమానం వేసింది సత్యనారాయణపురంలో గూడెంప్రాంతంలో నివసించే ప్రజల్ని అతను ఎరుగున్నాడు వాళ్లెవరికీ పూటా కూడు గ్యారంటీలేదు తనతో, తనచుట్టూ కూర్చుని అదే ఉపన్యాసం వింటున్న — ఆ నేకమందికిగూడా రాత్రిభోజనం గ్యారంటీవున్నట్టు తోచదు భోజనం వుంటేగదా ఎల్లా తినాలో అనే జిజ్ఞాస? భోజనమే లేకండా భోంచేసే పద్ధతులు ఉపదేశించటం రాజకీయచాతుర్యం గావును! సమస్యల్ని తప్పుదారి పట్టించటం అంటే ఇదే గావును అనుకున్నాడు కమ్యూనిస్టు

ఉపన్యాసకులు ఆరోగ్యం కాపాడుకోవల్సిన విధులను గురించి గూడా ఉద్ఘాటించారు తినేవన్నీ అతి చవకబారు తిండి తినప్పుడు ఇంక అనారోగ్యంగాక మరేమిటి? వాళ్ళని ఈ ఉపన్యాసాలు బాగుచెయ్యవు — కాకపోతే డబ్బు పుష్కలంగా వున్న వాళ్ళకి వినియోగిస్తాయి సదానందం అనుకున్నాడు

ఆ తర్వాత పార్టీ ఆదర్శాలనుగురించి చెప్పబోతున్నాడాయన

సారాంశం దేశంలో నిరుద్యోగం, ఆకలి వుండడం నిజమే నని, వాటిని నిర్మూలించాలంటే ధనికుల మనస్సులూ, భూస్వాముల మనస్సులూ మాటలుచెప్పి 'త్యాగం' చేసి మార్చి కరిగించా లని — ఇందుకు ప్రతి దీపక్ పార్టీ సభ్యుడూ పాటుపడాలి అని

సదానందానికి ఉన్న మతి పోతున్నది ఏమిటీ మోసం? డబ్బే జీవనాడి ఐన ఈ సమాజంలో ఎవడు మనసు కరిగి ఇంకోడికి తోడ్పడతాడు? పుట్టిననించే కులాలనీ మతాలనీ ఇనుపగోడలు కట్టుకుని నివసించే మనుషుల మనస్సులా మారేది? బాగా అభివృద్ధి పొందామని రొమ్ము విరుచుకుతిరిగే పాశ్చాత్య దేశాలే జాతివర్ణ భేదాలతో సతమతమౌతూంటే, ఎంతో ముందడుగు వేస్తున్నామని చెప్పుకునే పార్టీలే మత రాజకీయాలతో కుళ్ళికంపు కొడుతూవుంటే, మనస్సులు కరగడం, ఇతరుల్ని కనికరించడం ఆదర్శాలే కాని ఆచరణ సాధ్యం కాదు మరి వీళ్లు ఏమిటి ఇలా అరుస్తున్నారు? ఎవర్ని ఉద్ధరించను? సదానందం, ఆలోచిస్తున్నాడు

ఇదంతా — రోజూ తను మామూలు పనులతో విసిగి వేసారి ఆ రొటీన్ భరించలేని డబ్బుగలవాళ్ళూ, మధ్యతరగతివాళ్ళూ ఈ రొచ్చు జీవితాన్ని మరిచిపోడానికి చేసే తతంగం — అనిపించిం దతనికి

సభావేశం కోలాహలంగా ఎనిమిదింటికి ముగిసింది, ఈలోగా లోపల్నించి వెళ్ళిపోదామని సదానందం అనేకసార్లు ప్రయత్నించాడు గాని, కుడివేపు కూర్చున్న లాంటి పార్టీ అభిమాని వదలనిచ్చాడుగాదు ఎడంవేపున్న వర్కరుగూడా "అయిపోతోంది ఉండండి' అంటున్నాడు

చిట్టచివరికి కొనప్రాణంతో బయటపడ్డట్టుగా చల్లగాలిలోకి వచ్చి పడ్డాడు ఆ చిత్రకారుడు తిరిగి స్వర్గంలో కొచ్చినట్టుంది రోడ్డుమీద మనుషులు యథార్థంగా సహజంగా మాట్లాడుతూ, ప్రకృతిసిద్ధంగా ప్రవర్తిస్తూ అతని పక్కనే నడుస్తున్నారు మబ్బుల దట్టమైన తెరలోంచి చంద్రుడు చాలా మసగ్గా కనిపిస్తున్నాడు ఆ సభావేశంలో మాట్లాడిన ప్రతివాడు, తన చుట్టూ కూర్చున్నవాళ్ళూ అందరూ యంత్రప్రాయంగా, ఏవో ముందే నిర్ణయించుకున్న కొన్ని అసహజమైన సూత్రాలకి కట్టుబడి, వాటినే చెబుతూ వాటినే వింటూ వాటినే ఆలోచిస్తూ పూర్తిగా జీవచ్ఛవాల్లా వున్నారేమిటి? అనిపించింది అతనికి.

అతను స్వేచ్ఛగా చల్లగాలి పీలుస్తూ తెరిపిగా సన్నజల్లులో తడుస్తూ సత్యనారాయణపురంవేపు నడిచి వెళ్ళిపోయినాడు

36

జయ మొగుడితో మొదటిసారి మాట్లాడింది త్రయంబకరావు జయకి గజందూరంలో కుర్చీని మెల్లవంక చూస్తూనే, ఎవరన్నా వొస్తారన్న భయం లోపల పీకుతూవుంటే, "నిజం చెబుతున్నాను జయా! నన్ను చూసి ఈ భూమ్మీద భయపడ్డ మొదటి జీవి నువ్వే కనపడుతున్నావు! నిజంగానా! దేన్నిగురించి భయపడ్డావు?" అని ప్రశ్నించాడు

జయ కిటికీలోకి చూస్తూ, "నాకు తెలీక " అని మాత్రం అంది

కిందనించి ఎవరూ రారని తల్లి అసలు ఆవేళప్పుడు రాదని దృఢపర్చుకున్నాడు త్రయంబకరావు తెగించి జయ మంచంమీద కూర్చుని "పిచ్చిదానా, ఏదో కథవిని భయపడ్డావుటగా! దానికి నాకూ ఏం సంబంధం? అంటూ ఆమె చుబుకొన్ని స్పృశించాడు, "ఇంక దేనికీ భయపడకు! ఎవరికీ భయపడకు నాన్న, అమ్మ వొట్టి మాటలేకాని క్రియకి మనమాట వినేవాళ్ళే ఎందుకంటావా, వంశానికి ఏకపుత్రుణ్ణిగా!" అన్నాడు

జయ మాట్లాడకుండా భర్త చెయ్యి తన చేత్తో పుచ్చుకుని దృష్టిని భర్త మొహంమీద కేంద్రీకరించింది.

భర్త ఇంకా చెప్పుకుపోతున్నాడు. "అంతగా, ఇంకా ముదురుతుందీ వ్యవహారం! మనం ఇద్దరం జై పరమేశ్వరా! అని బయల్దేరటమే. మన కేమీ ఫర్వాలేదు. మా అమ్మమ్మ ఆస్తి కూడా మనకే. వాళ్ళకి వారసులు లేరు. అక్కడికి వెళ్ళిపోదాం. నెలరోజులు నేను కనపడకపోతేనా, అమ్మ మంచంపట్టినంత పనై మన దగ్గిరకి పరిగెత్తుకుంటూ వస్తుంది తెలుసా?" అన్నాడు.

జయ మెల్లిగా "ఏమండీ, మరి మా నాన్నవాళ్ళ క్షేమసమాచారా లేమైనా తెలుస్తున్నాయా?" అని అడిగింది. త్రయంబకరావు ఆమె ముఖంలోకి జాలిగా చూస్తూ, తనతో అక్క చెప్పిన మాటలు నెమరుకు తెచ్చుకున్నాడు. ఒక్క రెండు నిమిషాలాగి, "మీ నాన్నకేం? అక్కడ అంతా కులాసాగానే వున్నారట. మొన్ననే ఎవరో వచ్చి చెప్పారు" అన్నాడు. ఇది అబద్ధం అని అతనికి తెలుసు కాని, రమణమ్మ అలా చెప్పమన్నది. నిజం చెబితే, ఆమె కింకా జబ్బు ఎక్కువకావచ్చు అని ఆమె వుద్దేశం.

ఇలాగే భార్యాభర్తల సమావేశాలు అనేకం జరిగాయి. ఉధృతమైన వానాకాలం గడిచింది. ప్రకృతి పచ్చపడి, పంటలు చేతికొచ్చే రోజుల్లో చలి కొద్దిగా ప్రారంభించిన ఒకరోజున త్రయంబకరావు జయతోటి మేడమీది గదిలో మాట్లాడుతూ, "మా నాన్న నన్ను ఎక్కడికో పంపిస్తానంటున్నాడు. నువ్వూ వొస్తావా? ఇక్కడే వుంటావా?" అని అడిగాడు కిటికీలో నుండి సాయంకాలపు నీరెండ జయ సింధూరవర్ణపు చీరమీద పడి చెదిరిపోతోంది. ఆమె కిప్పుడు కులాసాగావుంది. ఆమె మొహం ఎంతో కళగావుంది. చాలవరకు ఆరోగ్యం కోలుకుంది.

"మీ రిక్కడ లేకుండా నేను వుండలేనండి" అంది ఆమె గారాబంగా.

"నన్ను చూస్తేనే బెదిరి కిందపడిపొయ్యేదానివి గదూ? ఇప్పుడిట్లా మారిపోయినావు" అన్నాడు త్రయంబకరావు ముద్దుగా అత నిప్పుడు జయ ఎట్లా అనమంటే అట్లా అంటాడు. అక్క చెప్పినమాటే వేదవాక్యం.

"అయితే / మా అమ్మమ్మగారింటికి [illegible] రేపో ఎల్లుండో ప్రయాణం" అన్నా డతను.

"ఏవూరుకి?" అని అడిగింది భార్య.

"అమరావతి" అన్నాడు భర్త.

రాత్రిపడుతోంది. త్రయంబకరావు కిందకి దిగుతూ, "రాత్రికి నాన్నతో చెబుతానే...ఏమీ అనడు మూడొంతులు" అన్నాడు.

అతనన్నట్టే రాత్రికి భోజనాలదగ్గిర వొచ్చింది సమస్య.

శేషాద్రిరావుగారు, చారెడు నెయ్యివేసుకుని ఉల్లిపాయ కొరుక్కుంటూ గోంగూర పచ్చడన్నం తింటూ, "ఏమిరా అబ్బాయి, రేపొద్దున్నే వెళ్తావా?" అని ప్రశ్నించాడు.

కొడుకు, "ఎందుకు వెళ్ళను నాన్నా?" అన్నాడు.

తల్లి, "వెళ్ళిరారా అబ్బాయి, పదిరోజులుండిరా. అమ్మమ్మ ఎన్నాళ్ళనించో కలవరిస్తోంది" అంది. అసలు తల్లితండ్రులు ఎత్తే ఇది. ఇటీవల జయా త్రయంబకరావూ కొంచెం సన్నిహితంగా వుండటం వాళ్లు పసిగట్టారు. ఇది భరించలేకపోతోంది జానకమ్మగారు. ప్లీడరుగారి కంత బాధలేకపోయినా, కట్నం బాకీ రాలేదన్న కసిమాత్రం ఇంకాపోలేదు. అందుకని ఆలోచన చేశారిద్దరూ, కొడుకుని అమరావతి పంపించి నెలో పదిరోజులో అక్కడవుంచి జయని కొంత బాధించాలనే లోపాయికారీ సంకల్పం ఏర్పడ్డది వాళ్ళకి.

రమణమ్మ తమ్ముడికి ఇదంతా వివరించి చెప్పింది. "నీ పెళ్ళాం నువ్వు లేకుండా ఇక్కడ ఈ నెలరోజులూ వుంటే జబ్బు తిరగబెడుతుంది. ఎట్లాగైనా దాన్ని కూడా తీసుకెళ్ళు."

త్రయంబకరావు వెంటనే కాకపోయినా కొంతసేపటికి అర్థం చేసుకున్నాడు అక్కగారిని. "దానికేముందిలే అక్కయ్యా! మనం ఎక్కడవుంటే అదీ అక్కడే!" అన్నాడు.

"అమ్మా మరి నీ కోడలుకూడా వొస్తానంటున్నది మరి తీసుకెళ్తాను..." అంటూ దీర్ఘంతీశాడు. తల్లివంక చూస్తూ కొడుకు.

"ఎవ్వే! దానికి వొంట్లో ఏమీ బాగోలేదురా! దాన్నెట్లా తీసుకెళ్తావు! నువ్వు పోయిరా! అప్పుడే చెవిలో ఊదిందీ!! ఏం

★ అపస్వరాలు ★

...సియ్యబోయినా వీడో శిటకం పెడ్తూనే వుంటుంది" అని విసు...క్కుంది తల్లి. పథకం చెడిపోతున్నదే అని ఆమెకి మంట.

శేషాద్రిరావుగారు, "నువ్వు సరదాగా వెళ్ళి ఓ వారంపాటు ...ండిరావటానికి అదికూడా ఎంగుకోయి, మొడకోడోలు! ఇంత ...లివి తక్కువేం?" అని కేక వేశేడు.

అప్పటికి చేసేది లేక వూరుకున్నాడు సుపుత్రుడు.

భోజనాలయినాక మేడమీద రమణమ్మ తమ్ముడితో అంది. "ఏమిరా! వాజా! వాళ్ళని అడిగితే పంపిస్తార్రా ఇద్దర్నీ! తెలివి ...తక్కువ దద్దమ్మా!"

"మళ్ళీ మొదలెట్టావు బాజా అని! మరి నన్నేం చెయ్య...న్నావే?" అని సణిగాడు త్రయంబకరావు, మెట్లదగ్గర పిట్టగోడ ...మీద కూర్చుని.

"అన్నీ చెబితేగాని చెయ్యలేవు! ఏం మనిషివిరా! తోచ...క్కర్లా? పొద్దున్నే వెళ్లు. జట్కా మాట్లాడుకురా. నీ పెళ్లాన్ని ...లు. ఇద్దరూ కలిసి బండెక్కండి. అంతే. బయల్దేరేప్పుడు ఎవరూ ...ఏమీ అనరు! తెలిసిందా!" అన్నది అక్క.

"భేష్! అక్కయ్యా! భేష్. అంతేచేస్తాను." అన్నాడు ...తమ్ముడు.

37

కలప అడితి కొన్నరోజున వరదరాజు అటు వెళ్ళనేలేదు. టికెట్లో గందరగోళంతో విసిగిపోయాడు. మంగళాజపురం కొండమీద మండపంలో శిలకానుకుని కూర్చుని రెండు ప్యాకెట్లు సిగరెట్లు తగలేశాడు. అతనిచుట్టూ అంతా డబ్బే కనిపిస్తున్నది. వినక సౌమ్యంగానూ, స్నేహపూర్వకంగానూ పలకరించిన తన మనుషులో వాళ్ళిప్పుడు తనని ఆ విధంగా దగ్గరకొచ్చి పలకరించటానికి భయపడుతున్నారు...ఏడుకొండలుగూడా కొంచెం జంకుతున్నాడు..... అతనికి మనశ్శాంతి లభించేదల్లా శచ్చు మేడలో ...ప్రాడు—తప్పితే ఈ నిర్జనమైన మండపం ఇక్కడనించి కనిపించే విజయవాడ—కింద జనంలోకలిసి ఆ గందరగోళంలో పడేకంటే, పైనించి ఆజన సందోహాన్నీ—బస్తీ రాపిడినీ చూస్తో ఏ ఆలోచనా చెయ్యకండా వుండడంవల్ల గొప్ప శాంతి లభిస్తుంది.

నాలుగోరోజు వరదరాజు మంచిరోజు అని బ్రహ్మానందం చెబితే అడితీలో అడుగుపెట్టాడు.

ఆ అడితీకి ఇరుప్రక్కలా బ్రహ్మాండమైన అడితీలున్నాయి ఆకాశాన్నంటుతున్నట్టు పెద్దపెద్ద టేకిదూలాలూ వెదురూ పేర్చివున్నాయి. ఎదురుగా కాలవ నెమ్మదిగా ప్రవహిస్తూంది. పెద్ద పెద్ద పడవలు నిదానంగా సాగిపోతూన్నాయి. అడితీలు కాలవటంతో అంతటా సందడి తక్కువగావుండి చాలా ప్రశాంతంగా వుంది.

వరదరాజు కొన్న అడితీ దాదాపు ఖాళీగావుంది. రెండు మూడు దుంగలు ఆ విశాలమైన ఖాళీస్థలంలో దృష్టి పరిహారార్థం పడివున్నాయి.

బ్రహ్మానందం ఓ బ్రాహ్మణ్ణి మాట్లాడుకొచ్చాడు. అప్పుడు ఉదయం తొమ్మిదిగంటలవుతుంది. బ్రాహ్మడు కొబ్బరికాయ కొట్టి షావుకారునీ గుమస్తాను సుముహూర్తాన లోపలికి ప్రవేశపెట్టాడు. వరదరాజు లోపలికి అడుగుపెట్టి చుట్టూ చూశాడు. అతనికి రెండు పెద్ద దుంగలు కంటబడ్డాయి.

బ్రహ్మానందం గుండెలు దడదడలాడుతున్నాయి. ఇకే వరదరాజు అడితీని చూడ్డం. "ఈ రెండు దుంగలకేనా ఆరు వేలూ?" అంటూ తెమానని బాధపడుతున్నాడు. ఇప్పుడు తను తప్పుకోటానికి లేదు—అడ్వాన్సు వందరూపాయలూ పుచ్చుకున్నాడాయె. .. వరదరాజు, తను కూర్చోటానికి అడితీలోపల టేకిచెక్కలతో కట్టిన గదివంక చూస్తూ, బ్రహ్మానందాన్ని ఓరగంటితో ఒకసారి చూసి, పకపక నవ్వాడు.

బ్రహ్మానందానికి ఇతను ఎందుకు నవ్వుతున్నాడో అర్థంకాక తికమకపడుతున్నాడు. వరదరాజే అందుకున్నాడు, "పంతులుగారూ! చాలా బాగుందండి అడితీ! ఎంత ఖాళీగా, ఎంత విశాలంగావుంది స్థలం!" అంటూ తిరిగీ నవ్వాడు.

మంత్రపుష్పంచదివి అడితీ అంతటా తమలపాకుతో శుద్ధి నీళ్లు చల్లుతూన్న బ్రాహ్మణుడు, తన పని తొందరగా ముగించి, దక్షిణ పైసాలకోసం నిలబడ్డాడు.

వరదరాజు తమలపాకుల్లో ఓ రూపాయిపెట్టి ఆయనకిచ్చాడు. బ్రాహ్మణుడు పావలా వస్తుందనే అనుకుంటున్నవాడు కొంచెం ఆశ్చర్యపడి నిష్క్రమించాడు.

వరదరాజు పరాసరి తన గదిలోకివెళ్ళి చూశాడు బ్రహ్మానందం అన్నీ అమర్చివుంచాడు. నాలుగు కుర్చీలూ, టేబిలూ, రెండు బీర్వాలూ, టేబుల్ ఫాన్ వొకటీ వున్నాయి. గదంతా టేకిచెక్కలతో కట్టిందే. చాలా విశ్రాంతిగావుంది లోపల. బీర్వాల్లో కొత్తపుస్తకాలు, పసుపు కుంకుమపూసి "శ్రీరామ" అని రాసి పేర్చివున్నాయి.

వరదరాజు దిండున్న కుర్చీలో కూర్చుని, "పంతులుగారు, అడితీ చాలా వసతిగావుంది గాదు!" అన్నాడు చిరునవ్వుతో.

బ్రహ్మానందం అతనికి ఎదురుగా నిలబడి, "మీరు ఎగతాళి చేస్తున్నారో నిజమే మాట్లాడుతున్నారో తెలియటంలేదు. అడితీ ఖాళీగావుందని నేను మొదటే చెప్పాను..." అన్నాడు నమ్రతగా.

"దాన్ని గురించి గాదండి నేను అన్నది...ఎంత శాంతంవుంది ఇందులో—నిజమే...ఇట్లా ఖాళీగావుంటే హాయిగా వుండదూ? ...అయితే బాగుండదుగా! సరుకు ఎప్పుడు కొందాం?"

బ్రహ్మానందం గుండె కొంచెం దిటవు చేసుకొన్నాడు. పర్వాలేదు అనిపించిందతనికి. "సరుకు కావాలంటే రాజమండ్రి వెళ్లి కొనాలండి..." అన్నాడు.

"కొందాం. రాజమండ్రి నే నెరుగుదునులే. ఇప్పుడు ఉదయం మెయిల్ సరిగ్గా ఎన్నిగంటలకి?" అని అడిగాడు వరదరాజు.

"ఏడున్నరకండి"

"సరే. అక్కడ అడితీలు ఎక్కడ?"

"గోదావరి వొడ్డెంబడే వున్నాయండి .."

"ఎంత సరుకు పెట్టాలనుకుంటున్నావు?"

"నాదేముందండి! పెట్టుబడి మీది. మీరు చెప్పాలిగాని..."

"చెప్పవయ్యా! ఎన్ని వేల సరుకు పెడితే బాగుంటుంది ఇందులో."

"దానికి పరిమితేం వుందండి? ఎంతయినా పెట్టవచ్చు. ఓ ఐదువేల రూపాయలసరుకు ప్రస్తుతం సరిపోవచ్చు" అన్నాడు బ్రహ్మానందం, అడితీ అంతటినీ చుట్టూ కలయచూసి.

"అయితే ఉదయం మెయిలుకు వెళ్లడం మంచిది" అన్నాడు వరదరాజు.

"అవునండి. హాయిగా భోజనానికి రాజమండ్రి చేరవచ్చు. మంచిహోటళ్లున్నాయి. అయితే రేపు ఉదయం మెయిలుకి... వెళ్తారా?" అన్నాడు గుమాస్తా.

"నేనా? నేనుదేనికి? మీరే వెళ్లండి. బ్యాంకిలో పదివేలు వేసి వొచ్చాంగా? ఆ చెక్ పుస్తకం పట్టుకెళ్లండి దస్కతు పెట్టిస్తాను. బేగం చేసికొనండి. మళ్లీ వెంటనే తిరిగి వొచ్చెయ్యండి" అంటూ వరదరాజు లాల్చీజేబులోంచి చెక్ బుక్ తీసి ఖాళీ చెక్కు మీద దస్కతుచేసి ఇచ్చాడు—గుమాస్తాకి. దస్కతుఅయినా

రాకపోతే ఇబ్బంది అని, ఈ రెండు నెలలు గా తనగదిలో కూర్చుని వీసుకొండలచేత దిద్ది పెట్టించుకున్న దస్కతు మొదటిసారి ఉపయోగించింది.

బ్రహ్మానందానికి ఇది పెద్దభారం. ఇతనేమిటి, తనని ఇంతగా నమ్మేస్తున్నాడు!... "నేనా?... నేనా! మీరు కూడా రండి. వెళ్ళొద్దాం...ధరల్లో హెచ్చుతగ్గులొస్తే, ఆబాధ్యత నేను వహించగలనా! బీదవాణ్ణి!" అన్నాడతను, కొంచెం దిగులు గా.

"వెళ్లవయ్యా అంటే వెళ్ళరా. ఖర్చుకి జంకకు. ధరలు రోజూ ఒకమాదిరిగా నేవుండవని నాకూ తెల్సు. నేను వెళ్తేనా అంతేగా? నువ్వే వెళ్లు. నాకు ఇక్కడ బోలెడుపనులున్నాయి... రేపొద్దున్న మెయిలుకు వెళ్తారుగదూ!" అంటూ జేబులోంచి, తాళంచెవి వొకటితీసి బ్రహ్మానందం వేపుగా టేబుల్ మీద పడేసి, "ఇది ఆ చిన్న ఇనప్పెట్టెది. అందులో ఐదొందలుండాలిగదూ? మీఖర్చుకి కావల్సింది తీసుకోండి..." అనేసి, టేబిల్ ఫాన్ తిప్పి, అటుతిరిగి కూర్చున్నాడు. మరుక్షణం అతని మనస్సులో ఈ సంభాషణఅంతా తుడుచుకుపోయింది. సిగరెట్ వెలిగించి, "పంతులు గారు, ఇవ్వాళ,...థియేటర్ లో నాటకం ఏమైనాఉందా?" అని ప్రశ్నించాడు.

బ్రహ్మానందం ఇంకా గందరగోళంలోనే వున్నాడు. అతని కీషాపుకారు మన స్తత్వం ఏమిటో అంతుపట్టకండావుంది. తాను వెళ్లి కలపబేరం చేసిరావటం అంటే అది పెద్దభారం...కాని ఇక తప్పదు. కాదనటానికి వేళమించిపోయింది ... తనింకా అదే ఆలోచిస్తూ వుంటే ఇతను డ్రామా ఏమిటి అంటున్నాడేమిటి? ... బ్రహ్మానందం, జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు. దుర్గాకళామందిరంలో "వస్త్రాపహరణం" డ్రామా గావును...ఆమాట చెప్పాడు వరదరాజుకి.

"ఊ—ఎవరెవరు వేషాలు వేస్తున్నారో తెలుసా?..." కుంచి ఉత్సాహంగా అడిగాడు.

తనవ్యాపారంలో, వేలతోటి వ్యవహారాల్లో ఏమాత్రం శ్రద్ధ కనపర్చని ఈవ్యక్తి నాటకంలో......అని బ్రహ్మానందం ఆలోచిస్తూనే, "మృత్యుంజయశాస్త్రి..." అని ఓలిస్టు చదివాడు.

వరదరాజు "మీరు అటు వెళ్తారుగా? రెండు కుర్చీలు రిజర్వు చెయ్యండి" అంటూ జేబులోనుంచి పదిరూపాయిల కాయితం తీసి టేబిల్ మీద పెట్టాడు

బ్రహ్మానందం పదికాయితం జేబులో వేసుకుని, బైటికి వెళ్లాడు.

ఐదునిమిషాలతర్వాత వరదరాజు బైటికివచ్చి "పంతులు గారు, మీరుండండి నేను బైటికివెళ్లి పన్నెండింటికి వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయినాడు.

బ్రహ్మానందం వరదరాజునుగురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఈ వ్యాపారంలో లాభంవొచ్చినా నష్టంవొచ్చినా తనకి బాధ్యతేమీ లేదు. తను పట్టించుకుని చెయ్యవల్సిన అవసరమూ లేదు. కాని ఇతన్ని చూస్తే అట్లా అనిపించటంలేదు. మొట్టమొదటి రోజునే తననింకా బాగా పరిచయమన్నా చేసుకోకముందే జీతం అడ్వాన్సు ఇచ్చాడు. ఇప్పుడు వేలు చేతిలోపోశాడు. వ్యాపారభారాన్నంతా తన నెత్తినే పెట్టేశాడు. ఏం చెయ్యడం! ఇంతగా తననునమ్మినవాణ్ణి పాడుచెయ్యగలడా తను చూస్తూ! అతన్ని చూస్తే అదేదో రకం భయమో గౌరవమో తెలియని ఒక భావం ఏర్పడుతోంది. ఏమీ ఎదురుచెప్ప లేడు. డబ్బంటే అతని కింత నిర్లక్ష్యమేమిటి? ...బ్రహ్మానందం లోపల గదిలోనించి జమా ఖర్చుల పుస్తకం తెచ్చి అంతవరకు అడితీ పేర జరిగిన లావాదేవీలన్నిటిని రాసుకుంటూ కూర్చున్నాడు.

పదకొండు గంటలలోపల పక్కన అడితీలవాళ్ళు వొచ్చి అతన్ని పలకరించి, ఎవరూ, ఏమిటి? పెట్టుబడి ఏమాత్రం, అని అడిగి వెళ్లారు. అది సహజం; వ్యాపారలక్షణం.

ఆవేళ సాయంత్రానికి బ్రహ్మానందం నాటకానికి రెండు కుర్చీ టిక్కట్లు రిజర్వుచేశాడు. వరదరాజుకోసం ఎనిమిదింటినించీ దుర్గాకళామందిరం ఎదటవున్న టీస్టాల్ లో కనిపెట్టుకుని కూర్చున్నాడు.

వరదరాజు తొమ్మిదిగంటలకి ఐదునిముషా లుందనగా వొచ్చాడు.

రోడ్డుమీద నుంచి థియేటర్ వరకూవున్న వెడల్పాటి సందంతా జనంతో నిండిపోయింది. ఓ గోలగావుంది థియేటర్ లోపల, బైట. సగంపైన టిక్కట్లు ఉదయమే అమ్మేశారు. అలవాటు ప్రకారం డ్రామా సరైనవేళకి ఎప్పుడూ ప్రారంభం కాదు గనక, పదకొండు గంటలవరకు ఈ గోల తప్పదు.

బైట టీషాపులో వున్న బ్రహ్మానందం, వరదరాజును చూసి లేచి నుల్చుని, "ఇదిగోనండి టిక్కట్లు, నేను వెళ్తాను" అన్నాడు. అతని కీమధ్యనే పెళ్లయింది. భార్య కాపరానికొచ్చి నాలుగునెలలే ఐంది. అదీగాక ఉదయం మెయిలుకుకూడా వెళ్ళాలి.. వరదరాజు టిక్కట్లు రెంటినీ అందుకుని లాల్చీ జేబులో పడేసుకున్నాడు. అతని కళ్ళు రెండూ ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి. కొంచెం బిరుసుగా వున్నాడు. కారాకిల్లీ నములుతూ ఖరీదైన సిగరెట్టు కాలుస్తూ, "ఉండవయ్యా! ఏమిటా తొందర, కూచో" అన్నాడు కొంచెం దురుసుగా. కాని వెంటనే, "కాస్త టీతాగు. నాటకం అయ్యేసరికి తెల్లారి మూడుగంటలవుద్ది" అన్నాడు సౌమ్యంగా.

టీ అందించే సప్లైయర్ దగ్గరకొచ్చాడు, "ఏం కావా" లంటూ.

వరదరాజు "రెండు మంచి బిస్కట్లూ స్ట్రాంగ్ టీ రెండూ పట్టుకురా." అన్నాడు. బ్రహ్మానందం ఏమీ మాట్లాడలేక పోతున్నాడు. వరదరాజు వైఖరిచూసే అతనికి ఎదురుచెప్పే సాహసం సడలిపోతోంది. వరదరాజు వేలివుంగరపు ఎర్రరాయి నిగనిగలాడుతువుంటే, టీకప్పు చేతతీసుకుని, మగ్గనవున్న కళ్ళు బైటికి చూసి, "పంతులుగారూ! డ్రామాలో అంతా గొప్ప గొప్ప యాక్టర్లేనంటే" అన్నాడు. మాటతూలకుండా జాగ్రత్తగా వుంటున్నాడతను, లోపల దొంగసారా పనిచేస్తున్నప్పటికీ.

బ్రహ్మానందం వరదరాజు వంకచూస్తూ మారుమాట్లాడలేదు. వెళ్లిపోవాలని లోపల తహతహ. భార్య ఎదురుచూస్తూవుంటుంది ...ముసలి తల్లితండ్రులు దిగులుపడుతూ వుంటారు ...కాని ఈయన చూడబోతే పోనిచ్చేట్టులేడు. అతని మనసు, చుట్టుపట్ల పరిసరపు రొదనంతా మరిచిపోయి, ఎక్కడో వున్నది;

వరదరాజు టీ ఒక్కగుక్కలో తాగేసి గబుక్కున లేచాడు; రిస్టువాచీ చూసుకొన్నాడు. "పదవయ్యా, పద. ఏటది? మొహం మాత్రేసుకున్నాడల్లే పెట్టావు" అన్నాడు నడుస్తూ.

బ్రహ్మానందం మాట్లాడకుండా వెనకాలే నడిచాడు.

థియేటర్ కిటకిటలాడుతోంది. సోడా, టీ—బీడీల, కేకలతో చెవులు గింగుర్లెత్తి పోతున్నాయి. లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. మనుషుల మొహాలమీద పడి చెదిరిపోతోంది వెలుగు. వరదరాజు ముందుకుపోయి రిజర్వుచేసిన కుర్చీలో కూర్చున్నాడు. బ్రహ్మానందం అతనిపక్కనే కూర్చుని చుట్టూచూశాడు. థియేటర్ గేటుబైట వరండాలో మృత్యుంజయశాస్త్రి, కరుణమూర్తి నిలబడి మాట్లాడుతున్నారు.

బ్రహ్మానందం మామూలుగా నాటకాల్లో సినిమాల్లో వేషధారులంటే అందరికీవుండే కుతూహలంతోటి, వరదరాజు వేపు తిరిగి, "ఏమండి, అదిగో, ఆయనే మృత్యుంజయ శాస్త్రిగారు—దుర్యోధనుడు వేస్తాడివ్వాళ...అదిగో పంచె కుచ్చెళ్లు చేతపట్టుకుని నుంచున్నాడే ఆయనే" అన్నాడు అటువేపు చూపిస్తూ.

వరదరాజు కుతూహలం ఏమాత్రంలేని మామూలు చూపొకటి విసిరాడు అటు. అతని మొహంలో కొంటెగా చిరునవ్వు వెలిగింది. మృత్యుంజయశాస్త్రిని దుర్యోధనుడుగా కాక, వసంతం ప్రియుడు

అపస్వరాలు

గానూ, రత్తమ్మపాలిట యమదూతగానూ మాత్రమే అతనెరిగున్నాడు.

అతనికి వసంతం ఊహతోపాటే ఈమధ్య తన బ్రహ్మచర్యం తొంటరితనం జ్ఞాపకం వొచ్చాయి. అతను యాదృచ్ఛికంగా, స్త్రీలవేపు తిరిగిచూశాడు. రకరకాలవాళ్లు, రంగురంగుల వలువలు, నగలు అన్నీ ప్రత్యేకంగానూ, ఒక్కొక్కటిగానూ కనపడ్డాయి. అందరూ స్త్రీలే. కాని, తనకేమిటి? వాళ్లెవరు? తనకంటూ ఎవరూ లేరు...

మృత్యుంజయశాస్త్రిగారికి రెండో దృశ్యంలోనే వేషం వుండడంచేతనూ, ఇంకా నాటకం ప్రారంభించటానికి ఎంతసేపవుతుందో ఎవరికీ నికరంగా తెలియకపోవడంచేతనూ, వొచ్చి రిజర్వులో వరదరాజుకి పక్కగా కరుణమూర్తితోసహా కూర్చున్నాడు.

ఆయన కరుణమూర్తితో సంభాషిస్తూ తనపక్కన కూర్చున్న దెవరో చూడలేదు మొదట.

హాల్లో ఈలల గోల ఎక్కువైంది. ప్రేక్షకులు విసిగిపోతున్నారు.

మృత్యుంజయ శాస్త్రిగారు, "ఇంకా తెనాలిబండి రాలేదు. ఆ తెనాలాయన రాలేదు.. కృష్ణుడి వేషం ఇవ్వాళ ఇంకెవరిచేతన్నా వేయిస్తే పోతుంది.. ఇదేనయ్యా వొచ్చిన తెగులు, ఓ గంటముందే రాకూడదూ? తెనాలేగా!" అంటూ పక్కకి తిరిగాడు, తన పక్కన కూచుందెవరా అన్నట్టు.

ఆయనకి రెండు నిమిషాలు అంతా అయోమయమైపోయింది. ఆ వరదరాజే! ఆ చినుగుగుడ్డల వరదరాజే! ఇప్పుడేమిటి, జమీందారులాగున్నాడు! వడమంత్రపు నిరేదన్నా వొచ్చిందేమో! లాటరీ ఛాన్సు తగిలిందేమో!...ఇప్పుడు తన వెనకటి అపజయాన్ని వెళ్లబోసుకున్నట్టు ఉండడం ఉచితంగాదు. మర్యాదగా పలకరిస్తే,... సంగతి సందర్భాలు తెలుస్తాయి ... శాస్త్రిగారు, మెల్లిగా, "ఏమండి, నేను గుర్తున్నానూ?" అని పలకరించాడు, వరదరాజుని.

వరదరాజు నిదానంగా నోట్లో సిగరెట్టుతీసి, ఒకసారి పకపకా నవ్వాడు. అతని నవ్వు శాస్త్రిగారికి గుండెల్లో గుచ్చుకున్నట్టయింది. వరదరాజు, "ఎందుకు గుర్తులేదు! మీరు శాస్త్రిగారు గదూ! అప్పుడే మర్చిపోగలనా మిమ్మల్ని" అన్నాడు. అతనికీ లోపల, ఆ వెనకటి సన్నివేశాన్ని జ్ఞాపకం చెయ్యటం ఇష్టంలేదు.

కరుణమూర్తికి వరదరాజు కొత్త. అప్పటి తాహతులోనే అతన్ని ఊహిస్తాడు గనక, శాస్త్రిగారికీ, తనకీ వరదరాజుకీ ఉన్న పరిచయాన్ని అత డేమీ అనుమానించడన్న ధైర్యం వచ్చింది.

వరదరాజు, "లేవండి శాస్త్రిగారు, కాఫీ తాగివద్దాం. అబ్బబ్బ తల బద్దలైపోతోంది; ఎంతసేపటికీ ప్రారంభించరేం నాటకం?" అంటూ లేచాడు. అతనితోబాటే శాస్త్రి, కరుణమూర్తీ లేచారు. బ్రహ్మానందం లేవలేదు. అతని కీపరిచయాలూ అవీ చూస్తూవుంటే వరదరాజు అంటే, ఎవడో గొప్పవాడే ననిపిస్తూంది.

బైట చలికొట్టుతున్నది. చల్లని చంద్రిక పసుపుటిపేపున తెల్లగా ప్రకాశిస్తోంది.

శాస్త్రిగారు థియేటర్లో వున్న రెస్టారెంట్లోకి దారితీశాడు. ముగ్గురూ కూచున్నారు. శాస్త్రిగారు కరుణమూర్తిని వరదరాజుకి పరిచయం చేస్తూ, "వీరు వూళ్లోకల్లా పెద్ద సబ్బివగ్గు. ఈతడవ మున్సిపల్ ఎలక్షన్‌కి కౌన్సిలర్‌గా నిలబడదామనుకుంటున్నారు. నాకు చిరకాల మిత్రులు" అన్నారు.

కరుణమూర్తి నవ్వుతూ వరదరాజుతో కరస్పర్శచేశాడు ఈ సందర్భంలోనే వరదరాజు, "నాది, ఏదో చిన్న కలపవ్యాపారమండి. కాలువరోడ్డుమీద నాలుగో నెంబర్ ప్లాట్" అన్నాడు తన్ను తాను ఎరుకపరుచుకుంటూ.

శాస్త్రిగారికిగూడా ఈ వివరం తెలిసివుండాలని అతని వుద్దేశం.

ముగ్గురూ సరదాగా కాఫీ తాగుతూ సంభాషణలోకి దిగారు. ముగ్గురు స్త్రీలోలురైన పెద్దమనుషుల సంభాషణ ఎన్ని ఇతర విషయాలమీదికి పోతేనేంగాక కాసేపటికల్లా అసలువిషయంలోకి రాకేం చేస్తుంది?

ముగ్గురూ రెస్టారెంటునుంచి బైటికివచ్చి వరండామూల నుల్చుని మాట్లాడుతున్నారు. కరుణమూర్తి "అయితే శాస్త్రిగారూ! ఈవేళ ద్రౌపదివేసేస్టార్ కొత్తదిలాగున్నదే! ఎవరేమిటి?" అని ప్రశ్నించాడు.

శాస్త్రిగారు సిగరెట్టు దమ్ములాగుతూ, "ఎవరేమిటోయ్! ఆమెది బందరు. నే నిదివరకే ఎరుగున్నాను. బందరు సుబ్బరత్నం అని ఎరగవూ? వెనకవాడెవడో జమీందారు వుంచుకున్నాడు కొంతకాలం? లోగడ, కనకతార, రంగూన్‌రౌడీ నాటకాల్లో వేషాలుగూడా వేస్తూండేది! ఆమెకూతురే. పాతికేళ్లుంటాయి... బాగా నేవుంటుంది" అన్నాడు.

కరుణమూర్తితోబాటు అంత ఆసక్తితోనూ వింటున్న వరదరాజు, "ఈమె ఎక్కడ వుంటుందేం?" అని అడిగాడు.

శాస్త్రిగారు అతనివేపు తిరిగి, "ప్రస్తుతం బందరులోనే వుంటున్నది...సొంతకొంపవుందిలే అక్కడ. కంఠంమాత్రం అంత బాగుండదు. అయితేఏం, వాక్శుద్ధి వుంది. ఏదైనా సినిమాఛాన్సు తగల్తా అని చూస్తోందిట. ఎవడున్నాడు చెప్పండి? దీన్ని తీసుకెళ్ళి ఆ అవస్థలన్నీ పడ్డానికి? అందుకని ఇట్లా నాటకాల్లో తిరుగుతూ వుంది" అన్నారు.

వరదరాజుకి ఇది అదను అని తోచింది "అలా అనకండి, ఆమె కంఠకోరికగావుంటే, ఆపాటిచేసేవాళ్లే లేరా!" అన్నాడు. అతను సిగరెట్టు తాగుతూవుంటే వేలివుంగరపుఎర్రరాయి, సిగరెట్ నిప్పల్లే మెరుస్తోంది, దీపాల వెలుగులో.

శాస్త్రిగారికి ఈమాటల్లో "నేను" లేనూ? అన్న ధ్వని అర్థమైంది. "లేకేమండి! దివ్యంగా వున్నారు. మాటవరసకి, మీరే వున్నారు! లేదు, మన పబ్లిషరున్నాడు! ఏమిటో!" అన్నాడాయన.

కరుణమూర్తి నవ్వాడు. "మీరు వున్నారుగా! ఆ కాస్త సాయం మీరు చెయ్యలేరా ఏమిటి! తల్చుకుంటేనూ!" అన్నాడు అతను.

వరదరాజు, "అవును!" అన్నాడు నిదానంగా.

శాస్త్రిగారు విరక్తిగా, "ఇంకా మనకెందుకోయ్ ఆ వేషాలు! ఆ కాలం వెళ్లిపోయింది. ఏమైనా ఇక మీబోటి యువకులే ముందడుగు వెయ్యాలి!" అన్నాడు.'

మిగతా ఇద్దరూ నవ్వారు. "ఆమెని ఎప్పుడు పరిచయం చేస్తారు మాకు?" అని ప్రశ్నించాడు కరుణమూర్తి.

"ఇప్పుడే. గ్రీన్ రూంలోనో, లేకపోతే ఆ బుకింగ్ రూం పక్కగదిలోనో వుంటుంది పదండి. పరిచయం చేస్తాను. మన కర్తవ్యమేమిటోయ్ ఇక్కడ!" అన్నాడు శాస్త్రిగారు.

"దుర్యోధను డాయెను! అందులోను ఇది వస్త్రాపహరణం నాటకమాయె" అంటూ కరుణమూర్తి ఆయ నన్నుసరించాడు. వరదరాజు వాళ్లిద్దరి పక్కనే హుందాగా బూట్లు టకటక లాడిస్తూ నడిచివెళ్ళాడు, ఈ తార ఎలావుంటుందో అని వూహిస్తూ.

[ఇంకావుంది]

మూడో పిల్ల

భార్యను పురిటికి పుట్టినింటికి పంపిన రోజునుండి, రామానుజం ప్రతి రోజూ ఆ వచ్చే శుభవార్తకోసం ఎదురు చూస్తున్నాడు. భార్య వెళ్ళిన వారం రోజులకు రామానుజం ఆఫీసునుండి ఇంటికివచ్చేటప్పటికి, వచ్చివున్న పోస్టుకార్డు ఏ శుభవార్తనూ తీసుకరాలేదు. అతనిభార్య క్షేమంగా చేరిందనీ, వుందనీ మామగారు రాశాడు.

రామానుజం అప్పటికే ఇద్దరు ఆడపిల్లల తండ్రి. మళ్ళీ ఆరుసంవత్సరాలకు రామానుజం మూడోసారి తండ్రి కాబోతున్నాడు. ముసిముసినవ్వులు నవ్వుతూ ఒకనాటిరాత్రి భార్యచెప్పిన ఆవిషయాన్ని విని రామానుజం, సమయానుకూలంగాసంతోషించినా, ఆ తెల్లవార్లూ ఆలోచిస్తూనేవున్నాడు, పుట్టబోయే శిశువునుగురించి.

నిజంచెప్పాలంటే రామానుజానికి కూతుళ్ళిద్దరిమీదా ఎంతో ప్రేమ. అయినా ఆడపిల్లలనగానే సామాన్యంగావుండే భయం మాత్రం అతనికి లేకపోలేదు. అందుకు ఇతర కారణాలు ఏంవున్నా, ముఖ్యంగా తల్లి నలుపైనా, పుట్టినవాళ్ళిద్దరూ అతనిలా ఎర్రగావుండటమే. నల్లగావున్న ఆడపిల్లల కంటే, ఎర్రటివాళ్ళకోసం వరుణ్ని వెదకాల్సిన బాధ కొంత తగ్గుతుందనీ, చెప్పులరిగిపోయేటట్టు తిరగనక్కర్లేదని, ఆడాళ్ళందరికీ అదో ప్రత్యేకమైన యోగ్యతాపత్రమనీ అతని ఉద్దేశం!

వీటికితోడు మరోవిషయంకూడా అతని తలంపులోవుంది. - కాళ్లు కడిగి కన్యాదానంచేసినదగ్గరనుండీ, తను వియ్యంకుడికీ, తనభార్య వియ్యపురాలికీ చేతులు నలుపుకుంటూ ఒదిగి ఒదిగి వుండాలని. ఆడపిల్ల పుట్టినప్పటినుండీ లేనిబాధ్యత, ఆ పిల్లకు పెళ్లిచేసి అత్తవారింటికి పంపగానే వచ్చిపడుతుంది. అల్లుడికి జరగాల్సిన మర్యాదల్లోగాని, తదితర్లకు చెయ్యవలసిన లాంఛనాల్లోకాని ఏమాత్రం లోటుకన్పించినా, ఆడపిల్లను కన్నందుకు తనభార్య; మర్యాదలను, లాంఛనాలను కావలసినరీతిగా జరపలేకపోయినందుకు తనూ తిట్లు తిని, ఏ మైసూరుపాకమో రసగుల్లాలో తిన్నట్లు చప్పరించి వూరుకోవలసిందేకాని కిక్కురుమనడానికి వీల్లేదు - అథవా అభిమానం పాడుచుకొచ్చి జవాబు చెప్పామూ, పిల్లదాని జీవితం దినదిన గండం దీర్ఘాయుష్షూ అవుతుందేమోనని భయం!

ఒక వేళ దురదృష్టవశాత్తు అలాగే అయితే; ఆపిల్ల దూరంగా వుండడంచేత తల్లినీ తండ్రినీ నోటికొచ్చినట్లల్లా తిట్టడానికి వీల్లేని కారణంగా, చేతికొచ్చినట్లల్లా వ్రాసి తండ్రికి ఒక ఉత్తరం పోస్టులో పడేసి చేతులు దులుపుకుంటుంది. ఆ సమయంలో నవమాసాలూ మోసి కన్నతల్లికాని, అష్టకష్టాలుపడి పెంచి పెళ్ళిచేసిన తండ్రిగాని; కొత్తగా వచ్చిపడ్డ అత్తమామలు, భర్తకంటె సన్నిహితులుగా కన్పించనే కన్పించరు! - ఇక ఆ ఉత్తరం చదివిన భార్య నేరమంతా భర్తదేనన్నట్లు, భర్త యింటికి వచ్చీరాగానే ఆ ఉత్తరాన్ని ముఖానకొట్టి, వంటయింట్లోంచే పట్టలేని కోపంతో కూరగాయలు తరుగుతూన్న తొందరలో వేలు తెగినా లక్ష్యపెట్టక, మేఘం వురిమినట్లు వురిమి, వర్షం కురిసినట్లు కన్నీళ్లుకార్చి, తను పడ్డ శ్రమంతా వృథాచేసి, తనకీ తన కూతురుకీ తీరని అపకారం చేసిన శత్రువును చూసినట్లు చూస్తుంది. ఇక ఆ క్షణంనుంచీ ఇంట్లో ఎదురుగా మూతిముడుచుక్కూచున్న భార్యను లాలించలేక, తనమీద కోరి తెచ్చుకున్న అధికారులైన వియ్యాలవారిని తృప్తిపరచలేక తన పని తలకిందులవుతుంది. అందరినీ తను బ్రతిమాలుకోవలసిందేకాని, తన పరిస్థితినిచూసి ధైర్యం చెప్పేవాళ్లుకాని, కనీసం తనమీద జాలిపడేవాళ్లుకాని ఒక్కరు కనిపించరు. ఇంత హంగామాకు కారణం, తను ఆడపిల్లలనుగన్న తండ్రి కావడం!!

రామానుజానికి ఇవన్నీ ఆడపిల్ల పుట్టిన తర్వాత వచ్చిన ఆలోచనలూ, కుండరాబోయే అనుభవాలూను! కాగా - అతను ప్రత్యక్షంగా చూసిన విషయం ఒకటుంది. తన పెదతండ్రి కూతురు కాంతం విషయం. వాళ్లది ఎప్పటికప్పుడు భుక్తికి సరిపోయే సంసారం. ఆయనకు కలిగింది ఒక ఆడపిల్ల. పట్టరానివాళ్ల కాళ్లు పట్టుకుని, అభిమానం సంపాదించి ఎంతో బాధపడి బి. ఏ. దాకా చదివించాడు. పెద్ద చదువు చదివిస్తే కట్నం కోరకుండా చదువుకున్న పిల్ల కాబట్టి వరుడు కోరుకునే వస్తాడని అభిప్రాయపడి చేసిన పిచ్చిప్రయత్నం! తీరా పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించేసరికి 'పిల్లకు చదువుంటే వూళ్లేలుతుందా, ఉద్యోగాలు చేస్తుందా? కన్నవారి కటికదరిద్రాన్ని తీసుకవచ్చి అత్తవారిల్లు గుల్ల చెయ్యడం తప్ప!' అన్న వాక్యాలు విని నిలువునా కుంగిపోయాడు పాపం! ఇంతా జరిగినతర్వాత కూడా ఈడూ జోడూ కుదిరిన ఎలాంటి సంబంధమైనా చూసి, ఆ బరువూ భారమూ వదిలించుకుందామని వల్లమాలిన ప్రయత్నం చేశాడు. ఎక్కడెక్కడ ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఫలించకపోవడమూ, వలచి వలపించుకోవలసిన వయస్సు దాటిపోతున్నా ఆ పిల్ల కన్నవారిల్లు దాటిపోయే శుభముహూర్తం ఏ పంచాంగంలోనూ లేకపోవడమూ జరిగింది.

ఇలాంటి విషయాలూ, సందర్భాలూ రామానుజం బుర్రలో కాపురా లేర్పరచుకొని, ఆడపిల్ల పుట్టిన మరుక్షణంనుండీ అతన్ని బల్లెంతో పొడిచినట్టు ఒకప్రక్క పొడుస్తూనే వున్నయ్. పైగా అతని భార్య మళ్ళీ గర్భవతై పురిటికి వెళ్లి వుంది. ఇక వచ్చే ఆ శుభవార్తకోసం రామానుజం మనసులో మనసులేక, ఎదురుచూడ్డం మొదలుపెట్టాడు.

* * *

ఆవేళ ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పటికి, వంటింట్లోంచి తల్లి కేకపెట్టింది: "రామానుజం! ఉత్తరం వచ్చింది. అద్దం ఇరుకున పెట్టాను" అని.

రామానుజానికి ముచ్చెమటలూ పట్టినయ్. కాళ్లకింద భూమి తిరుగుతూన్నట్లనిపించింది... నెమ్మదిగా వెళ్లి ఉత్తరంతీశాడు. అతని మామగారి కంత తీరుబడో కాని కాస్త కాళీకూడా వదలకుండా నలుపుచేసి పారేశాడు. ఉత్తరం తొందర తొందరగా నోట్లోనే చదువుకోడం ప్రారంభించాడు. ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి వంటయింట్లోంచి తల్లివచ్చి "మీ మామగారి దగ్గరనుంచేనా?" అంది.

"ఆ! ఆయనే రాశాడు"

"ఏమిటి సంగతులు. కోడలికి పురుడు వచ్చిందా?"

★ మూడో పిల్ల ★

"అహో! రానూవచ్చింది. మరో ఆడపిల్ల పుట్టనూపుట్టింది" అన్నాడు. అతనిముఖంలో తల్లికి, ఏ మంత ఉత్సాహరేఖలు గోచరించలేదు.

"ఏమిట్రా ఆ మాట. ఆడపిల్లయితే ఇప్పుడువచ్చిన నష్టమేముంది; నీ పిచ్చి గాని. అదీగాక అంతా ఆ భగవంతుడి ఆజ్ఞ కాని మనలో ఏముంది!" అంటూ సముదాయించబోయింది.

"అవునవును. అంతా ఆయన ఆజ్ఞే!" అంటూ విసురుగా బయటికి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి భోజనాలదగ్గరవచ్చింది మళ్లీ ఈ ప్రస్తావన.

"ఏంరా! రామానుజం! బారసాల విషయం ఏమన్నా రాశాడా?"

"ఆ! అన్ని ఏర్పాట్లూ ఆయనే చేస్తున్నాట్ట నిన్నూ నన్నూ రమ్మని రాశాడు"

ముసలావిడ మారువడిస్తూ "లక్ష్మి సరస్వతి పార్వతుల్లా ముగ్గురు. వాళ్లిద్దరూ తండ్రిపోలిక. మరి ఇదెలా వుంటుందో" అంది.

"నాయనమ్మలా వుంటుందిలే!" అంటూ చిరాగ్గా విస్తరివద్దనుండి లేచిపోయాడు.

* * *

రామానుజం ఎంత కూడదన్నా, బారసాలకు వెళ్ళక తప్పిందికాదు. గుమ్మంలో అడుగుపెట్టేటప్పటికి, మామగారు ఎదురై "ఏమోయ్! రెండు రోజులు ముందుగా వస్తావనుకున్నాం — పదండి లోపలకు" అంటూ పరామర్శించాడు.

సమాధానం చెప్పకుండానే, రామానుజం అరుగుమీద కుర్చీలో కూలబడి, చేతిలో పత్రిక తిరుగవెయ్యడం ప్రారంభించాడు.

పదినిముషాలు గడిచేటప్పటికి, లోపలి నుంచి చినబావమరది వూడిపడి "బావగారూ! మా అక్క పిలుస్తూంది" అన్నాడు.

"ఎందుకూ?"

"అదే! ఆసంగతి చెప్పడానికే!" అంటూ వీధిలోకి తుర్రుమన్నాడు.

వెంకివెధవా! అనుకున్నాడు రామానుజం మనసులో.

లోపలకు వెళ్లేటప్పటికి, హాల్లో అత్తగారు ఎదురై "ఏం! నాయనా! వచ్చి రావడం వీధిలోనే కూచుండిపోయావే - అదో! అలా వెళ్లు" అంటూ ఆవిడ పనిమీద ఆవిడ వెళ్లిపోయింది.

భార్యవున్న గదిలోకి మహాకష్టంగా వెళ్ళి నిలుచున్నాడు. చేతిలో పత్రిక పేజీలు తిరగవేస్తూ. పాపం! ఎంతో ఆత్రుతగా భార్య దగ్గరకు వచ్చి "లోపలకు రాకుండా వీధిలోనే కూర్చుండిపోయారేం?" అంది.

రామానుజం చేతిలోవున్న పత్రిక తిరుగవేస్తూ - సమాధానం చెప్పలేదు. ఆమెవంక ఒకసారిచూసి, దృష్టి మరల్చుకున్నాడు.

"నాకు తెలుసు మీరు ఎందుకలా వున్నారో!" అంది నవ్వుతూ.

"ఎందుకేం?' అన్నాడు.

"మళ్లీ ఆడపిల్లనికదూ?" అంది.

ఈసారి రామానుజానికి అనుకోకుండా వెన్నుమీద చరిచినట్లయింది. భార్యవంక తీవ్రంగా చూశాడు.. చేతిలోవున్న పత్రికను విసిరికొట్టి, భార్య బ్రతిమాలుతున్నా వినిపించుకోకుండా వీధిలోకి వచ్చేశాడు.


* * *

ఇక అక్కడవున్న రెండురోజులూ, రామానుజం అతికష్టంగానే గడిపాడు. భార్యమీద అతనికి అపరిమితమైన కోపం వచ్చింది. మూడవసారికూడా ఆడపిల్లే కలిగినందుకు బాధపడుతున్న అతని హృదయం భార్య మాటలకు మరీ దెబ్బతిన్నది. - ఎగతాళిచేసినట్లయింది.

జరగవలసిన కార్యం పూర్తికాగానే, ఆరోజురాత్రే తిరిగి ప్రయాణమయ్యాడు.



గ్రీష్మ స్నానము



గ్రీష్మ సంధ్య

ఫొటో: ఆర్. శివారెడ్డి—ముద్దనూరు.

"అదేమిటి? అక్కడ ఏమంత తొందర పనులున్నాయని ఈరాత్రిపూటే వెళ్లడం. తెల్లవారి తీరుబడిగా వెళ్లొచ్చునులే" అన్నారు మామగారు.

ఆమాటలు వినేటప్పటికి రామానుజానికి ఎంత ఆవేశం వచ్చిందో చెప్పలేం. ఆయన అలా అంటూవుంటే హేళన చేస్తున్నట్టనిపించింది. తనకేమీ పనిలేనట్లు, ఏదో ఊరికే పనిలేక తిరుగుతూన్నట్లు ఆయన ఉద్దేశించి మాట్లాడినట్లు రామానుజం అనుకున్నాడు. ఏదో గట్టిగానే చెప్పుదామనుకున్నాడు; కాని మాటలు రాలేదు.

"అలా కాదు తప్పకుండా వెళ్ళాలి రేపు ఆఫీసుకు వెళ్ళకపోతే మాట వస్తుంది" అన్నాడు ముక్తసరిగా.

"అలా అయితే మరో రెండురోజులు శెలవు పొడిగించరాదూ."

"ఇవ్వరు" అన్నాడు పెదిమలు బిగబట్టి

రామానుజం మామగారు అతనివంక ఒకసారి చూసి, ఇక ఆ విషయం మాట్లాడ్డం అనవసరం అనుకున్నాడో ఏమో "సరే! నీ ఇష్టం" అంటూ వెళ్లిపోయాడు.

ఆరాత్రి భోజనాలు తొందరగా ముగించుకుని, వేళకు ముందుగానే రైలుస్టేషను చేరుకున్నాడు రామానుజం తల్లితో. రామానుజం భార్య గుమ్మంవద్ద నిలబడి వుండడం చూసికూడా ఆమెను పలకరించనే లేదు!

వియ్యపురాలిని గుమ్మంలో బండి ఎక్కించి, లోపలికివచ్చి "ఏమే! విశాలా! మీ ఆయన ఈసారి అంత మూతి ముడుచుక్కూచున్నాడు. బిడ్డలతండ్రైనా ఇంకా ఈ పసు లేమిటే - నీతో కూడా సరిగా మాట్లాడినట్టు లేదు" అంది కూతురుతో.

"అబ్బే! నాతో మాట్లాడకేం - మాట్లాడారు" అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది విశాల

"ఏమిటో తల్లీ! ఈ చిత్రమైనకోపాలు, తాపాలూను. మీకే అర్థమవాలి" అంటూ ఆవిడ పనిమీద ఆవిడ వెళ్లింది.

విశాల తల్లికి ఏదో సమాధానం చెప్పిందే కాని, ఆమె మనస్సులో బాధగానే వుంది. కాని అంతవరకూ ఎలాగో ఇముడ్చుకోగలిగింది. ఆ విషయాన్నే తల్లి హెచ్చరించేటప్పటికి, ఆమెకు తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు రాలినయ్.

* * *

నిజానికి రామానుజం అత్తవారింటినుండి తిరిగివచ్చిన మరునాడుకూడా శెలవుంది. కాని అతని మనస్తత్వం అతన్ని అక్కడ వుండనివ్వలేదు. అత్తవారింట్లో అంతా విరోధుల్లాగే కనిపించారు అతనికి. ఇంటికి చేరగానే కాలకృత్యాలు తీర్చుకుని, ముసుగుతన్నాడు. రామానుజంతల్లి వంటపనంతా పూర్తిచేసుకుని వచ్చి లేపింది.

"రామానుజం! పదకొండవస్తోంది. లేచి భోజనానికి రా!" రామానుజం ఒకసారి కదిలి, మళ్ళీ అటువైపుకు తిరిగి పడుకున్నాడు

"లేరా! ఆఫీసుకు వేళయింది"

"ఫరవాలేదులే. కాస్సేపు ఆగుదూ" అన్నాడు మగతలోనే.

"ఏం? ఆఫీసుకు వెళ్లవా?"

"అబ్బ! చంపక నువ్వు అవతలకు వెళ్లు. ఇవాళకూడా శెలవుందికాని" అంటూ విసుక్కున్నాడు.

"అరి నియిల్లు బంగారంగాను! ఈరోజు కూడా శెలవుందనుకు నేనా, అంత హడావిడి చేశావ్. ఈపూటకూడా ఆ పిల్లతో గడిపి వస్తే ఎంత బావుండేది. ఆయన మాటతోసి పుచ్చివచ్చినందుకు మీ మామగారు ఎంత నొచ్చుకున్నాడో పాపం!" అంది కొడుకు చేసిన ఘనకార్యానికి ఆశ్చర్యపోయి.

"మరేం మునిగిపోలేదు లెద్దూ మహా

వుండమన్నాడు కాని!" అంటూ చీద రించుకున్నాడు.

"అదేవిట్రా ఆ మాటలు ఆయనేంచేశాడు పాపం!— ఇప్పటివరకూ అత్తవారింటికి వెళ్ళినప్పుడల్లా రెండురోజుల్లో తిరిగివస్తానని వారం పదిరోజులదాకా పత్తాలేకుండా పోయేవాడివి. ఇంతలో ఏం ముంచు కొచ్చింది. ఆయనమీద ధూంధామున్కూడా నీకు ఆడపిల్ల కలగడమే కొడుకదా !"

"ఏదోఒకటి. నువ్వూరుకుందూ" అంటూ ఆదరాబాదరా లేచి నూతి దగ్గరకు వెళ్లి పోయాడు.

"బావుందిరా వరస! వయస్సు వస్తున్న కొద్దీ పెద్దమనిషనిపించుకోవాలిగాని, ఈకసు రుకోవడాలు, విసుక్కోవడాలు ఏమిటి?" అంటూ ఆమెకూడా వెనకాలేవద్దన ప్రయ త్నంచేయడానికి, వంట ఇంట్లో ప్రవేశిం చింది.

* * *

ఆరోజు సాయంకాలమయినా రామా నుజం ఇల్లువదల్లేదు. రాత్రల్లా రైల్లో ప్రయాణం కారణంగా నిద్రలేనందువల్ల కలిగిన నీరసము, పగలల్లా నిద్రపోయిన కారణంగా అతన్నావరించుకుని వదలని మత్తువల్లు ఇంట్లోనే వుండిపోయాడు.

దీపాలవేళ అయేటప్పుడు, మిత్రుడు, అతని తోటిగుమాస్తా మూర్తి వచ్చి పిలి చాడు.

రామానుజం బయటికి వచ్చిచూసి "రావోయ్ మూర్తీ" అంటూ ఆహ్వానిం చాడు.

"కంగ్రాచులేషన్స్! రామానుజం! అదృష్టం అంటే నీదేరా!" అంటూ లోపలి కొచ్చి కూచున్నాడు.

"నువ్వొకడివి నా ప్రాణం తియ్యడానికి. అంతా అయి పదిహేనురోజులు పైగా ఐతే, ఏమో తెలియనట్లు ఇవాళ తీరుబాటు చేసుకుని వచ్చావా? కంగ్రాచులేట్ చెయ్యడానికి" అన్నాడు నిరుత్సాహంగా రామానుజం.

మూర్తి తెల్లమొగం వేశాడు!!

"ఏమిటే? నీకు పదిహేనురోజుల క్రిందటే తెలుసా? నాకు తెలీదే? నువ్వు మాటవరుస కన్నా చెప్పలేదే?" అన్నాడు.

రామానుజానికి విషయం అర్థంకాలేదు. – నిజానికి మూర్తి తీసుకొచ్చిన వార్త ఒకటి, రామానుజం తలచింది మరొకటీను!

"అసలు సంగతేమిటి మూర్తీ? నీమాటలు చూస్తే వింతగావుంది" అన్నాడు మూర్తి వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

"నువ్వేమనుకున్నావ్ ?" అన్నాడు మూర్తి.

"అదేరా! మా ఆవిడకు మరో ఆడపిల్ల ......"

అరో క్షిలో అంగుకుని "ఛత్! అది కాదోయ్! మరొకసంగతి - ఏదీ! ముందు కాఫీ పోయించు. ఆతర్వాత మాట్లాడు కుందాం?"

"కాఫీకేం తక్కువ లేదు!" అంటూ ఇంట్లోకి దృష్టి సారించి "అమ్మా! కొంచం కాఫీపెట్టవే" అని కేకవేసి, మళ్లీ మూర్తి వంకతిరిగి "ఊ! ఇక చెప్పు నువ్వు తెచ్చిన ఆవార్తలు" అన్నాడు.

"అబ్బె! కాఫీ రానియ్! అది లోపలకు వస్తేకాని, వార్తలు బయటికిరావు" అన్నాడు మూర్తి.

అంతలోనే అక్కడకు వచ్చిన రామా నుజంతల్లి "వేళకాని వేళ కాఫీ ఏమిటి నాయనా! కాస్తోకూస్తో తక్కువగా భోజనంవేళయిందిగా. భోజనంచేసే వెళ్దూ గాని" అంది మూర్తితో.

"భోజనాలుపెట్టే కార్యక్రమం అంతా ముందుందిలెండి. ప్రస్తుతానికి తాజావార్త తెచ్చినందుకు కాఫీ ఇవ్వాల్సిందే" అన్నాడు మూర్తి నవ్వుతో.

"ఇంతకీ ఆవార్త ఏమిటో" అంది రామా నుజం తల్లి ఎంతో కుతూహలంగా.

మూర్తి ఒక్కసారి రామానుజంవంక చూసి, చిన్నన వ్వునవ్వి "మీవాడికి హెడ్‌గుమాస్తాగా ప్రమోషను వచ్చిందండి. మన వూళ్లోనే సబ్‌కలెక్టరు ఆఫీసుకు వేశారు" అన్నాడు.

రామానుజం ఎగిరి గంతేశాడు!!

"అబ్బ! బంపావురా! ఈ వార్త చెప్ప డానికి - ఎప్పుడొచ్చినయ్ ఆర్డర్లు?" అన్నాడు రామానుజం, సంతోషంతో పొంగిపోతూ.

"ఇవాళే. రెండు మూడు రోజుల్లో రిలీవ్ చేసేస్తారు. ఆఫీసులో అంతా నీ కోసం ఎదురుచూస్తుంటే."

"అంతా ఆ పుట్టినదాని అదృష్టం! లక్ష్మీ దేవిలా శుక్రవారంపూట పుట్టింది. మావాడు ఆడపిల్ల పుట్టిందంటూ అందరిమీదా అలిగి కూచున్నాడు. చూడరా! పుడుతూనే ఎలాంటి అదృష్టాన్ని తీసుకొచ్చిందో నా బంగారు తల్లి!" అంటూ ఆనందంతో మురిసిపోయింది రామానుజం తల్లి !

"ఏమిటమ్మా! నువ్వు ప్రతివిషయానికి అర్థంలేకుండా సామ్యాలు తీసుకొస్తావు. నాకు ప్రమోషన్ రావడమేమిటి, దాని అదృష్టమేమిటి?" అంటూ చిరాకుపడ్డాడు రామానుజం.

"అది అంతేలే! తినేవాళ్లు అదృష్టవంతు లైతేనే, సంపాదించేవాడికి ఇలాంటి మంచి జరుగుతూవుంటుంది. మనం సంపాదిస్తున్నది

వకోసమా? పెళ్లాన్నీ పిల్లల్నీ పోషించేందుకు, సుఖపడేందుకూనా" అన్నాడు మూర్తి.

"అలా చెప్పు నాయనా! మావాడికి." అంటూ రామానుజంవైపు తిరిగి "వంటనే కోడలికో కార్గురాని పెడేయ్. ఈ వార్త వింటే ఇక దానికి పట్టపగ్గాలుండవు. మనిషంటే అక్కడుందికాని, మనసంతా ఇక్కడే - నాకు తెలుసు దాని తత్వం!" అని నవ్వుకుంటూ లోపలకు వెళ్లిపోయింది.

రామానుజం తల్లిమాటలకు సిగ్గుపడ్డాడు!

"నువ్వు ఈ విషయంలోనూ అదృష్టవంతుడివేరా. అనుకూలంగా అత్తా కోడలూ వుండి సాఫీగా సాగిపోతూన్న సంసారాలు చాల అరుదు. ఆవిడ చూడు నీగురించి ఎంత బాధపడుతూందో. కొంప తియ్య - ఆడపిల్ల పుట్టిందని నీ భార్యను ఏమన్నా అన్నావా ఏమిట్రా?" అన్నాడు మూర్తి.

"అబ్బెబ్బె! అదేం లేదురా!"

"ఏమో లే! నీకంతగా తెలియనట్టుంది ఈ ఆడవాళ్ల సంగతి. మన మేదో మేధావుల మనుకుని ఇటువంటి విషయాల్లో వాళ్లను వేసే పిచ్చిప్రశ్నలకు, సమాధానంగా మనల్నే ఒక మొండి ప్రశ్న వేస్తారు. దాంతో ఉచ్చులోపడ్డ పక్షిలా గిలగిల తన్నుకోవాలి. - జాగ్రత్త!" అన్నాడు మూర్తి.

ఇద్దరూ నవ్వుకున్నారు.

* * *

ఆ రాత్రంతా నిద్రకు నోచుకోలేదు రామానుజం. తెల్లవార్లూ ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలతోనే గడిపాడు. తల్లి అన్న మాటలు నిజమే. విశాల తనను ఎంత ప్రేమిస్తుంది! కాస్త తలనొప్పి వచ్చిందంటే చాలు, తను అనుభవిస్తూన్నట్లే ఆమె బాధపడుతుంది. ఎంత లాలన, ఎంత పాలన!

పాపం! ఎంత బ్రతిమాలినా వినకైనా వినకుండా, తోసుకు వచ్చేసి ఆమెకు అంత కష్టం కలిగించిన తర్వాత ముందు వెనుకలు ఆలోచించకుండా తొందరపడి, తనే ఇటువంటి పరిస్థితిని కల్పించాడు. ఎంత వేగం ఈ వార్త ఆమెకు చెప్పివేద్దామా అని ఉబలాటం. కాని ఒక వేపు అభిమానం అడ్డు వస్తూంది. తీరా ఈ సంగతి చెప్పినతర్వాత ఆమెకూడా తల్లి అన్నట్టే అంటే!

ఇక ఆమెకు ఉత్తరం రాసే దెలా!

తెల్లవార్లూ ఇలాంటి ఆలోచనల్లోనే తలంతా పాడుచేసుకుని, రామానుజంకూడా తల్లి ఇచ్చిన నిర్ణయానికే వచ్చాడు!

బారసాలకు వెళ్లినప్పుడు తను ఇంట్లోకి వెళ్లకపోగా, ఆమె కబురంపించినప్పుడు విసురుసలాడుతూ వెళ్లి పలకరించక పోయినా ఎంత ఓపికతోనూ, ఉత్సాహంతోనూ పలకరించి, చిరునవ్వుతో ఆదరించింది. నవమాసాలు మోసి కన్నబిడ్డను భర్తకు చూపాలని, భర్త ఆనందంతో తన్ను ఆదరిస్తే మురిసిపోవాలని ఏ స్త్రీకి వుండదు.

* * *

బారసాలకువచ్చి వెళ్ళిన తర్వాత భర్త దగ్గరనుండి ఒక ఉత్తరంకూడా రానందుకు విశాలమనసు ఎంతో కించపడింది. ఒకటి రెండుసార్లు మనసు వుండబట్టలేక తండ్రిని అడిగింది కూడాను. 'రామానుజం ఉత్తరం రాస్తే నీకు చెప్పకుండా వుంటానా తల్లీ!' అన్నాడాయన— కాని విశాల తల్లిమాత్రం ఆ భార్యాభర్తల ఇద్దరి మధ్యా ఏదో

★ మూడో పిల్ల ★

చిలిపికజ్జా వచ్చిందని మాత్రం గ్రహించింది. ఆఖరికి ఒకరోజు అడిగింది కూడాను

"ఏమే! అమ్మాయ్! మీ ఆయన ఎందుకే మనమీద అలిగినట్లున్నారు" అంది.

"అల్లాంటి దేమీ లేదమ్మా" అంది విశాల.

"నా దగ్గర కూడా దాస్తావెందుకే విశాలా! ఇంతకుముందు ఎప్పుడైనా నువు పదిరోజుల పాటు ఇక్కడికొస్తే, రెండు సార్లైనా వచ్చి చూసిపోయేవాడు కదా. ఈసారిమాత్రం మాటా పలుకూ లేకుండా వుండిపోయాడేం?" అంది లౌక్యంగా.

విశాలకు సమాధానం చెప్పుకోవలసి వచ్చింది!

ఒకవేళ నిజం చెపితే?——చిలిపిగా వుండదూ! అమ్మ ఏమనుకుంటుంది. నాన్నకు తెలిస్తే ఆయన ఏమంటాడు తన భర్త ఇంత బుద్ధిహీనుడా? అనుకోరూ! మరి తల్లినీ తండ్రినీ ఈ విషయంలో ఎలా సముదాయించడం?

ఆ సమయానికి తోచిన ఏదో ఒక జవాబు చెప్పి, తప్పించుకుంది కాని తల్లి ముఖం చూస్తే ఆ సమాధానంతో తృప్తిపడినట్లు మాత్రం కనిపించలేదు. తిరిగి అడిగా బలవంత పెట్టలేదు.

కాని విశాలకుమాత్రం ఇదో పెద్ద బెడదయింది. మనశ్శాంతి లేకుండా బాధపడసాగింది. తల్లీ తండ్రీ, తను కాపురంలో ఏదో అనగం ఏర్పడిందనుకుంటున్నారేమోనని ఆమె బాధ! ఈ చిక్కు విడదియ్యడం ఎలా?

ఆ రాత్రంతా ఆలోచించింది. భరించలేని ఆవేశంవచ్చి ఏడ్చింది కూడాను! చివరికి తనే ఒక ఉత్తరం వ్రాయాలనుకుంది——

"అమ్మ గుచ్చి గుచ్చి అడుగుతూంది మీరెందుకు ఇంత ముభావంగా వున్నారని. ఏం చెప్పను? ఎవరిమీద చెప్పను? ఒకవేళ నిజం చెప్పేస్తే వాళ్ళేమనుకుంటారు?

"మీరెందుకింతకఠినంగా మారిపోయారు. పుట్టినపాపే అందుకు కారణమైతే, నిజంగా నేనెంతో దురదృష్టవంతురాలిని. ఆడపిల్లలైతే వచ్చినబాధ ఏమిటో నాకు అర్థం కావటంలేదు. ప్రపంచంలో ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులంతా మీలాగే మనసులు విరుచుకుంటున్నారా? ఇంతవరకూ ఏ ఒడుదుడుకులూ లేకుండా సాఫీగా సాగిపోతూన్న మన సంసారంలో, ఏగొడవా లేకపోయినా; ఈనాటికి బాధపడేటట్టు చేస్తున్నారు ఈ విషయంలో నేనెంతవరకూ బాధ్యురాలినో మీరు ఊహించలేరా?

"ఇప్పటికైనా మీ కోపాన్ని పోగొట్టుకుని, దయచేసి జవాబు వ్రాయండి. ఎదురు చూస్తూవుంటాను. లేకపోతే ఇంతవరకూ ఓపికతో మింగుతూవచ్చిన దుఃఖవాహిని పొంగి పొరులుతుందేమో! అప్పుడు పరిస్థితులు మరీ చిక్కగా పరిణమించవచ్చును.

"మూడవనెల రాగానే వచ్చి తీసుకు వెళ్ళండి. మీ విశాల"

ఆ ఉత్తరాన్ని వందసార్లైనా చదివి వుంటాడు రామానుజం ఏమీ పాలుపోలేదు. ఈ ఉత్తరం రాయడానికి ముఖం చెల్లక వూరుకున్నాడు. కాని మరో కారణమేముంది? కాని అప్రతిహతం ఈవిధంగా వుంటుందని ఆనాడు ఊహించలేకపోయాడు. అయితే ఇప్పుడీ ఒడుదుడుకుల్ని దాటడం ఎలా?

పూర్తిగా ఇంతగొడవకూ కారణం తనే. తన తొందరవల్లే విశాల అలాంటి క్లిష్టపరిస్థితుల్లో ఇరుక్కుంది. విశాల మనస్సును అనవసరంగా బాధకు లోనుచేశాడు. కనీసం తల్లి మందలించినరోజునైనా తను నిజాన్ని గుర్తించివుంటే పరిస్థితి ఇంతగా మారి వుండేదికాదు.

వెంటనే మామగారి పేర ఒక జాబు వ్రాసి పోస్టు చేశాడు. అందులోని ముఖ్యవిషయాలు రెండే రెండు:

"జాబు వ్రాయడం ఆలస్యం అయినందుకు మన్నించండి.. .... కొత్త ఉద్యోగం కావడంవలన, శెలవు దొరకడం కష్టం మూడవనెలరాగానే బావమరిది తోడిచ్చి విశాలను పంపండి పాపకు ముద్దులు!!"

* * *

అనుకున్న గడువుకంటే ముందుగానే అందిన ఉత్తరాన్ని చదువుకుని మురిసిపోయింది. తల్లికి చదివి వినిపించింది ఆ ఆనందంలో పాపను పదిసార్లు ముద్దుపెట్టుకుంది. కాలండరుదగ్గరికెళ్ళి మనసులోనే రోజులు లెక్కవేసింది. ఆ రాత్రి తేలికైన మనసుతో హాయిగా పాపపక్కలో నిద్రపోయింది విశాల!

* * *

మూడవ నెలరాగానే తమ్ముణ్ణి తోడు తీసుకుని పిల్లలతో వచ్చింది విశాల మామగారు రాసినప్రకారం, రామానుజం రైలుకు వెళ్ళి ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. పాపను భర్తకందించి, చిరునవ్వుతో రైలుదిగుతూన్న విశాలను చూసి రామానుజం కొత్త పెళ్ళికొడుకయ్యాడు!!

ఆ మరునాటి సాయంకాలం ఆఫీసునుండి ఇంటికి వచ్చేటప్పటికి, చంటిపాప ఇల్లు బద్దలయ్యేటట్లు ఏడుస్తూంది. విశాల, అత్తగారూ ఒకరు వంటఇంట్లోను, మరొకరు దొడ్లో పనుల్లో వున్నారు.

రామానుజం ఇంట్లో అడుగు పెడుతూనే "ఏమయ్యారు? ఇంట్లో వాళ్ళంతా? చంటిది ఇలా గుక్కపెట్టి ఏడుస్తూవుంటే వినపడ్డం లేదు కాబోలు!" అంటూ కేకలు వెయ్యడం మొదలుపెట్టాడు

వంటఇంట్లో పనిలోవున్న ముసలావిడ వచ్చి, ఏడుస్తూన్న పిల్లను ఎత్తుకుని సముదాయిస్తూన్న కొడుకును చూసి నవ్వుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

రామానుజం చేతిలోవున్న పిల్లను తేరిపార చూశాడు.. అచ్చంగా అతని పోలికే! చిన్న నవ్వునవ్వుకుని ముద్దు పెట్టుకున్నాడు.

అప్పటికే వంటింట్లోంచి వచ్చి, ప్రక్కగా నిలబడి ఈ దృశ్యాన్ని చూసిన విశాల ఆనందంతో ఉప్పొంగిపోయింది తొందర తొందరగా వచ్చి "ఇలా ఇవ్వండి చాలు కాని. పసిపిల్లను అలా నలిపేస్తే దానికేమన్నా ఊపిరి సలపాలా! వద్దా?" అంటూ చంటిపాపను భర్త చేతుల్లోంచి తీసుకుంది మూతి అదోలా పెట్టి.

రామానుజం తెల్లబోయి "అలాగా" అంటూ గదిలోకి దూరుకున్నాడు.

* * *

ఆరాత్రి ఆకాశాన్నంటిన మబ్బులు పూర్తిగా వీడినయ్ చంద్రుడు ఆనందాతిరేకంతో వెన్నెలకురిపించి ప్రకృతికి ప్రాణంపోశాడు. రామానుజం ఈ రాత్రి మరో ప్రమోషనే కావాలంటే, విశాల ముఖం ముడుచుకుంది!!... ★

వక్రకిరణాలు

మూలం:
రేమండే మెసే

అనువాదం:
శేషు

వెన్నిసునగరంలో ఎక్కిన మేం ముగ్గురం మాత్రమే ఆ మూడోతరగతి రైలు యందు ఎక్స్‌ప్రెస్సు పెట్టెలో ప్రయాణం చేస్తున్నాం. మేం ముగ్గురం విభిన్న దేశీయులం కావడంతో ఒకరితో మరొకరికి పరిచయం కలగడానికి కొంత ఆలస్యం పట్టింది. శుభ్రమైన గుడ్డల్లో చిరునవ్వు ముఖాలతో ఉన్న వారిద్దరూ వయస్సులో పెద్దవారైనా నాతో సరియైన ఉత్సాహంతోనే కాలక్షేపం చేస్తున్నారు. వారిద్దర్లో ఒకరు ఫ్రెంచిజాతికి మరొకరు ఇటాలియన్ జాతికి చెందినవారు. ఫ్రెంచి దేశీయునికి ఇంగ్లీషు తెలుసును. మేం ముగ్గురం పారిస్ నగరమే వెళ్ళాలి. ఇటాలీ దేశీయుడు దేశాటనం కోసం, ఫ్రెంచి దేశీయుడు వ్యాపారదృష్టితోనూ ప్రయాణం చేస్తున్నారు. పారిస్‌లో ఉన్న స్నేహితులదగ్గర నుండి కొంతడబ్బు బదులు తీసుకుని తిరిగి ఇంగ్లండు ప్రయాణం కొనసాగించాలనే నా ప్రయాణం సాగుతోంది.

"మీరు ఏ వ్యాపారం చేస్తుంటార"ని ఫ్రెంచి దేశీయుడు ప్రశ్నించాడు. దానికి సమాధానంగా నేనొక రచయితననీ, కొద్ది కాలంలోనే నవలారచయితను కానున్నాననీ చెప్పాను.

తానొక కృషీవలుడననీ పారిస్‌లో తన కూతుర్ని చూడ్డానికి చాలకాలమైనందున వెళుతున్నాననీ చెప్పాడు. ఒక కొడుకు గలిగిన ఆమె ఆరు సంవత్సరాల క్రితం అతనిని సూచించెనట. వారికోసం బహుమతులు తీసుకు వెళుతున్నాడా ఇటాలియన్ జాతీయుడు.

"ఆ బహుమతి ఏమిటి"ని ఫ్రెంచి దేశీయుని ప్రశ్న.

"మనం నమ్మకమైన స్నేహితుల మైతే చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు కాని అందర్నీ అన్ని వేళలా నమ్మడం అంత మంచిది కాదు"

అంతవరకూ కొంత తక్కువగా మావైపు చూస్తున్న ఇటాలీ దేశీయునిపై హఠాత్తుగా అవ్యాజమైన ఆసక్తి పుట్టుకొచ్చినట్టుగా నాకు తెలుసు. "అదేదో కస్టమ్స్‌శాఖ కనుగప్పవలసిందిగానో అయివుంటుం"దన్నాడతను ఫ్రెంచి జాతీయుడు.

"ఉష్-బిగ్గరగా మాట్లాడకండి" అంటుంటే ఆ ఇటాలియన్ జాతీయుని కన్నులు పెద్దవై అతిమరుగ్గా తిరగసాగాయి. ఫ్రెంచి జాతీయుని నవ్వైన నవ్వు ఇటాలియన్ జాతీయుని ముఖంలో చిన్నతనాన్ని సూచించింది.

నిశ్శబ్దాన్ని భగ్నంచేసి నాలోని ఆత్రత "మీరు దేన్ని దొంగతనంగా తీసుకుపోతున్నార"ని ప్రశ్నించింది.

"దాన్ని మీకు చెప్పడం నాకు చాల అపాయకరం"

ఫ్రెంచి జాతీయుడు తన సూట్‌కేసు నుండి ఒక బ్రాందీ సీసాను పైకితీసి "మనం కొద్ది కొద్దిగా దీన్ని సేవిద్దాం" అంటూ మూతతీశాడు. "ఇది నరాలకు మరింత బలాన్ని కలిగిస్తుం"దంటూ అందించిన సీసాను ఆ ఇటాలియన్ జాతీయుడు నోటి దగ్గర చేర్చి తనకు కావలసినది తను పుచ్చుకున్నాడు.

"సీసా నిండుగా ఉంది. ఇంకా బాగా పుచ్చుకోండం"టూ ఆ సీసాను తిరిగి నవ్వుతూ నా ఒడిలో ఉంచాడు.

నేను సేవించగలిగినది సేవించి సీసాను తిరిగి ఫ్రెంచి జాతీయుని చేతి కందించాను. అతడు చాల భాగం ఖాళీ చేశాడు. మా స్నేహాలు ఆ విధంగా బంధికృతమయ్యాయి. ఇటాలియన్ జాతీయుడు, నేను మా మా రహస్యాల్ని విప్పి చెప్పుకున్నాం. ఫ్రెంచి జాతీయుడు అతని వ్యాపారాన్ని, అతని ప్రశంసనూ కప్పిపుచ్చుకుని చాల ప్రశ్నలు వేశాడు మమ్మల్ని. ఎక్స్‌ప్రెస్సు స్విట్జర్లెండు సరిహద్దుల్లోకి పోతుండడంతో ఇటాలియన్ జాతీయుడు, నేను ఫ్రెంచి జాతీయుడు యిరుకు చేసిన నిజస్వరూపం మెల్లమెల్లగా బైటపడుతుండడం గమనిస్తున్నాం. నేను పాతబట్టలు వేసుకున్నాను. నాకున్న సామాను ఒక సంచితో సంగీత పుస్తకాలు మాత్రం. ఇటాలియన్ జాతీయుడు చౌకబారువైనా శుభ్రమైన గుడ్డలు వేసుకున్నాడు. అతనికున్న సామాను ఒక అట్ట సూట్‌కేసు మాత్రం.

ఫ్రెంచిజాతీయుడు తన ధనికస్థితి చెప్పినతరువాత అతన్ని అతడు మూడవ తరగతిలో ప్రయాణం చేయడానికిగల కారణం అడగకుండా ఉండలేకపోయాను. తన ధనమంతా ఇటలీ దేశంలో ఖర్చయిపోయినందువల్ల చౌకటిక్కెట్టు కొనవలసి వచ్చిందని అతడు సమాధానం చెప్పాడు.

* * *

కొనసాగే సంభాషణ అకస్మాత్తుగా ఆగిపోయింది. ఇద్దరు కస్టమ్స్ శాఖాధికార్లూ, ఒక స్విట్జర్లెండు పోలీసు అధికారి మా పెట్టెలో ప్రత్యక్షమవడమే దానికి కారణం.

ప్యాస్‌పోర్టులు, చెప్పవలసిన ప్రత్యేక విషయాలను గురించి వారు అడిగారు. నా ప్యాస్‌పోర్టును చూపుతూ ప్రత్యేక విషయాలేవీ లేవంటూ సమాధానం చెప్పాను. నా వెనుక దాచిన ఇటాలియన్ జాతీయుని చూడకుండానే ఫ్రెంచిజాతీయునిదగ్గరకు చేరారు. అతనివద్ద పని ముగించుకుని తిరిగి ఇటాలియన్ జాతీయునివద్దకు వచ్చారు. ప్రత్యేక విషయాలేవీ లేవంటూ అతని ప్యాస్‌పోర్టును వారికిచ్చాడు.

కస్టమ్స్ శాఖాధికారి కొద్దిసేపటాలు చూచి దాన్ని పోలీసుఅధికారిచేతి కిచ్చాడు. పోలీసుఅధికారి తల ఊపుతూ "ప్రయాణం ఎక్కడికి?" అని ప్రశ్నించాడు.

"పారిస్" అని ఇటాలియన్ జాతీయుడు జవాబు చెప్పాడు.

మరి యింకే ప్రశ్నలు లేకుండా ప్యాస్‌పోర్టును తిరిగిచ్చి వారు ముగ్గురూ మా పెట్టె నుండి దిగిపోయారు.

ఫ్రెంచిజాతీయుడు మరో బ్రాందీ సీసా తీసి, ముఖమంతా చెమటతో తడిసిన ఇటాలియన్ జాతీయుని కిచ్చాడు. సీసా తిరిగి అతన్ని చేరేలోపునే మా పెట్టెలుపుదగ్గర తిరిగి కొద్ది పెద్దదవ్వడయ్యింది.

"[illegible] కస్టమ్స్‌శాఖ" అన్నాను.

"[illegible] లేవ"న్నాడు ఫ్రెంచి జాతీయుడు.

ఈసారి ఇటాలియన్ జాతీయుడు కలుగ

★ వక్రకిరణాలు ★

తీసుకున్నాడు. ప్రత్యేకత ఏంలేకుండానే తనిఖీ జరిగిపోయింది.

"మీదగ్గరున్నదేదో యిప్పుడు చెప్పక తప్పద"ని ఫ్రెంచి జాతీయుడన్నాడు.

"అది అంత విలువైందా" అని నే నన్నాను.

"అది అంత విలువైంది కాకున్నా ఒక దేశంనుంచి మరోదేశం తీసుకుపోవడం మాత్రం నిషిద్ధం"

చిరునవ్వు నవ్వుతూ "బహుశా బంగారమై ఉంటుంది" అన్నాడు ఫ్రెంచి జాతీయుడు.

"మీ కెలా తెలుసు" నన్నాడు ఇటాలియన్ జాతీయుడు.

"నా కిలాంటి సంగతులు చాలా తెల్సు" నన్న సమాధానం అతనిలో ఘనతను వ్యక్తపరచిం దనుకున్నా డతడు.

"ఒక్క యిరవై బంగారు నాణాలు మాత్రం. అది దాని తాతగారిఆస్తి. ఇంతవరకూ దాన్ని కాపాడుకుంటూ వచ్చాను. నాదగ్గరున్నదీ కాస్తే. దీన్ని మీ హస్తగతం చేస్తే నాబాధ్యత తీరిపోతుం"దని చెప్పడంతో అతనికళ్లు చెమ్మగిల్లాయి.

అతనిపైఖరిలోని మార్దవం నన్ను కదిలించింది. హృదయం కరగిపోయింది. నాకు తెలియకుండానే నాలో జాలి పుట్టుకొచ్చింది. అప్రయత్నంగా "ఫ్రెంచి కస్టమ్స్‌శాఖతో యింక యేం ఫరవాలే" దన్నాను.

తనకు ఫ్రెంచి కస్టమ్స్‌శాఖవారితోనే ఎక్కువ బాధాకరంగా ఉండేది అని ఫ్రెంచి జాతీయుడొకడు చెప్పిన సమాధానం వారిలో కొంత అలజడికలిగించింది.

ఫ్రెంచిసరిహద్దులు చేరుతున్న కొద్దీ అతనిలో ఖంగారు అధికమైపోతోంది. సిగరెట్టువెనుక సిగరెట్టు నిర్విరామంగా కాలుస్తున్నాడు. పెట్టెలో అటు యిటు పచార్లు చేస్తున్నాడు. ఫ్రెంచిజాతీయుడు తిరుగుతూ "ఆబంగారునాణాలు ఎక్కడున్నాయి" అనిప్రశ్నించాడు.

"నా జేబులోనే ఉన్నా"యని జవాబు చెప్పాడు.

"కస్టమ్స్ శాఖవారు జేబులు తనిఖీ చెయ్యరు. ఒక్కసామానుమాత్రమే వెదుకుతారు" ఆమాటలు ఇటాలియన్ జాతీయునికి కొంతశాంతి కలుగజేశాయి.

* * *

ఇటాలియన్ జాతీయునిపట్ల అతని వదాన్యతను చూచి ఫ్రెంచిజాతీయునిపట నాకున్న స్నేహభావాని[illegible]చుకున్నాను. అప్పటికప్పుడే ఫ్రెంచి సరిహద్దులలో చేరిపోయాము.

ఒకపెట్టెనుండి మరొకపెట్టెకు కస్టమ్స్ శాఖవారు చేసే తనిఖీప్రశ్నలు వినిపిస్తున్నాయి మమ్మల్నందర్నీ భయపెట్టడంలో ఆ ఫ్రెంచి జాతీయుడు కృతకృత్యుడయ్యాడు. ఫ్రెంచి కస్టమ్స్ శాఖవారు మాపెట్టె తట్టడంతో నాకడుపులో తిపులు పుట్టింది.

వారుకూడ స్విడ్జర్లెండు కస్టమ్స్‌శాఖవారు అడిగినట్లుగానే అడిగారు.

వారుఅడిగినప్రకారం నాపాస్‌పోర్టు, నాసామాను వారికి చూపించాను.

ఫ్రెంచిజాతీయుని సమీపించారు. వారిని చూడగానే అతనిముఖం వివర్ణమైంది. అతడు దేన్నీ చెప్పకముందు ఇటాలియన్ జాతీయునివైపు వేలుతో చూపుతూ "అతని చొక్కాజేబులో బంగారముంది. పరీక్ష చేయండి" అన్నాడు.

నాకిదంతా భ్రాంతిగా తోచింది.

"కుడిచేతివైపు జేబులోన"ని ధృవపరచి చెప్పాడు తిరిగి.

వానిపైకురికి వెంటనే ఆ ఫ్రెంచిజాతీయుణ్ణి బంధించుదామనుకున్నాను. కాని ఇటాలియన్ జాతీయుని దృష్టిలోని ప్రశాంతత నన్ను శాంతింపజేసింది.

అనవసరంగా జేబులోని బంగారాన్ని ఆ కస్టమ్స్ శాఖాధికారిచేతిలో ఉంచాడు.

"చాలా పెద్దనేరంచేశారు. మీరు కొంతసేపు ఆగండి" అన్నాడు ఆ అధికారి.

తలుపు వేయకుండానే క్రిందకుదిగుతూ పక్కపెట్టెలోనున్న తనతోటి అధికారిని, పోలీసు అధికారిని పిలిచాడు. అప్పుడప్పుడు ఇటాలియన్ జాతీయునివైపూ, మా పెట్టెవైపూ మాస్తూ చాలా వేగంగా మాట్లాడుకుంటున్నారు. సంభాషణలు సమాప్తమయ్యాయి. మొదటి కస్టమ్స్‌శాఖాధికారి మాపెట్టెలోనికెక్కాడు.

"మీరు చాలా అదృష్టవంతులు. ఈసారి బంగారాన్ని ప్రభుత్వధనంగా జమచేస్తాం. మరోసారెప్పుడైనా యిలాంటి నేరంచేస్తే ఖైదుచేస్తామం"టూ ఏవోకొన్ని కాగితాలపై సంతకం చేయించుకున్నాడు

ఫ్రెంచిజాతీయుని ప్యాస్‌పోర్టు పరీక్ష చేసి మా పెట్టెదిగి వెళ్ళిపోయాడు.

* * *

కొద్దిక్షణాలు మేం ఎవ్వరమూ మాట్లాడుకోలేదు. ఫ్రెంచి జాతీయుని కొళ్ళ ముందుకు ఇటాలియన్ జాతీయుడు చేరాడు. అతనికళ్లు అగ్నిగోళాలా ఉన్నాయి. అతని పెదవులు కోపంతో వణికిపోతున్నాయి అతడు చేయబోయేదేమిటో నాకగమ్యగోచరంగా ఉంది. కాని అతని చేయి జేబులోమాత్రం పెట్టుకున్నాడు. ఇటాలియన్ జాతీయులు జేబులలో చాకులుంచుకుంటారన్న సంగతి నాకు జ్ఞప్తికి వచ్చింది.

"ముందుగా నన్ను మీకు క్షమార్పణ చెప్పకోనియ్యండి. నేను చెప్పవలసింది చాలాఉంది" అంటూ పాలిపోయిన ముఖంలో లేనినవ్వు తెచ్చుకుంటూ ఇటాలియన్ జాతీయునితో చెప్పాడు

"మీరు నాకు చేసిన సహాయానికి కృతజ్ఞుణ్ణి. మీరు నష్టపడినదానికి రెట్టింపు విలువైన బంగారాన్ని మీకు యిస్తాను. కస్టమ్స్ శాఖవారి దృష్టికిరణాలను నామీదనుంచి వక్రగతిని వెళ్లేందుకు మీవైపు మళ్లించాను. మిమ్మల్నుపయోగించుకున్నాను. అంతేగాని మీ కేవిధమైనద్రోహం నేను తలపెట్టలేదం"టూ ఎంతగానో ప్రతిమాలాడు.

"నాకేం అర్థంకాలేదు" అన్నాడు ఇటాలియన్ జాతీయుడు.

"నా సూట్‌కేసులో కొన్ని వేలపౌండ్ల విలువైనబంగారుకడ్డీలున్నా"యని ఫ్రెంచి జాతీయుడు చెప్పిన సంగతి మాకు విస్మయాన్ని కలిగించింది.

ఇంతలో మేం అందరం పారిస్ చేరుకున్నాం. స్నేహితుల్లాగనే విడిపోయాం.

★



వనితాలోకం

మరికొన్ని యోగాసనాలు ★

ఆరోగ్యాన్ని గురించీ దాని ప్రాముఖ్యాన్ని గురించీ తెలియనివారు లోకానికి చెప్పనివారు చాలాఅరుదు ఈ విధముగానే ఆరోగ్యాన్ని గురించి తగినంత శ్రద్ధ కనబరచేవారుకూడా తక్కువే

ఆహారనియమముచేత మనశక్తిని ఆరోగ్యాన్ని పోషించుకోవటము సాధ్యమని అనేకమంది శాస్త్రజ్ఞులు, పరిశోధకులు నిర్ణయించారు. ఈవిషయముకూడా అందరికీ తెలిసినదే కాని అశ్రద్ధ అలక్ష్యములచేత ఎంతోమంది అనారోగ్యము పాలయి తను సంపాదనలో సగానికిపైగా మందులకు ధారపోయటము జరుగుతున్నది, అయినా తిరిగి ఎప్పటి ఆరోగ్యాన్ని పొందలేక పోతున్నారు

దేహారోగ్యము సరిగా ఉండటముచేత బుద్ధి ఏవిధముగా వికసించుతుందనేది ఒక ప్రశ్న. కండరాల ముడుపుదనమువల్ల ఎంతటి శ్రమనైనా ఓర్చుకొనగలిగిన మనశ్శక్తి కలుగుతుందని ఒక శతాబ్దముక్రిందట హాఫ్‌డింగ్ అనే జర్మను తత్వవేత్త ఉద్ఘాటించాడు యోగసాధనచేత శారీరకమైన ఆరోగ్యాభివృద్ధే కాక మానసిక నైతికాభివృద్ధి కూడా కలుగుతుందనీ, జ్ఞానసాధనకు యోగమే మార్గమనీ మన ప్రాచీనులు ఏనాడో కనిపెట్టారు. ఋషులు యోగసాధనవల్ల ఇనుమడింప చేసుకొన్న తపశ్శక్తిచేత భగవత్సాక్షాత్కారాన్ని సిద్ధింపచేసుకొని లోకకళ్యాణము చేకూర్చినట్లు మనకు పౌరాణిక ప్రమాణాలు అనేకముగా ఉన్నాయి

మనిషికి నిరుత్సాహము కలిగినప్పుడు సుఖాసీనుడై దీర్ఘముగా శ్వాసను లోపలికి తీసుకొంటూ, నాలుగు దిక్కులూ పరకాయించి చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించినట్లయితే, ఆ తరువాత ఉద్భవించే భావాలు ఉదాత్తముగా ఉండగలవని రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి మొదలైనవారిని దర్శించినవారికి అనుభవైక వేద్యము ఈ ఆసనమువల్ల దేహములోని కండరాలు నరాలు పూర్తిగా స్వాధీనములయి జీర్ణశక్తి వృద్ధిపొందుతుంది. దీనివల్ల నిరుత్సాహము, దానికి సంబంధించిన మనోవ్యాకులత, చాలా వరకు నశించి నూతనోత్సాహము కలుగుతుంది

కొందరికి సంపూర్ణారోగ్యము దుర్లభము కావచ్చు - ప్రకృతి వారి విషయములో పక్షపాతము చూపించినప్పటికి శరీర పరిశ్రమచేత పదిమందిలో తొమ్మిదిమంది తప్పక అభివృద్ధికి రాగలరు.

ప్రాచీనార్య సంస్కృతి ననుసరించి యోగసాధనను ప్రజలలో ప్రచారము చేయటానికి లెర్ సోరాలో మొట్టమొదట యోగసాధనాలయము 1918 లో స్థాపింపబడ్డది యోగవిజ్ఞానము అనే గ్రంథము యొక్క వ్రాతప్రతి సిద్ధము చేయబడ్డది. దాని ననుసరించి స్త్రీ పురుషులకు శిక్షణ ప్రారంభింపబడ్డది ఈ సంస్థను స్థాపించిన శ్రీ యోగీంద్రులు పశ్చిమదేశాలను పర్యటించి లండను నగరములోకూడా ఒక కేంద్రాన్ని స్థాపించారు


న్యూయార్కులోని రాక్‌ఫెల్లరు ఔషధాలయమువారు, బ్లూమింగ్ డేల్ వైద్యాలయమువారు, ఆయుర్వృద్ధి పరిశోధనాలయమువారు శరీరావయవములమీద యోగసాధనా పరిణామాన్ని గురించి యోగీంద్రులతో చర్చించారు వారి సహకారముతో యోగీంద్రులు ప్రయోగముచేసి చూపించారు; ఫలితాలను అందరూ ఆమోదించారు యోగసాధనలో స్త్రీపురుషులకు ప్రత్యేక విధానాలను శ్రీ యోగీంద్రులు నిర్ణయించారు. వీటి ననుసరించి విదేశాలలో కొన్ని కేంద్రాలను నెలకొల్పారు

శరీరానికి అధికశ్రమను కలిగించక కండరాలకు నరాలకు పటిమనిచ్చే మార్గాలను సాధనలను యోగాశ్రమములో స్త్రీపురుషులకు బోధిస్తున్నారు మనోవికారముల నన్ని

(30-వ పేజీ చూడండి)



హెర్క్యులీస్



— సింహము

ఫోటో : ఎ. రామచంద్రరావు—మద్రాసు.

టిని నిగ్రహించగలశక్తినీ, వాని సద్వినియోగానికి ప్రత్యేకముగా కనిపెట్టిన మార్గాలను ప్రచారములోకి తీసుకొని వస్తున్నారు. సంతాన నిరోధము, సంతాన నియమనము (*Birth Control & Family planning*) సాధించటానికికూడా యోగసాధనా విధానాలలో మార్గాలున్నాయని శ్రీ యోగీంద్రులు తెలుపుతున్నారు.

యోగసాధనాలయములో స్త్రీల శాఖను నిర్వహించటములో సఫలీకృతురాలైనది శ్రీమతి సీతా [illegible] కర దట స్థాపింపబడిన ఈ సంస్థలో అవిరళకృషి సలుపుతున్నది. స్త్రీలకు ఉపయోగకరమైన యోగాసనాలను వాటి ప్రయోజనాలను వివరిస్తూ ఈమె ఒక గ్రంథము ప్రచురించింది (*Yoga, Physical Education*) దీనిలో యోగాసన విధానాలు చిత్రపటములతో కూడా ముద్రింపబడ్డాయి. ఈ గ్రంథములో ఉదహరింపబడినయోగాసనాలు ప్రాచీన సంప్రదాయాలను ఆధునిక విజ్ఞానశాస్త్రమును మేళవించి ఏర్పరచినవి.

ప్రథమముముద్రణలో రచయిత్రి చిత్రపటములతో వివరించిన ఆసనాలు ఎనిమిది రకాలు. వాటినిగురించి వివరముగా 19-4-58 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 'వ్యాయామము' అనే వ్యాసమొకటి వ్రాసెను. ఈ గ్రంథము 1957 లో మరొక ముద్రణకు వచ్చినది. దీనిలో రచయిత్రి యోగసాధనాలయములోని క్రొత్త పరిశోధనానుభవముచేత కనిపెట్టిన మరికొన్ని ఆసనములనుగురించి వ్రాసింది.

1. పద్మాసనము: మన దేశములో పద్మాసనము పేరు వినని వారు లేరు. ఈ ఆసనము వలన దేహములో నడుము క్రిందిభాగము సహజమైన శారీరకకదలికలకు స్వాధీనమవుతుంది. నిరంతరము కుర్చీలలో సోఫాలలో కూర్చొను వారికి ఈ ఆసనమును సాధన చేసిన వారికి శరీరావయవ పటుత్వములో కావలసినంత వ్యత్యాసము కనబడుతు నే ఉంటుంది. ఈ ఆసనమువలన పొత్తికడుపులోని అన్ని కోశములకు వాటికండరములకు నరములకు తగిన పరిశ్రమ లభిస్తుంది. కడుపులోపలికి పోవునట్లుగా శ్వాసను తీసుకొని ఉచ్ఛ్వాస నిశ్వాసములను లయబద్ధము చేసినట్లయితే పొత్తికడుపులో రక్తప్రసారము చురుకుగా జరుగుతుంది. దానివలన నడుముక్రింది భాగము చురుకుదనము కలిగి తేలికగా ఉంటుంది. నిటారుగా వెన్ను విరుచుకొని కూర్చున్నందువలన పొత్తికడుపులోని ప్రేవులకుకూడా చురుకుదనము కలుగుతుంది.

2. యష్టికాసనము: (*Stick Pose*) శాస్త్రకులు మనిషి పొడగరితనాన్ని దేశము, జాతి మొదలైన వివరాలనుబట్టి నిర్ణయిస్తారు. మానవుడి సాధారణ పొడగరితనము సంపూర్ణావయవ వికాసమని శరీర శాస్త్రజ్ఞుల అభిప్రాయము. గిడసబారిన మనుష్యులు, పొట్టివారు సంపూర్ణావయవ వికాసముకలవారు కారన్నమాట. కొందరికి ఆనువంశికముగా ఈలోపములు సంక్రమించినప్పటికీ వారి అవయవములన్ని కుదింపబడి పోయినవని శాస్త్రజ్ఞుల నమ్మకము. స్త్రీలకంటె పురుషులు పొడగరులు; అయినప్పటికీ సగటున 5 లేక 4½ అడుగులు ఉండవలసిన పరిమాణము యోగశాస్త్రానుసారము సన్నటిదేహము ప్రసన్న వదనము ప్రతివారు కోరతగినవి. ఎంత ఆనువంశికమైనప్పటికీ కొంతవయసులో శరీరవ్యాయామముచేత పొడగరితనమును సాధింపవచ్చునని ప్రయోగపూర్వకముగా యోగసాధనాలయమువారు నిరూపిస్తున్నారు. సాధారణ వైద్యులుకూడా 25 సంవత్సరములవరకు మనుష్యులు పొడుగయే కాలమని అభిప్రాయపడ్డారు.

స్త్రీల అవయవ నిర్మాణము శరీరశాస్త్రజ్ఞుల గణితానికిగాని ప్రబంధకవుల వర్ణనలకుగాని అందనిది. చేతులు ఇంత పొడవుఉన్నయెడల కాళ్లు ఇంత పొడవుఉంటాయనీ, మధ్యదేహము, భుజాలు, పాదాలు, మెడ, ఇంత అనీ నిర్ణయించటానికి వాటి పరిమాణము లెక్కలకు ఇమడనిది. ఈ లెక్కల ప్రకారము శరీరాలను సంస్కరించటము అసాధ్యము. అయినప్పటికీ సహజముగా ఉన్న దేహమును సహజవికాసముతో సాధ్యమైనంతవరకు పెంపొందించుకొనే సాధనలు కనిపెట్టబడినవి ఎముకపుష్టి శరీరాకారములపైన పొడుగయే అవకాశము ఆధారపడి ఉంటుంది. ఈ యష్టికాసన

ములో చల్లకల పరుండి, చేతులను తలకు రెండుప్రక్కలా చాచి, నియమబద్ధమైన ఉచ్ఛ్వాసనిశ్వాసములతో శరీరము కదల కుండా నిలుపవలెను. ఈ ఆసనము 4 సెకండ్లనుండి 6 సెకండ్లవరకు నిలుపతగి నది. దేహములోని అవయవములన్నీ వాటి వాటి స్థానములలో నిలచి చాపినట్లుగా ఉంచవలెనని దీని నిర్దేశము. శరీరములోని ఏ భాగముయినా వంగిపోయిగాని, ముడుచు కొనిపోయిగాని ఉన్నట్లయితే, ఈ ఆస నముపలన వికసించగలుగుతాయి. పొత్తి కడుపులోని భాగములన్నీ కుదించుకొని ఒకదాని ఒత్తిడివల్ల మరొకటి నలిగిపోయి గాని ఇరుకున పడ్డట్లు గాని ఉన్నట్లయితే ఆబాధలు పరిమాణాలు తొలగి అవి యథా

★ మరికొన్ని యోగాసనాలు ★

స్థానములలో నిలచి ఉండగలవు. ఈ ఆసనము ఉదయపు వేళ కనీసము 1 నిమిషము సేపయినా చేయతగినది. స్త్రీలకు స్థూల్యము అనారోగ్య లక్షణము. అవయవములలో కొన్ని వాటివాటి ధర్మములను సక్రమముగా నిర్వర్తింపకపోవటముచేత కలిగేపరిణామము స్థూల్యము. ఈలోపముకూడ ఈ ఆసనమువలన చక్కబడగలదు.

3. త్రికోణాసనములో మరొక భేదము: మీ కాళ్లు వంచకుండా వంగి, కాలి బొటన వ్రేళ్లను చేతివ్రేళ్లతో అందుకోవటము త్రికోణాసనము. ఒక చేతితో కాలి బొటన వ్రేలినిపట్టుకొని మరొక చేతిని సాధ్యమైనంత ఎత్తుగా చాపటము, 8 సెకండ్లకాలము శ్వాసను లోపలికి తీసుకుని 6 సెకండ్ల కాలము ఆవిధముగా నిలచి ఉండటము, తరువాత నెమ్మదిగా 8 సెకండ్లకాలము శ్వాసను విడచిపెట్టటము క్రొత్తగా నేసిన మార్పులు. ఈవిధముగా వెంటవెంట ఒక నిమిషములలో 10 మారులు, అనగా ప్రతిపక్షమున 5 పర్యాయములు చేయవలసి ఉంటుంది. ఈ ఆసనము పొత్తికడుపుమీద వదుముచుట్టూ పేరిగిన క్రొవ్వును కరగించివేస్తుంది. పొత్తికడుపులోని కండరాలకు కదలిక ఏర్పడి, రక్తప్రసారము చురుకుగా జరుగగలదు. ప్రారంభములో ఈ ఆసనము 6 సెకండ్లకాలము నిలుపుట ప్రారంభించి, క్రమముగా ఒక నిమిషము వరకూ నిలుపుటకు ప్రయత్నము చేయాలి.

4. గరుడాసనము: నిటారుగా నిలబడి ఒక కాలికి మరొక కాలు తొడదగ్గర, మోకాలి క్రింద, మెలికపడ్డట్లుగా తిప్పాలి. కాలు మెలిక తిప్పేటప్పుడు ఊపిరిపీలుస్తూ ఉండాలి. ఇలాగే చేతులుకూడా మెలితిప్పి తలకు నూటిగా ఎత్తిపట్టుకోవాలి. ఈ ఆసనము చేయటము పూర్తిఅయేవరకూ ఊపిరిబిగించి, తరువాత దీర్ఘముగా పీల్చాలి. ఈ ఆసనము సాధ్యమైనంతకాలము నిలిపవచ్చును. దీని వలన మీ చేతులు ముంజేతులు, నడుము, మీ కాళ్లు, మడిమలు, భుజాలు బలకరమవుతాయి. కీళ్లవద్ద కదలికలు సులభముగా జరుగుతాయి. ఈ ఆసనము క్రమక్రమముగా —నిదానముగా సాధించవలసినది తొందరపాటువలన బెణకటము గాని నొప్పులు పుట్టటముగాని సంభవించవచ్చు—

5. హస్తపాదాంగుష్ఠాసనము: చేతులు రెండు ప్రక్కలా పెట్టుకొని కదలకుండా పాదములను దగ్గరకుచేర్చి నిటారుగా నిలబడాలి. శ్వాసనుపీలుస్తూ, మెల్లగా పాదాలు పైకి లేపగలిగినంత ఎత్తు లేపాలి, మీ కాళ్లు వంచకూడదు; లేపినపాదము యొక్క బొటనవ్రేలిని రెండు చేతులతో పట్టుకోవాలి. శ్వాసను బిగబట్టి ఆ స్థితిలో కొన్ని సెకండ్లకాలము ఉండాలి. తిరిగి యథాస్థితికి వచ్చునప్పుడు శ్వాసను మెల్లగా విడవాలి. ఈ విధముగా ఒక్కొక్క కాలు మూడుపర్యాయముల వంతున చేయవలసిన క్రమము. ఈ ఆసనము ప్రత్యేకముగా నడుము భాగానికి బలము చేకూర్చగలదు. స్త్రీలకు నడుము సన్నగా ఉంటే అందమని సాధారణముగా మనము అనుకుంటాము. అది అందముగా కనబడటమే కాకుండ ఎంత ఆరోగ్యప్రదమైనదో పీటివలన మనకు తెలుస్తుంది. సన్నటి నడుము ఆయుర్వృద్ధికరమని యోగశాస్త్రము చెప్పుతున్నది.

6. హస్తపాదాసనము. రెండు పాదములను దగ్గరగాచేర్చి నిటారుగా నిలబడి శ్వాసను విడుస్తూ మెల్లగా వంగి కాలి మడిమలను చేతులతో పట్టుకోవాలి; తలను అధోముఖముగా మెల్లగా దించాలి; శ్వాసను నిగ్రహించి కొన్ని సెకండ్లకాలమయిన తరువాత ఊపిరిపీలుస్తూ యథాస్థితికి మెల్లగా తీసుకొని రావాలి.

ముందుకు వంగునప్పుడు శ్వాసనువిడుస్తూ 2 సెకండ్లు, శ్వాసను నిగ్రహించి 4 సెకండ్లు, తిరిగి యథాస్థితికి వస్తూ శ్వాసను పీలుస్తూ 2 సెకండ్లు సమయము క్రమబద్ధము చేయాలి. రెండు సెకండ్ల విరామము తరువాత నిమిషమునకు 6 పర్యాయముల వంతున ఈ ఆసనము వేయాలి. దీనివలన [illegible] తగ్గిపోతుంది; పొత్తికడుపులోని అన్ని భాగాలు మరుకుగా [illegible] [illegible] నిర్వర్తించగలుగుతాయి [illegible] కరమైన ఆసనము.

7 మత్స్యాసనము పద్మాసనము వేసుకొని వీపును తలను మెల్లగా వెనుకకు నేలకానాలి [illegible] కుడిచేతితో ఎడమ చేతి దండను, ఎడమ చేతితో కుడి చేతి దండను పట్టుకోవాలి. ఈ ఆసనము వేసి 3 సెకండ్లకాలము శ్వాసను లోపలికి పీల్చాలి తరువాత 6 సెకండ్లకాలము శ్వాసను నిగ్రహించాలి. తిరిగి అవసరమును యథాప్రకారముగా ఆసనమును సడలించుకొని 3 సెకండ్లకాలములో శ్వాసను విడచిపెట్టాలి. ఈ ఆసనము 1 నిమిషమునుండి 3 నిమిషములవరకు నిలుపవచ్చు [illegible] [illegible] [illegible] [illegible] ఇది గర్భకోశానికి, [illegible] తగిన పరిశ్రమను కల్పించి [illegible] బలము కలిగిస్తుంది. దీనివలన గర్భకోశానికి [illegible] [illegible]

8 సర్వాంగాసనము మత్స్యాసనము కంటె [illegible] ఇవ్వగలదు, క్రొత్తగా పరిశోధించి సాధించినది వక్ర్యాసనము. మోకాళ్ల మీద నిలబడి, కాళ్ళనుపాదాలను ఆ విధముగానే ఉంచి, వెల్లకిలా పరుండి, రెండు చేతులను కడుపుమీదికి చేర్చాలి; నాలుగు సెకండ్లకాలము శ్వాసను లోపలికి తీసుకోవాలి; క్రమముగా శ్వాసను విడచిపెట్టాలి. దీని ఉపయోగముకూడా గర్భకోశమునకు పొత్తికడుపుకూ చెందినదే.

హాలాసనము, మకరాసనము, శవాసనము వాటివాటి ప్రత్యేకోపయోగములలో స్త్రీల కొరకు నిర్దేశింపబడ్డవి. ఈ యోగాసనాలకు అనుకూలమయిన కాలము ఉదయము, సాయంత్రము. ఆహారము తీసుకొన్న రెండు గంటలతరువాత గాని గంటముందుగా గాని చేయవలసి ఉంటుంది. నేలమీద దుంగచాప గాని అటువంటిదే మరొకటి గాని పరచుకొని ఆసనములు సాధనచేయాలి గాని మెత్తటి పరుపులు పనికిరావు.

యోగాసనాలు అధ్యాపకుల సన్నిధిలో అభ్యసించదగినవి ఉచ్ఛ్వాస నిశ్వాసములు బహు జాగ్రత్తతో గమనింపతగినవి. ఈ ఆసనాలలో కొన్ని కొందరు స్త్రీలకు అనుకూలమైనవి కావు. హృద్రోగము కలవారు, నిండుగర్భిణులు, యోగాసనాల జోలికి అధ్యాపకుల అనుజ్ఞ లేనిదే పోకూడదు. ఈ విషయములలో యోగసాధనాలయము వారి సలహాలను ఎప్పటికప్పుడు పొందటము ఉచితము.

ఆదర్శ స్త్రీజీవిత పరమావధి మాతృత్వమే నని ప్రకృతి నిర్ణయము. ఆరోగ్యకరమైన గర్భధారణ, సుఖప్రసవము, తరువాత తిరిగి యథాప్రకారముగా శరీర పటుత్వమును సంపాదించుకోవటానికి సులభమైన మార్గాలను అన్వేషించటము, లభించిన స్త్రీలు చేయవలసినవి. ఇది అభ్యుదయకాంక్షించేవారి కర్తవ్యము.

శ్రీమతి సీతాదేవి రచించిన ఈ గ్రంథము అమూల్యమైనది; స్త్రీజన కల్పవల్లి; దాని మూల్యము 10 రూ/లు మాత్రము అధికవిలుతో దొరకవచ్చును (*The yoga Institute, Post Box 481, Bombay, 1*)

స్త్రీలు యోగాసనాల విలువలను గ్రహించి వాటికి తగిన ప్రాముఖ్యము నివ్వాలి. ప్రతి ఆరోగ్య కేంద్రములలో శిక్షణపొందిన ఉపాధ్యాయినిని నియమించిన పక్షములో ఈ విద్య స్త్రీల ఆరోగ్యము కొరకు మహోపకారం ఈ విషయములో తగు శ్రద్ధను కనబరచాలి

స్త్రీ జనోపయోగకరములయిన యోగాసనాలను బాలికా విద్యాప్రణాళికలో చేర్చటము, వీలుగా ఉన్నప్పుడు విద్యార్థినులను తీసుకొనివెళ్లి ఉపాధ్యాయులు ఆశ్రమాన్ని సందర్శించటము భావి మాతృదేవతల ఆరోగ్య సాధనకు హేతుభూతము కాగలవు. ★

వనితాలోకం :

వ్యత్యాసం

సాయంత్రం నాల్గు గంటలయింది. గరల్స్ హైస్కూలునుండి విద్యార్థినులు గుంపులు గుంపులుగా వస్తున్నారు. రకరకాల రంగుల చీరలు కట్టుకొని వివిధ గమనాలతో సాగిపోతున్నారు. కొద్దిసేపట్లోనే అంతసందడీ చల్లబడిపోయింది. శారద ఎడమ చేతితో పుస్తకాలు పట్టుకొని బాహ్యప్రపంచంతో తనకేమీ సంబంధంలేనట్లు తలొంచుకొని చరచరా నడిచిపోతోంది. మెయిన్‌రోడ్డుదాటి ప్రక్కవీధిలోనికి ప్రవేశించింది. నడుస్తూ నడుస్తూ శారద చటుక్కుని ఆగిపోయింది. అంతవరకూ క్రిందిచూపులు చూస్తున్న ఆమె నయనాలు నలుమూలలా ఓసారి పరికించినై. సుమారు ఓపాతిక జతలకళ్లు తనమీదనే నిశ్చలంగా నిలిచినవని తెలియగనే ఆమె ఒళ్లు ఒక్కసారిగా జల్లుమంది. ప్రక్క సేట్ల కొట్టుమీదున్న మీసాలఆసామి అప్రయత్నంగా ఎగురుబడ్డ మేకవేపు చూచే పెద్దపులిలాగ చెల్లనిరూపాయలంతేసి కళ్లేసుకొని శారదవేపే చూస్తున్నాడు!

శారద ఓ రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయింది. ఎందుకో ఆమె చూపులు బెదురుతున్నై. ఆమె ఎవరివేపూ నిశ్చలంగా చూడడంలేదు. గుండె దడదడ కొట్టుకుంటూంది. ఆమె ఎందుకలా అక్కడ అకస్మాత్తుగా నిలబడిపోయిందో ఆమెను విచిత్రంగా చూస్తున్న అంతమందిలోనూ ఏ ఒక్కరికీ అర్థంకావటంలేదు. దూరాన్నుండి ఓ యిద్దరుయువకులు మస్తుగా ముస్తాబై ఆ దారినే వస్తూవస్తూ శారదను చూచి కొస్త తమ క్రాపులు సర్దుకొని చూచేసరికి శారద వాళ్ళవేపు అసలు చూడకపోగా, యింకోవేపు తలత్రిప్పుకొనటంమూలాన ఆ యువకసింహాలకి అరికాలిమంట నెత్తికెక్కింది. ఓనిమిషం అక్కడేనిలబడి ఆమెను పరికించిన తరువాత వాళ్ళలోఒకడు ఓపాట విసిరాడు "వరికోసమో ..." ఆ వాగ్బాణాలు సూటిగా వచ్చి శారద హృదయంలో నాటుకున్నాయి. ఎవరో కాళ్లమీద గురిచూచికొట్టినట్లు శారద వెనక్కితూలింది. అప్పటికామె మామూలు ప్రపంచంలోకొచ్చింది. ఛీ! ఔను! తనుచేస్తున్న దేమిటి యిక్కడ? నడిబజార్లో అర్థంలేకుండా అంతమందిమగాళ్ళముందు నిలబడిపోవడం అందరికీలోకువే... ఎన్నయినా అంటారు, వాళ్లుమగవాళ్లు! మరితనూ?— శారద ముఖం మీద చిరుచెమటలు పోసినాయి. ఎందుకో ఓసారి క్రిందకుచూచిందామె. ఆ తర్వాత వెంటనే అక్కడినుండి బయలుదేరి చురుకుగా అంగలు వేసుకుంటూ యిల్లుచేరుకుంది శారద.

* * *

ఇంటికివచ్చి పుస్తకాలుఅలమార్లో పెట్టుకొని తిన్నగా అన్నగారిగదిలోనికి వెళ్ళింది శారద. సత్యం వాలుకుర్చీలోపడుకొని ఏదోపుస్తకం చదువుతున్నాడు. శారద మెల్లిగావచ్చి "అన్నయ్యా" అని నెమ్మదిగా పిలిచింది

పుస్తకంపైనుండి "ఏం" అన్నట్టు చూచాడు సత్యం.

"అన్నయ్యా! యిప్పుడు నేను స్కూలునుండివస్తూంటే......"

పండా ఆదినారాయణమూర్తి

"ఏంటే చెల్లీ" ఆతురతగా ప్రశ్నించాడు సత్యం

"వసవది! చెప్పడసిగ్గేసింది!" తనలో గొణుక్కుంది శారద.

ఆ గొణుగుడు అర్థంకాలేదు సత్యానికి. అతను ఆలోచించి ఏదీ నిశ్చయించుకోలేక చెల్లితోటి ఏదోఅనటానికి నోరు విప్పేసరికి శారదేఅంది. "కాదన్నయ్యా! నేనిప్పుడు స్కూలునుండివస్తూంటే దారిలో రూపాయికాసు కనబడిందినాకు."

"తీశావా?"

"ఉండు చెప్తున్నానుండు! రోడ్డు దుమ్ములో ఆరూపాయి మసగా కనబడింది. మొదట తీద్దాంఅనుకున్నా! కాని... ... అక్కడున్న మగాళ్ళందరూ నావేపే చూస్తుండడంవల్ల నాకు తీయడానికి సిగ్గేసింది.... కొంచెం భయమేసింది! ఇలా అని ఓ అరక్షణంపూరుకొని మళ్ళీఅంది శారద "చూస్తూచూస్తూ ఆరూపాయిని వదలబుద్ధేయలా!"

"ఏంచేశావేమిటి?" ఆత్రంగా అడిగాడు సత్యం.

"తీద్దామా, వదిలేద్దామా అనే సందేహంతో పిచ్చిగా ఓ అయిదు నిమిషాలు

భర్త త్రాగుడు మరింత జోరు చేశాడు. భార్య మందలించింది. "అబ్బే! నేను ఎక్కువ త్రాగటం లేందే!" అన్నాడు భర్త.

"మరి ఆమూలాలకు అన్ని ఖాళీ సీసా లెట్లా వచ్చాయంటారు?"

"నేను తెచ్చాననుకున్నావా ఏమిటి కొంపతీసి? నాచేతులతో నేను ఒక్క ఖాళీ సీసా పట్టుకురాలేదు. తెలుసా?"

అలా నుంచుండిపోయాను. అంతట్లో కొరిణిపోయే యిద్దరుకుర్రాళ్లు నన్ను గూసి ఏవో కొంటెమాటలు అన్నారు నాకు ఏదో అనిపించి ఆవేశంగా వచ్చేశాను .." అన్నది శారద.

"అగేం టే పిచ్చిపిల్లా! నీక్కనబడ్డరూపాయి నువ్వుతీసుకుంటే అది నా దేవతే" అంటూ రుక్మిణమ్మగారు గదిలోకొచ్చింది.

ఆవిడమాటకు సత్యం నవ్వకుండావుండలేకపోయాడు. దానితో ఆమెకు రోషం వచ్చి "మనకుకనబడ్డడబ్బు మనంతీసుకోవడంలో తప్పేముందిరా? నువ్వునవ్వుతావు కాని నీకే ఆ రూపాయి కనబడిందనుకో! నువ్వు వదిలిపెట్తావా?" అంది సత్యం వేపు తీవ్రంగా చూస్తూ.

బలంగావస్తున్న నవ్వును బలిమిని అదిమిపెట్టుకొని "అదికాదమ్మా! ఆడకి మగకి తేడా వుంటుందికదూ!" అన్నాడు సత్యం.

"ఏం తేడారా నీబొంద! మగాళ్లుతీసుకొంటే ఖర్మలేదా? అదే ఆడకూతురు తీసుకొంటే కొంప మునిగిపోతుందా! బాగా చెప్పింది! ఉండవే శారదా, తమ్ముడొచ్చిన తరువాత వాడ్నిపంపి తెప్పిద్దాం ఆ రూపాయి......" విసురుగా అక్కడనుండి నిష్క్రమించింది రుక్మిణమ్మగారు.

ఇంతసేపూ శారద ఏమీమాట్లాడకుండా నిశ్చలంగా నిలబడివుంది. తర్వాత ఆమె సత్యంకేసిచూసి సన్నగానవ్వుతూ "అమ్మది అమాయకంగాని ఆరూపాయి తమ్ముడొచ్చేవరకు కూర్చుంటుందా! ఈలోపులో దానికి రెక్కలొచ్చి ఎవరి జేబులోకో చేరి వుంటుంది" అన్నది.

"అంతేనే చెల్లీ అంతే!" అంటూ చేతిలోని పుస్తకం బల్లమీద పెట్టాడు సత్యం.

★ వ్యత్యాసం ★

తర్వాత శారదకూడా ఓకుర్చీలో కూర్చుంటూ సత్యంవేపుతిరిగి "మనస్సదోలాగుందిరా అన్నయ్యా, వెధవది! ఆ రూపాయి నాకళ్లకనబడకపోయినా బాగుణ్ణు!" అన్నది.

సత్యం ఏం మాట్లాడలేదు.

"సరేకాని, అన్నయ్యా! ఆరూపాయి నేను తీసుకుంటే తప్పేమయినావుందా" సత్యంకళ్లలోకి సూటిగాచూస్తూ అడిగింది శారద.

సత్యం కొద్దిగా మందహాసంచేశాడు. అతనికి చెల్లెలి అమాయకత్వం నవ్వుతెప్పించింది. అతనుమెల్లగా "అందులో తప్పేముందిచెల్లీ! ఆ తీసుకోనకపోవడం మీ స్త్రీలలోని బలహీనతకి నిదర్శనం!" అన్నాడు.

తర్వాత శారద ఏం జవాబు చెప్పలేదు. ఆమె దీర్ఘంగా ఆలోచిస్తూ శూన్యంలోకి చూస్తోంది. అంతట్లోకి వంటింట్లోనుండి తల్లి కేక వినబడేసరికి శారద అక్కడనుండి కదలిపోయింది.

ఆమెకేసి చూస్తూ అలా నేజేరబడ్డాడు సత్యం పడకకుర్చీలో.


* * *

సుమారు మూడు నెలలు గడిచిపోయిన తరువాత ఒకరోజు మధ్యాహ్నం శారద నడిబజార్లో ఒంటరిగా నడుస్తూపోతోంది మధ్యాహ్నం ఎండకి కంకరరోడ్డు కాలిపోతోంది. కాలికి జోళ్లున్నందువల్ల శారదకు కాళ్లు కాలడంలేదుగాని చెమటక్రక్కుతూంది. అప్పుడే కాలేజీస్టోర్సులో కొన్న పుస్తకాలకట్ట మోయలేక మోస్తూంది. చేతులు తెగలాగుతున్నై. నడుస్తూనడుస్తూ ఏదో ఖంగుమన్న శబ్దం వినబడగానే శారద చటుక్కున ఆగిపోయింది. అరె! అంతవరకూ చేతిలోనున్న రూపాయికాసు పడిపోయిందే! అటూయిటూ రోడ్డుమీద చూచిందిశారద. కళ్లు ఆరాటంతో వెతుకుతున్నాయి కాని ఫలితం శూన్యం. ఖంగుమన్నదిక్కుగా మాసి చూసి విసుగెత్తింది శారద. పుస్తకాలు కొనగా మిగిలింది ఆరూపాయిఒక్కటే! రూపాయి పడిపోయిందని చెప్తే నాన్న ఏమంటాడు? "ఇంత వయసువచ్చిన తరువాతకూడా ఇంకా పారవేసుకోవడమేమిటే డబ్బు"అని నాన్న కోప్పడతారని ఊహించుకునేటప్పటికి శారదముఖం మేఘాచ్ఛాదితమైనట్లు నల్లబడిపోయింది. ఇంక రూపాయి దొరికేటట్లు లేదు. ఏమీ పాలుపోవడంలేదు. అప్పుడే అయిదునిమిషాలు గడిచిపోయింది. ఉండుండి ఒకసారి తలెత్తిచూసింది శారద. ఛీ! అందరూ తనవేపేచూస్తారెందుకని? .. చటుక్కున మూణ్ణెల్లక్రితం జరిగినసంఘటన జ్ఞాపకానికొచ్చింది అప్పుడంటే ఆరూపాయి తనదికాదు కాని యిప్పుడో —. శారద దీర్ఘంగా నిట్టూర్చింది. తనకు డబ్బిచ్చేటప్పుడు నాన్న "అతిజాగ్రత్తగా తీసుకు వెళ్లు" అని మరీమరీ చెప్పిపంపాడు. కాని తనుయిప్పుడు ఏం సమాధానం చెప్తుంది.... నాన్న ఏమంటాడో ముందే ఊహించుకుంది అబ్బా! తను వాటిని భరించలేదు ..! పదినిమిషాలు గడిచిపోయినై. రూపాయి దొరికేఆశ కనబడడంలేదు. మళ్లీ మరొక్కసారి తలెత్తిచూసిందిశారద. అందరూ తనవేపేచూస్తున్నారు... ఇంకక్కడ నిలబడడంకష్టం!

ఇంతలో ఓయువకుడు ఆదారమ్మటే పోతూ శారదకు ఓ పదడుగులదూరంలో నేలమీదకువంగి ఏదోతీశాడు. శారద ఆత్యాతురతతో అదేమిటాఅని చూచింది.

అదిగో! తన రూపాయి అతనికి దొరికింది! తనకి కనబడనిరూపాయి అతనికెలా కనబడిందో...!

ఆశ్చర్యపరిపూర్ణమైన శారద ముఖంకేసి చూశాడు. అతను. శారద అతనివేపు కళ్లప్పగించి చూస్తోంది "ఆరూపాయి నాదండీ అనబోయింది కాని ఏమాటా ఆమె పెదాలు దాటిరాలేకపోయింది! ఓక్షణం నిలబడిన తరువాత, మరుక్షణంలో అతను అక్కడనుండి నడచిపోయాడు, రూపాయి జేబులో వేసుకుంటూ ..! ★



సమయజ్ఞత

శ్రీనివాస కాశ్యప

భోజరాజు కాళిదాసు
బాగా స్నేహితు లిద్దరు
తన కొలువులో వుంటున్నా
తరతమ భేదములు లేవు,

కవులన్నా, కవితన్నా
కలదతనికి గౌరవమ్ము,
అందులోన కాళిదాసు
అంటే అతనికెక్కువ!

కాళిదాసు ఒకనిముసము
కనిపించకపోతేనే
పనిమాలా నౌకరులను
పంపించును వెతికి రాగ

ఇద్దరిస్నేహము బాగుగ
వృద్ధిచెందె దిన దినముకు,
కవితాగోష్ఠుల నిర్వురు
తనియుచుండు రెల్లప్పుడు!

ఒకనా డేకాంతముగా
సుఖాసీనులై ఇర్వురు
'అలసేరెడు పండ్లు' తినుచు
ఆనందించుచునుండిరి!

పండ్లన్నియు తినినపిదప
పరిహాసము చేయనెంచి
భోజరాజు తన 'గింజలు'
కాళిదాసుకడనుంచి,—

"అమ్మబాబో! ఎన్ని పండ్లు
ఆరగించినావయ్యో!"
అనుచు కాళిదాసువంక
ఆశ్చర్యముగా చూచెను!


కాళిదాసు అప్పటున
కలతయేమి చెందకుండ
"పండ్లన్నియు విత్తనాల్తో
ఫలహారం చేశారే?!"

అనివినరగ ఛెంగుకొక్కటి
అతని సమయజ్ఞతకూ
కాళిదాసు నా వెంటనె
కౌగలించె భోజరాజు!!

కథాగేయ సుధానిధి

(ఈసప్ కథలు)

ఆంధ్ర వారపత్రిక 18 5-55 సంచికనుండి "బాల సాహితి విభాగంలో ఈసప్ కథలకు తెలుగు గేయానువాదం సీరియల్‌గా ప్రకటింపబడుతుంది ఈసప్ కథలు జగత్ప్రసిద్ధములైనవి పంచతంత్రం కథలవలెనే ఇవి కూడా బాలబాలికలకు సులభశైలిలో నీతులు బోధిస్తాయి ఈ గేయాలను మా బాలబాలికా పాఠకులు చదివి ఆనందిస్తారని ఆశిస్తున్నాము



జరిగినకథ

ఫ్రాన్సుదేశంలో విప్లవం ఉధృతంగా ఉన్న రోజులు – చాలామంది ప్రభువంశీకులకు శిరచ్ఛేదం విధించబడింది. ఉన్నట్టుండి ఇలా శిక్షలు విధించబడినవారితో సహా, చాలామంది ప్రభువంశీకులు తప్పించుకు పారిపోవటం మొదలుపెట్టారు. కొంతమంది ఇంగ్లీషువారు సంఘంగా ఏర్పడి వారిని తప్పిస్తున్నారని వదంతులు బయలుదేరినాయి. వారి నాయకుడు ఎవరో ఎవరికీ తెలియదు. స్కార్లెట్ పింపర్నెల్ అనే మారుపేరుతో వ్యవహరిస్తుంటాడు. ఈ స్కార్లెట్ పింపర్నెల్ బృందం అనే ద్వార రక్షకుని కళ్లలో దుమ్ముకొట్టి, కౌంటెస్ డి టూర్నేను ఆమె పిల్లలు సుజేన్, వైకౌంటులను తప్పిస్తారు. వారు ఛానెల్ దాటి ఇంగ్లాండ్ చేరుకుంటారు. మార్గరెట్ అనే ఫ్రెంచియువతి, సర్ పెర్సీ అనే ఇంగ్లీషువానిని పెళ్లిచేసుకొని లండన్ వచ్చేస్తుంది. ఈమె కూడా పెళ్లికాకముందు ఒకసారి ఒక ప్రభువుకు మరణశిక్ష వేయిస్తుంది. ఇంగ్లాండులో ఉండగా ఆమెను ఎన్నడూ కలుసుకోవటం తటస్థించరాదని కౌంటెస్ కోరుకుంటుంది. కాని కౌంటెస్ ఇంగ్లాండు చేరిన కొద్దిగంటల్లోనే ఆమె ఉన్న హోటలుకే మార్గరెట్ వస్తుంది.

3

మార్గరెట్ బ్లాకెనికి మహా ఉంటే ఇరవైఅయిదేళ్లు ఉంటాయేమో! ఆమె ధరించిన నీలిరంగు వెల్వెట్ దుస్తులు ఆమె సహజసౌందర్యానికి మరింత వన్నె దిద్దుతున్నాయి. మార్గరెట్‌ను ఎంతగా అసహ్యించుకోవచ్చునో అంతగానూ అసహ్యించుకుంటున్న కౌంటెస్ సహితం, ఆమెనుచూసి ముగ్ధురాలై కదలలేక పోయింది.

మార్గరెట్ లోపలికి అడుగుపెట్టగానే అంతటా కరకాయించి చూసింది. లార్డ్ ఆంథోనినిచూచి మందహాసంచేసింది. "ఓ! లార్డ్ టోనీ ఇక్కడే ఉన్నారే! ఏమిటి సంగతి? అరె! సర్ ఆండ్రూ కూడా వచ్చారే! తమాషాగా ఉన్నది. డోవరులో ఏమిటో గిరాకీ తగిలి నట్లుంది!"

వారు బదులుచెప్పబోతున్నది వినే వ్యవధానం లేకుండా ఆమె మరోప్రక్కకు తిరిగింది. కౌంటెస్, సుజేన్ కనిపించారు. అనుకోకుండా హఠాత్తుగా వారు కనిపించటం వలన ఆశ్చర్యం, సంతోషం ముప్పిరిగొనగా, ఆమెముఖం వింతకాంతితో వెలిగిపోయింది. రెండుచేతులూ బారజాపి, విరవిర సుజేన్ వద్దకు పోయింది.

"సుజేన్! నువ్వెప్పుడు వచ్చావిక్కడికి? ఓహో! మీ అమ్మగారుకూడా వచ్చారే!"

లార్డ్ టోనీ, సర్ ఆండ్రూ ఏమి జరుగుతున్నదో కూడా తెలుసుకోలేని అచేతనస్థితిలో గుడ్లప్పగించి నిలబడ్డారు.

"సుజేన్! నువ్వావిడతో మాట్లాడటానికి వీలులేదు!" అని కఠినస్వరంతో కూతురికి ఆజ్ఞాపించింది కౌంటెస్. కావాలని పనిగట్టుకొని అక్కడ ఉన్న వారికందరికీ తెలిసేటట్లు కౌంటెస్ ఆమాటలు ఇంగ్లీషులోనే చెప్పింది. చెపుతూ హెచ్చరికగా కూతురు భుజంపై చెయ్యి వేసింది.

కౌంటెస్ ఆజ్ఞ వింటూనే జెల్లీబాంక్ నిర్ఘాంతపోయినాడు. మార్గరెట్ అంటే ఏమయినా సామాన్యురాలా? ప్రిన్సెస్ ఆఫ్ వేల్సుకు ముఖ్య స్నేహితురాలు.

ప్రిన్స్ ఆఫ్ వేల్సుమిత్రుడు, లండన్‌లోకెల్లా అత్యధిక ధనవంతుడు అయిన సర్ పెర్సీ బ్లాకెనీ సతీమణి. అటువంటి ఆమెను నలుగురిలో పట్టుకొని—అందులో, తన వంటి సామాన్య జనంముందు — అవమానించటమంటే ఎంతసాహసమైనపని? ఉరిమి, ఉరిమి, చివరకు తన నెత్తిమీద పిడుగు వచ్చి పడుతుందోనని జెల్లీ కంపించి పోయినాడు. కౌంటెస్, మార్గరెట్ ముఖాముఖి నిలబడివున్నారు. ఇందులో ఎవరు తక్కువతిన్నవారు? ఈ గడ్డుపరిస్థితినుండి ఎలా బయటపడాలో ఎవరికీ తోచటంలేదు.

సరిగా ఆ సమయానికి ద్వారందగ్గర బయటినుండి ఒక కంఠరవం వినిపించింది. అది సర్ పెర్సీ కంఠం. ఒక నిద్రమత్తుభాయి పరమబద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ మాటాడుతున్నట్లు ఉంటుంది సర్ పెర్సీ ఎప్పుడు మాట్లాడినా! లార్డ్ టోనీ, సర్ ఆండ్రూ ఆదుర్దాగా వాకిటికేసి చూశారు.

కౌంటెస్ నిబ్బరంగా, నిటారుగా, తొణకకుండా, బెణకకుండా, ఠీవిగా, అలాగే నిలబడింది. మార్గరెట్‌తో మాట్లాడవద్దని నిరోధిస్తూ కూతురు భుజంపై వేసినచెయ్యి అలాగేఉన్నది. మార్గరెట్ ముఖం ఒక్కక్షణంసేపుమాత్రమే వివర్ణమైంది. ఆ ఒక్కక్షణంలోనే అమితోద్రేకంతో ఆపాదమస్తకం కంపించి పోయింది. ఆమరుక్షణంలో మార్గరెట్ తేరుకొని, కౌంటెస్‌ను అపహాస్యం చేస్తున్నట్లు పెదవివిరుస్తూ, కనుబొమలు విచిత్రంగా ఎగురవేసింది. కౌంటెస్ వంక నిశ్చలంగా చూస్తూ "ఓయబ్బో!" అన్నది.

కౌంటెస్ ఊరుకోకుండా, కట్టెవిరిచి పొయ్యిలో పెడుతున్నట్లు "ఇదేమీ ఫ్రాన్సుకాదు. ఇంగ్లండు దేశం. నాకిష్టంలేనివారితో మాట్లాడవద్దని నాకూతురిని శాసించే అధికారం నాకున్నది." అని బదులుచెప్పింది.

ఈమాటలుఅని, కూతురిని తనవెంట బయలుదేరిరమ్మని సంజ్ఞచేస్తూ, కౌంటెస్ విశ్రాంతి గదులవైపుకు నడకసాగించింది. సుజేన్ తల్లి వెనువెంటనే బయలుదేరలేదు. అల్పాహారశాలలో గాలికూడా చలించటంలేదు. ఏ చిత్రకారుడో చిత్రించిన బొమ్మలా ఉన్నది. గట్టిగా ఊపిరికూడా తీయకుండా నిలబడిఉన్న అక్కడివారందరికీ, తన ఉడుపుల కుచ్చెళ్ళు జీరాడగా నడచిపోతున్న కౌంటెస్ అడుగుల సవ్వడి స్పష్టంగా వినవచ్చింది. ఆమెద్వారందాటి కనుమరుగై పోయేవరకు మార్గరెట్ ఆమెపైనే చూపులునిలిపింది.



పెర్సీ వైకౌంటెసువంక విచిత్రంగా ఏ కుక్కపిల్లనో పిల్లిపిల్లనో చూసినట్లు చూశాడు

తల్లి మాటకు ఎదురాడలేక అంతవరకు బొమ్మల్లే నిలబడిపోయిన సుజేన్ ఒక్కసారిగా ఎగిరి గంతేసి, మార్గరెట్ మెడ కౌగలించుకొని ముద్దాడింది. ఆతరవాతనే బెదురుచూపులతో తల్లిని కలుసుకోవటం కోసం లేడిపిల్లలా వెళ్ళిపోయింది.

అప్పటిదాకా నెత్తిపైన ఉన్నట్లు అనిపించిన మోయరాని మహాభారం దించినట్లయింది అందరికీ. అందరికి చైతన్యం వచ్చింది—ఈ ప్రపంచలోకి వచ్చారు.

"బాగుంది!" అన్నది హుషారుగా మార్గరెట్. "ఏం? సర్ ఆండ్రూ! ఇలాంటి మనిషిని మీరు ఎప్పుడయినాచూశారా— ఎక్కడయినా?" అంటూ, వాళ్ళకి అడ్డంపడుతున్న కుచ్చెళ్ళు ఒయ్యారంగా ఎత్తిపట్టుకొని నెగడు దగ్గరకుచేరింది. అక్కడనిలబడి, అందరివంకా చూస్తూ, కౌంటెస్‌ను అనుకరిస్తూ "సుజేన్! నువ్వా విడతో మాట్లాడటానికి వీలులేదు." అని వెక్కిరింతగా అన్నది. అక్కడ ఉన్నవారందరూ దీనికి పగలబడి నవ్వారు. ఆ హాస్యమయ వాతావరణంలో ఎవరూ

శ్రద్ధగా పరిశీలించలేదు గాని, మార్గరెట్ అనుకరణం అమోఘంగా ఉన్నది. కౌంటెస్ గొంతుకూడా బాగా కుదిరింది.

తల్లితోపాటు పోకుండా అక్కడనేఉన్న వైకౌంటుకు మాత్రం దీనితో వళ్లుమండింది. మార్గరెట్ వంక చురచురచూస్తూ ముందుకువచ్చాడు. అతనినోటినుండి ఇంకా మాటరాకముందే, తలుపుతెరిచిన చప్పుడయింది. ఒకరకం తమాషా పెట్టినవ్వు నవ్వుతూ, ఒక పొడుగాటివ్యక్తి లోపలికి ప్రవేశించాడు. ఆయన పెద్ద ఖరీదుగల దుస్తులువేసుకొనిఉన్నాడు. ఆ వచ్చినవాడు సర్ పెర్సీబ్లాకనీ.

పెర్సీకి ఒకటిరెండు అటూఇటుగా ముప్పైఏళ్ళ వయస్సుఉంటుంది. భారీమనిషి. బరువుగా వాలిపోతూ ఉండే కనురెప్పలను బద్ధకంగా అరతెరిచి ఉంచుతాడు, చూడగానే వట్టిసోమరిపోతు, బద్ధకస్తుడు, మందమతి అని చెప్పవచ్చు.

సర్ పెర్సీ తల్లికి పెండ్లిఅయిన రెండేళ్ళకే మతిపోయింది. తండ్రి దానితో క్రుంగిపోయినాడు. ఆమెకు మతిస్థిమితంలేని రోజులలోనే సర్ పెర్సీ జన్మించాడు. విచారంతో క్రుంగిపోతున్న తండ్రి ఈకుమారుడి చదువు సంధ్యల విషయ మేమీపట్టించుకోలేదు. పెర్సీకి మైనారిటీ వెళ్ళినకొత్తలోనే మాతాపితృ వియోగం కలిగింది అయితే పారంపర్యంగావస్తున్న ఆస్తిమాత్రం కావలసినంత ఉన్నది. పెర్సీ తల్లితండ్రి ఉత్సాహంగా ఉండి అనుభవించ లేనందున ఆ ఆస్తి అక్కరలేనంత అయింది. అదంతా పెర్సీహస్తగతమైంది.

బహుశా తల్లికి మతిస్థిమితంలేని రోజుల్లో పుట్టినందువలననో ఏమో పెర్సీ కొంత మందబుద్ధి అయినాడు. ఇటువంటివాడు సుమారు ఒకసంవత్సర కాలం క్రిందట లండన్ ప్రజానీకమంతా ఆశ్చర్యంతో మూర్ఛపోవలసినంతపని చేశాడు.

యూరపులో పర్యటించటానికి ఒంటరిగా పోయిన పెర్సీ తిరిగివస్తూ ఒకఫ్రెంచి యువతిని జంటగా కొట్టుకువచ్చాడు. ఆమె ఎటువంటిది ? అందమైనది- అత్యద్భుతమైన తెలివితేటలుగలది - చలాకిఅయినది. ఇక పెర్సీసంగతిచూస్తే వట్టి నిద్రమత్తుభాయి. మందకొడి.

మార్గరెట్‌ను ఆమెస్నేహితురాండ్రు అంతా "యూరప్‌లోకెల్లా తెలివైనది" అని ప్రశంసిస్తూ ఉంటారు. మార్గరెట్ అయినా ధనాన్నిగాని ,పదవినిగాని కాంక్షించేదికాదు, పెర్సీ అంతగా కాకపోయినా -ధనమూ పదవీ ఉన్నవారిని ఎంతమందినో కాదన్న మార్గరెట్ ఈ పెర్సీకెలా చిక్కిందో ఏమో!

సర్ పెర్సీబ్లాకనీ చాలా అందంగాఉంటాడు. సరికొత్త ఫాషన్‌లో ముచ్చటైన దుస్తుల్లో ప్రత్యక్షమౌతుంటాడు. సర్ పెర్సీ లోపలకురాగానే అరమూసిన కన్నులు బలవంతాన తెరుస్తూ అక్కడఉన్న వారందరినీ చూశాడు. "ఓహో! టోనీ! ఆండ్రూ! కులాసాయేనా?" అంటూ పలకరించి షేక్‌హేండ్ ఇచ్చాడు. "ఇలా ఎప్పుడైనా ఉన్నది ? వెధవది! ఒకటేవర్షం! ఒకటేచలి! థూ." అన్నాడు.

ఎవ్వరూ సంభాషణ అందుకోలేదు. ఒక నిమిషం ఆగి సర్ పెర్సీ ఇలా అన్నాడు. "ఏమిటోయ్ ఏం జరిగింది? వెధవది! ఒకళ్లూ మాట్లాడరేం? అంతా నిద్రమత్తుగా ఉన్నారు."

మార్గరెట్ ముందుకువచ్చి కొంచెంఎత్తి పొడుపుగా బదులుచెప్పింది. "మీఖుషీకిలోటు రావలసినంత ప్రమాదంఏమీ జరగలేదులెండి. కాకపోతే నేను కొద్దిగా చిన్నబుచ్చుకోవలసివచ్చిందిగాని"

పెర్సీ ఏమీ కంగారుపడకుండానే "అరెరె! నువ్వుచిన్నబుచ్చుకోవటం ఏమిటి? అంతధైర్యం ఎవరికి వచ్చిందబ్బా!" అన్నాడు. ఎవ్వరూ ఏమీ సమాధానం చెప్పకముందే వైకౌంటు దూకుడుగాముందుకు వచ్చాడు. వచ్చీరాని ఇంగ్లీషులో తంటాలుపడి పెర్సీతో చెప్పటం మొదలుపెట్టాడు.

"ఆమె మీభార్యకాబోలు! మాఅమ్మగారు కౌంటెస్ డి టూర్నే ఆమెను చిన్నబుచ్చింది! మా అమ్మగారు చేసినదానిలో పొరపాటు ఎంతమాత్రం లేదు. అందువల్ల మీగౌరవానికి భంగంకలిగితే చెప్పండి. మన మామూలు ఉండనేఉన్నది."

ఈమాటలు అనేసి వైకౌంటు యుద్ధవీరుడిలాగా బిగుసుకొని నిలబడి, పెర్సీవంకచూశాడు. ఆరడుగుల పైనఉన్న పెర్సీ తనముందు బొమ్మలాగఉన్న ఈకుఱ్ఱ వైకౌంటువైపు వింతగా చూశాడు.

"సరేగాని, భేషుగాఉంది. ఈ ఇంగ్లీషు ఎక్కడ నేర్చుకున్నావు? ముందుచెప్పు!" అన్నాడు పెర్సీ.

వైకౌంట్ ముఖం గంటుపెట్టుకొని "ఏమండోయ్!" అని ఉరిమాడు.

"అబ్బే! నేనేమీ తమాషాగా అనటంలేదు. భేషుగాఉంది. భలే భేషుగాఉన్నది తెలుసా? కాదు టోనీ? వెధవది! నన్నుగనక ఫ్రెంచిభాష మాట్లాడమంటే ఇప్పుడు ఈమాత్రంగాకూడా మాట్లాడలేనన్నమాట."

"నేనుచెప్పేదిమీరు వినిపించుకోవటంలేదు. నా ఉద్దేశ్యం మీరు గ్రహించనట్లుంది! అభిప్రాయభేదం కలిగినప్పుడు మనవంటివారి మర్యాదకుతగినది..."

"ఏమిటంటావు?"

"ఇదుగో! నాఖడ్గంతీస్తున్నాను."

"ఉండవయ్యా! తీయబోకు. నీకత్తి నాకెందుకు మధ్య?"

వైకౌంటుకు కోపం ఉవ్వెత్తుగావస్తున్నది. కాని ఏంచెయ్యాలి? తనఉద్దేశ్యం ఆ పెద్దమనిషికి చెప్పటమెల్లా?

"మీరు ఇప్పుడు నాతో ద్వంద్వయుద్ధం చెయ్యాండివచ్చి." అన్నాడు.

పెర్సీ వైకౌంటువంక విచిత్రంగా ఏకుక్కపిల్లనో పిల్లిపిల్లనో చూసినట్లు చూశాడు. ఫక్కుమని పెట్టినవ్వునవ్వాడు. చేతులు జేబుల్లోపెట్టుకొని నిశ్చింతగా సరదాగా అన్నాడు.

"ఓహో! దానిసంగతానువ్వు చెపుతున్నది. వెధవది! మరి ముందే చెప్పావుకాదేం తిన్నగా? ఇంత బతుకుబతికి ద్వంద్వయుద్ధం చెయ్యాలంటావు. చస్తే చేసేదిలేదు. నాకు అలవాటులేదు వెధవది! నెత్తురుతో మనకేంపని?"

వెనక్కివెళ్ళి సర్ పెర్సీ ఒకకుర్చీలో కూర్చున్నాడు. కాళ్లుబారజాపి, చేతులుజాడించి, తాపీగా వళ్లువిరుచుకుంటూ "వెధవది! ఈ కత్తియుద్ధాలంత ఛండాలపుపని మరొకటిలేదు కదూ! ఏమంటావు? టోనీ! " అన్నాడు.

మార్గరెట్ నవ్వుకుంటూ టోనీతోఅన్నది. "ఇంత వరకు భూమిమీదపుట్టిన మహాయోగులందరికి కోపం వచ్చి గంతులేసినా, సర్ పెర్సీ మాత్రంతాను తొందర పడరు. అంతేకాదుటోనీ?"

అందరూ సరదాగా నవ్వుకొన్నారు. పెర్సీ వైకౌంటునిపిలిచి చెప్పాడు! "విన్నావుగా! మాఆవిడ మాటలు - ఆమె మీ ఫ్రెంచిదేనోయ్! కరెక్టుగా చెప్పింది. అంతెందుకు? ఇంగ్లాండులోనే ఉంటావుగా! చూస్తూఉండు. నీకేతెలుస్తుంది."

"ద్వంద్వయుద్ధం చెయ్యటం అవసరంకాదని మీకుతోస్తే మానెయ్యండి. నేనూమానేస్తాను." అన్నాడు వైకౌంట్.

"అదీమాట! వెంటనే మానెయ్! ఆండ్రూ! నువ్వుమంచిపని చేస్తున్నావయ్యా! మొత్తానికి నివు భలేవాళ్ళను తీసుకొస్తున్నావులే ఛానెల్ దాటించి! పెద్దవాడినిచెపుతున్నాను - అంతా ఇటువంటిరకమే అయితే మనకు అక్కర్లేదు. నడిఛానెల్ లో దింపిరా!" అన్నాడు సర్ ర్సీ.

మార్గరెట్ చిలిపిగా నవ్వుతూ "మీమాటలు మీరు మరిచిపోయి, పాపం సర్ ఆండ్రూనూ ఆక్షేపిస్తున్నారు. ఆయన ఒక్కరేకాదుగా మనుష్యులని ఛానెల్ దాటిస్తున్నది!" అన్నది.

"అయితేమాత్రం! నేను ఎప్పుడూ రకంచూడకుండా తొందరపడను తెలుసా?"

"అవునవును పడరులెండి! ఇప్పుడు కనిపించిందిగా!"

పెర్సీఒకసారి దీక్షగా వైకౌంట్ వంకచూసి, మార్గరెట్ తోఅన్నాడు. "ఏమిటినువ్వనేది? వెధవది! ఇంతబతుకుబతికి—ప్రతివాడి తుప్పుకత్తికి ఎదురు నిలబడాలా?" ఒకనిమిషం మెదలకుండా కూర్చొని, మార్గరెట్ ఏమీ మాట్లాడకపోవటంచూసి, మళ్ళీ మొదలుపెట్టాడు. "ఏమిటి! ఇంకానీకు అనుమానమే! భయంఅనేది మనకు ఏకోశానలేదు. ఇంతబతుకుబతికి! నీకుతెలియదు. ఒకసారి నేనుశామ్‌తోకుస్తీపట్టానూ?"


ఈమాటలంటూ పెర్సీపెట్టిన ముఖమూ - ఆపోజూచూసి మార్గరెట్ విరగబడినవ్వింది. "అహ్హహ్హ...! ఇహ్హిహ్హి..! ఉహ్హుహ్హు...!" ఎన్నిరకాల నవ్వవచ్చునో అన్నిరకాల నవ్వింది. సర్ పెర్సీకూడా నవ్వాడు.

"చూశావుటోయ్ టోనీ! అంతాఏమిటేమిటో అంటుంటారు గాని ... చూడు! ఎలానవ్వించానో యూరపులోకెల్లా తెలివైనదాన్ని? టట్! ఈవాళ మాఆవిడని ఇలా నవ్వించగలిగినందుకయినా మీకందరికీ పార్టీఇవ్వాలిసిందే. జెల్లీ! ఏయ్ జెల్లీ! రానీ! వరసనే!"

★ స్కార్లెట్ పింపర్నల్ ★

"నేను తొందరగా వెళ్ళాలి సర్ పెర్సీ! డ్రెస్ వస్తా" అన్నది మార్గరెట్. "ముఖ్యమైన పనిని నీవు సిద్ధంగా ఉన్నది. మాతమ్ముడు బయలుదేరవలసిన వేళ లేకుండానా? సరే పోయిరా" అన్నాడు పెర్సీ. అయింది. ఆలస్యం అయితే మళ్లీ ఇవాల్టికి ప్రయాణం మార్గరెట్ అందరి అనుజ్ఞ తీసుకొని బయలు పడదు. ఏమీ అనుకోకండి. టోనీ! ఆండ్రూ! దేరింది.

(ఇంకా ఉంది)



అల్లరి పిల్లలు

3. మాటతప్పిన మల్లు

"ఓరేయి! పుస్తకాలన్నీ గదినిండా అలా చిందర వందరగా పడేశావేమిరా? కాస్త శుభ్రంగా సర్దుకుందూ!" అంటుంది అమ్మ. "ఇదుగో అమ్మా! నిమిషంలో సర్దేస్తున్నాగాని, కాసిని కాఫీ ఇవ్వవూ?" అంటాడు మల్లు. "పోనీ లేకదా చిన్న వెధవ అడిగాడు" అని అమ్మ కాఫీ ఇస్తుంది. అంతే మళ్లీ భోజనాల వేళదాకా కనిపించడు మల్లు. ఏవేళకైనా తిరిగి చేసుకొని, విసుక్కుంటూనో, కసురుకుంటూనో అమ్మ వచ్చి పుస్తకాలన్నీ బొత్తులు పెట్టి సర్దవలసిందే.

పని ఒత్తిడిలో ఉండి అమ్మ ఏదయినా పని సహాయం చెయ్యమంటుం దనుకోండి. చేసేవాడిలాగానే మాటఇస్తాడు కాని పని జరగటం మాత్రంపట్టదే. వీడిపద్ధతి చూసి అమ్మకొంచం దిగులు పడింది. ఎందుకు? చిన్నప్పుడు అలవాటయిన ఈలక్షణము పెద్దయితే మాత్రం పోతుందా? అప్పుడు నలుగురూ "ఫలాని మల్లయ్య మాట నమ్మటానికి వీలులేదండి. ఆయన పట్టి మాట నిలకడ లేనివాడు." అంటారు. మల్లు చిన్నపిల్లవాడు. ముందుముందు ఇలాంటి అలవాట్ల వలన ఎటువంటి కష్టనష్టాలు వస్తాయో ఎలా తెలుసుకోగలడు?

ఇలా ఉండగా ఒకనాడు మల్లు వాళ్ల మామయ్య తమఊరునుంచి వచ్చాడు. ఆయన పేరు భద్రం. అమ్మ భద్రంమామయ్యతో మల్లు సంగతి అంతా చెప్పింది. భద్రం మామయ్య అన్నాడు "మరేంఫరవాలేదు. నాలుగు రోజులపాటు వాణ్ణి మా యింటికి పంపించు. తక్కినదంతా నేనుచూస్తాను" అని. అమ్మ "సరే" అన్నది.

ఆనాడు మల్లు ఇంటికి రాగానే మామయ్య "ఏమిరా? మా ఊరు వెళ్దాం వస్తావా నాతో?" అని అడిగాడు. ఎగిరిగంతేసి "ఓ" అన్నాడు మల్లు.

మామయ్యగారింటికి వెళ్ళినతరువాత ఏమేమి చెయ్యాలో, ఆ నాలుగురోజులు ఎలా హాయిగా గడపవచ్చునో, మల్లు ఆలోచనలు చేశాడు. ఇంటిదగ్గరకంటె చుట్టాలింట్లో అయితే బాగా స్వేచ్ఛగా ఉండవచ్చు అని మల్లుడి ఉద్దేశ్యం.

ఇంటికి చేరుకోగానే మామయ్య "ఓరేయి మల్లూ! స్నానంచేసి, అన్నంతిని పడుకో! రాత్రికి సర్కసుకువెళ్దాం" అని చెప్పాడు. "అలాగే మామయ్యా" అన్నాడుమల్లు. కాని తరువాత బద్ధకంవేసింది. "అబ్బ! ఇప్పుడు స్నానం చేసేదేమిటిలెద్దూ? కాళ్లు చేతులు కడుక్కుంటే చాలులే" అనుకున్నాడు. అత్తయ్య "స్నానం చెయ్యలేదేమిరా!" అని అడిగితే "ఫరవాలేదులే అత్తయ్యా! అన్నం పెట్టు" అన్నాడు. అన్నం తిని పడుకోకుండా ఎండలో ఆడుకోటానికిపోయినాడు. మామయ్య ఇదంతా చూస్తూనే ఉన్నాడు. సాయంత్రంపూట మామయ్య ఎక్కడికో వెళ్లిపోయినాడు.

మల్లు సర్కసుకు వెళ్లేవేళకు తయారై కూర్చున్నాడు. కాని మామయ్య ఎంతసేపటికీ రాలేదు. మల్లుకు కోపం, ఏడుపూ రెండూ వచ్చినాయి. కొండలకడనే నిద్రపోయినాడు. మామయ్య ఆ తరువాతగాని ఇంటికిరాలేదు.

మరునాడు మామయ్యని చూడగానే మల్లు "ఏంమామయ్యా! రాత్రి నన్ను సర్కసుకు తీసుకువెళ్తానని చెప్పి తీసుకుపోలేదేం?" అని అడిగాడు. "అవునురా! తీసుకువెళ్లలేదు. ఇవ్వాళ వెళ్దాంలే." అన్నాడుకాని ఆనాడూ తీసుకుపోలేదు. మల్లుకి ఇకకోపంఆగలేదు.

★ అల్లరి పిల్లలు ★

"ఎందుకు మామయ్యా రోజూ నేను తీసుకుపోతానని మాట ఇవ్వటం ఎగ గొట్టటమూను?" అన్నాడు కోపంగా.

భద్రం మామయ్య మెల్లిగా అడిగాడు. "స్నానం, భోజనం చేసి వస్తూ ఉంటానని నాకు ఇచ్చిన మాట ఇచ్చావే - నీవు చేశావా ఏమిటి?" మల్లు తలవంచుకుని "నేను చిన్న వాడిని. పెద్దవాడివి నీవూ నేనూ ఒకటేనా?" అన్నాడు. మామయ్య నవ్వాడు. "అది కాదురా! చిన్నవాడు నేను నీ అంతఉండగా, నీకు మల్లే నేను మాట ఇచ్చేవాడినే గాని ఎప్పుడూ చేసే వాడిని కాదు. అదే అలవాటయి పోయింది." అన్నాడు. ఇంకేం మాట్లాడతాడు మల్లు?

కొంచెంఆగి మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు మామయ్య. "ఏదయినా ఒకమాట చెప్పి, ఆ ప్రకారం చెయ్యకపోతే ఎదుటివాడికి ఎంతకష్టం కలుగుతుందో, మనస్సు ఎంత నొచ్చుకుంటుందో ఇప్పుడు అర్థమైందా? ఒక్కనాటికే నువ్వు ఇట్లా కోపం తెచ్చుకున్నావే, అమ్మ నీతో ఎంత విసిగిపోతూ ఉండాలి? ఆలోచించు."

మల్లుకు బాగా తెలిసివచ్చింది ఇంకమీదట ఎప్పుడూ అలా ఉండకూడదనుకున్నాడు. "ఇకనెప్పుడూ అలా చెయ్యను మామయ్యా" అని చెప్దామనుకున్నాడు కాని చెప్పటానికి సిగ్గువేసింది. అత్తయ్య మెల్లిగా నవ్వుతూ "ఊరుకోండి. మల్లు చాలా మంచివాడు. ఎప్పుడూ మాటతప్పడు. కావాలంటే ఈసారి చూడండి." అన్నది.

ఆనాటినుంచి మల్లు ఎప్పుడూ చేస్తానన్న పని చెయ్యకుండా మానెయ్యలేదు. మామయ్య ఆ నాటిరాత్రి మల్లుని సర్కసుకు తీసుకొనివెళ్లాడు.

తరవాత నాలుగురోజులకి మల్లు మళ్లీ ఇంటికివచ్చేశాడు మునుపటి లాగా కాకుండా మల్లు చెప్పిన మాట ప్రకారం చేస్తూఉండటం చూచి అమ్మ ఆశ్చర్యపోయింది. మామయ్యగారి ఊళ్లో ఏం జరిగిందో మల్లు అమ్మకి చెప్పలేదు. చెప్పటానికి సిగ్గువేసింది. ఏమయితేనేం తను కావాలనుకున్నది జరిగిందిగనుక అమ్మ సంతోషపడింది.

★

—ముపి.

"అమ్మమ్మా! నువ్వెందుకు మడి గట్టుకుంటావో నాకు తెలుసులే!"

"ఎందుకురా!"

"నువ్వు చేసే అప్పచ్చులు నేను ఎగబడి లాక్కుపోకుండా ఉండటానికి. అంతేగా"

—పొత్తూరి లక్ష్మీనారాయణ, నెల్లూరు

గడియారం గంటలు

సాయంకాలం ఆరైంది. గడియారం ఆరుగంటలు కొట్టున్నది. ఇందిర, చందర్ గడియారం వంక చూస్తూ నిలబడ్డారు. ఆరుగంటలు కొట్టేటందుకు సరిగ్గా ముప్పై సెకండ్లు పట్టేంది. అది చూసి ఇందిర తమ్ముడిని అడిగింది "ఆరుగంటలు కొట్టటానికి ముప్పై సెకండ్లు పట్టిందికదా! 12 గంటలు కొట్టటానికి ఎన్ని సెకండ్లు పడుతుంది?" అని.

చందర్ "ఓస్! ఈమాత్రం చెప్పలేనా ఏమిటి? ఆరుగంటలకు ముప్పై సెకండ్లయితే, రెండార్లు పన్నెండుగంటలకు రెండుముప్పైలు అరవైసెకండ్లు పడుతుంది." అన్నాడు

ఇందిర నవ్వుతూ తలకాయ అడ్డంగాతిప్పింది "కాదు, తప్పులో కాలువేశావు" అన్నది. నిజమేనా? చందర్ చెప్పిందితప్పేనా? ఎలా?

"నేను వారంరోజులు టైమిచ్చాను కనుక్కోచూద్దాం!" అన్నది ఇందిర. పాపం! చందర్ కనుక్కోగలడో లేదో? పోనీ, మీకెవరికైనా తెలిసిందా? లేకపోతే వారంఅయిన తరవాత ఇందిరే చెప్తుందిగా!

వేణూ - కృష్ణా ఊరి ప్రయాణం

"ఏమోయి? వేణూ! మధ్యదారిలో నీ సైకిల్ ఛెయిన్ తెగిపోయిందట కదూ!"

"అవునండీ"

"మీ యిద్దరూ నేమో ఒకేసారిగా ఆ ఊరు చేరుకోవాలనుకున్నారుగా? ఏంచేశారేమిటి?"

"ఛెయిన్ తెగినప్పటికి, మేము ఇంకా పదహారు మైళ్లు పోవలసి ఉందికదూ? ముందు కృష్ణా నాసైకిల్ మీద బయలుదేరి పోయినాడు"

"ఏం కృష్ణా వాడాగాడిని విడిచిపెట్టి నీవు సైకిల్ మీద వెళ్లావా? అలా అయితే ఏంలాభం? నీవు ముందు చేరుతావుగా!"

"నేను ఆఊరిదాకా సైకిల్ మీద పోలేదు. ఒక గంటసేపు సైకిల్ తొక్కాను అంటే 8 మైళ్లు వెళ్లానన్నమాట అక్కడినుంచి ఇంకా 8 మైళ్లు పోవాలి కదూ? సైకిల్ అక్కడ విడిచిపెట్టి, ఆదూరం నడిచేశాను 2 గంటలుపట్టింది అంటే నేను వేణునువిడిచిపెట్టి 3 గంటలయింది"

"ఈలోగా వేణు ఏంచేశాడో తెలుసునా? ఆ ఎనిమిది మైళ్లు రెండుగంటలసేపు నడిచి, కృష్ణ సైకిల్ విడిచిపెట్టిపోయి ఉన్నాను ఆ సైకిల్ ఎక్కి ఎనిమిదిమైళ్లు ఒకగంటలో వెళ్లాను అంటే మూడు గంటలసేపట్లో ఆఊరుచేరాను సరిగ్గా ఇద్దరమూ ఒక్కసారే ఆఊరుచేరాము"

"బాగుంది మీ ఉపాయం! ఆ సైకిల్ మధ్యదారిలో విడిచిపెట్టిపోయినారే ఎవరైనా ఎత్తుకుపోతేనో?"

"ఎత్తుకుపోలేదుగా!"

విక్రమసింహుడు

జి. సత్యనారాయణ

అవంతి రాజ్యాన్ని శూరసేనుడనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయనకు రవివర్మ అనే కుమారుడు, రాజ్యశ్రీ అనే కుమార్తె ఉండేవారు. రవివర్మ చాలా దుర్మార్గుడు. అధిక గర్వంతో నిరుపేదలు నిస్సహాయులు అయిన ప్రజలను బాధించేవాడు.

ఒకరోజున రవివర్మ తనవంటివారే అయిన కొందరు స్నేహితులను వెంటబెట్టుకొని, రాజ్యంలో తిరగటానికి పోయినాడు. దారిలో ఒక గ్రామంలో ముదుసలి అయిన ఒకజాలరి రంగురంగులచేప నొకదానిని విక్రయానికి తీసుకురావటం చూశాడు. రవివర్మ దానిని చాలా తక్కువ వెలకు ఇమ్మని అడిగాడు. జాలరి నిరాకరించాడు. దుష్టుడైన రవివర్మ దురాగ్రహంతో వానిమీద పడి, ఆచేపను లాగుకొని దారుణంగా చావగొట్టాడు.

అలా కొట్టుతుండగా, అక్కడికి ఒక సైనికాధికారి కుమారుడు విక్రమసింహుడనేవాడు వచ్చాడు. అతడా జాలరికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి సహించలేక రవివర్మను మందలించాడు. రవివర్మ జాలరిని వదలి విక్రమసింహునిపైకి వచ్చాడు. ఇద్దరికీ ద్వంద్వయుద్ధం జరిగింది. రవివర్మ ఆ యుద్ధంలో ప్రమాదకరంగా గాయపడ్డాడు. విక్రమసింహుని సింహవిక్రమం చూచి రవివర్మ స్నేహితులు పారిపోయినారు.

గాయపడిన రాకుమారుని ఎలాగో రాజభవనానికి చేర్చారు. రవివర్మ కోలుకోలేదు. ఆ మరునాడు మరణించాడు. రాజ్యశ్రీ అన్న మరణానికి ఎంతో దుఃఖించింది. రాజు శూరసేనుడు కుమారుని మృతికి సంతాపపడి, విక్రముని బంధించమని ఉత్తరువు చేశాడు.

రవివర్మచేత హింసించబడిన జాలరికూడా ఆ మరునాడు మరణించాడు.

విక్రముడు రాజభటులకు చిక్కకుండా తప్పించుకొని పోయి మారువేషములో అరణ్యాలలో సంచరిం



"ఎవరైతే మీ అన్నను చంపాడో ఆ విక్రముణ్ణి నేనే..."



"అనార్కలీ" లో అంజలీదేవి.

"అనార్కలి"

భారతదేశమంతటా రసికహృదయాలను ఉర్రూతలూగించిన అనార్కలి ప్రేమగాథ ఈనాటికి తెలుగు తెరపైకెక్కింది. లైలా మజ్నూ, రోమియో ఎండ్ జూలియట్ మొదలైన అనేక విషాదాంత ప్రేమకథలలో ఇదొకటి. అనేకులు కవులను, గాయకులను, చిత్రకారులను ఆకర్షించినట్లే ఈ ఇతివృత్తం చిత్రనిర్మాతలనుకూడా ఆకర్షించడంలో ఆశ్చర్యంలేదు. హిందీలో రెండుసార్లు సినిమా తీయబడింది. తెలుగులో కూడా అంజలీపిక్చర్సువారు ఈ చిత్రం తీయడం ముదావహం.

దేవదాసు చిత్రాన్ని డైరెక్టుచేసిన వేదాంతం రాఘవయ్యగారే ఈ చిత్రాన్ని డైరెక్టుచేశారు. దేవదాసుగా నటించి ప్రజల మన్ననలుపొందిన ప్రసిద్ధనటుడు ఎ. నాగే



"అనార్కలీ"లో అజీజ్‌గా పేకేటి, గుల్నార్‌గా బాలసరస్వతి, అనార్కలిగా అంజలీదేవి, సలీంగా నాగేశ్వరరావు.

★ "అనార్కలి" ★

శ్వరరావ్ సలీంగా నటించాడు. అంజలీదేవి అనార్కలీ, ఎస్. వి రంగారావు అక్బర్, కన్నాంబ జోధ్‌బాయి, నాగయ్య రాజా మాన్‌సింగ్ పాత్రలు ధరించారు సురభి బాలసరస్వతి, పేకేటి శివరాం, డా॥ వి సి కామరాజు, హేమలత మున్నగువారు తదితరపాత్రలు ధరించారు సంగీతదర్శకుడు ఆదినారాయణరావు, రచయిత సముద్రాల, ఫోటోగ్రాఫర్ కమల్‌ఘోష్, ఆర్ట్ డైరెక్టరు శేఖర్.

చాలావ్యయప్రయాసలకోర్చి యీచిత్రం నిర్మించబడింది. కళ్లు చెదిరించే బ్రహ్మాండమైన సెట్సు ఈ చిత్రంలో ప్రత్యేకాకర్షణగా కనిపిస్తాయి మొగల్ దర్బారులవైభవం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఈ సెట్సును చిత్రమంతటా చక్కగా వినియోగించుకున్నారు.

అనార్కలీగా అంజలీదేవి తన నటనాచాకచక్యం అంతా ప్రదర్శించింది అనేక దృశ్యాలలో ఆమె నటన ప్రశంసనీయంగా వున్నది నాగేశ్వరరావు, రంగారావు, నాగయ్య, కన్నాంబ బాగానే నటించారు చిత్రం ప్రారంభంలో కంటే అంతంలో బాగా రక్తి కట్టింది.

ఈ చిత్రం గత బుధవారం ఉదయం పారగన్ టాకీస్‌లో పత్రికలవారికి, చిత్రనిర్మాతలకు, ఇతర అతిథులకు చూపించబడింది.

* * *

అనార్కలీ కథలో సాధారణంగా ఒక సందేహం వస్తుంది. అక్బర్ పాదుషా చాలా దయామయుడనీ, ఉదాత్త హృదయుడనీ, కేవలం రాజధర్మాన్ని పాటించి సలీం, అనార్కలీలకు శిక్ష విధించాడనీ ప్రతివారూ చెబుతారు మిగతా మొగల్ పాదుషాలతో పోలిస్తే అక్బర్ దయామయుడు కావచ్చునుగాని, మామూలు మానవత్వం దృష్ట్యా కేవలం రాక్షసత్వం మూర్తీభవించిన వాడులా కనిపిస్తాడు. అనార్కలీకి శిక్ష విధించడం రాజధర్మానుగుణం అనుకున్నప్పటికీ, ఆమెను సజీవంగా గోరీకట్టడంలో అవసరంలేని క్రౌర్యం, రాక్షసత్వం కనిపిస్తుంది. అటువంటివాణ్ణి ఊహించుకోవడమే కష్టం. అతన్ని పితృసహజమైన ప్రేమ, ఇంకా ఎన్నో మంచిగుణాలు కలవాడుగా చిత్రించడానికి ఇంతమంది ఎందుకు ప్రయత్నిస్తారా అని ఆశ్చర్యం కలుగుతుంది ఈ దృష్టితో అతని పాత్రను ఎవరూ చిత్రించ రెందువల్లనో? ★

బొంబాయి నిర్మాతలలో చీలికలు:

ఐ ఎమ్ పి పి ఎ. (భారతీయ చలన చిత్ర నిర్మాతల సంఘం) లో ఐకమత్యం సాధించాలని ఎస్ కె పాటిల్ గారు చేసినప్రయత్నాలు విఫలమై, ఆసంఘంనుండి తొమ్మిదిమంది పెద్దస్టూడియో యజమానులు విడిపోయి ఫిలిం ప్రొడ్యూసర్సు గిల్డ్ స్థాపించుకున్నారు. ఎస్. కె పాటిల్ గారిప్పుడు ఐ ఎమ్ పి పి. ఎ. లో గౌరవసభ్యులు; ఈయేడాది బహుశా దానికి అధ్యక్షులుగా ఎన్నుకోబడవచ్చును. గిల్డ్ సభ్యులను తిరిగి వచ్చి చేరవలసిందని ఆయన ఆహ్వానించారు గాని వారు ఆహ్వానాన్ని తిరస్కరించారు గిల్డ్‌సభ్యులకు వి శాంతారాం నాయకుడు

ఈలోగా జైమనిదివాన్ (ఐ. ఎమ్ పి పి. ఎ. మాజీ అధ్యక్షుడు), సర్దార్ అహ్లువాలియాల నాయకత్వాన మరికొందరు నిర్మాతలు వేరుపడిపోయి వేరే సంఘం స్థాపించుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈవిధంగా నిర్మాతలలో ఐకమత్యం పూర్తిగా చెడిపోయింది ఇప్పుడు బొంబాయిలో మూడువర్గాలున్నాయి: (1) ఐ ఎమ్. పి పి ఎ (2) గిల్డ్ (3) ఈ రెంటిలోనూ చేరని మిగతావారివర్గం.

ఈ మూడువర్గాలు విడివిడిగావుండి చేయబోయేదేమిటనిప్రశ్న. గిల్డ్ ఏర్పడి ఏడాదిన్నర అయినప్పటికి ఇంతవరకూ అది సాధించినది విసమెత్తులేదు. జైమనిదివాన్ మున్నగువారు పరిశ్రమకు సంబంధించినంతవరకూ మంచి ఏమీ సాధించలేకపోయారు. ఐ ఎమ్. పి. పి. ఎ నుండి వారు విడిపోవడంవల్ల వారికే హాని జరుగుతుంది.

ఫిలిం విచారణసంఘపు మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు అయిన ఎస్ కె. పాటిల్ గారి నాయకత్వాన ఐ ఎమ్ పి. పి. ఎ ఐకమత్యంతో ముందుకు సాగిపోతుందని పరిశ్రమకు సహాయకారి అవుతుందని ఆశించవచ్చును.



పి. ఎన్. అరోరా తీసిన "బహార్-ఇ-ఆరబ్" లో చిత్రా, సజ్జన్.

ఫిలింతారల ప్రదర్శనవైఫల్యం

ఇండియన్ ప్రోగ్రెసివ్ సర్కిల్ వారు ఇటీవల బొంబాయి, నాజ్ థియేటరులో ఏదో సహాయనిధి సేకరణ కోసం ఒక ప్రదర్శన ఏర్పాటుచేశారు అందులో పలువురు తారలు, ప్లేబాక్ గాయకులు పాల్గొంటారని ప్రకటించబడింది కాని ఆఖరినిమిషంలో చాలమంది రాలేదు. ప్రదర్శనం భంగమైంది.

కార్యక్రమం ప్రకారం ఆశాముఖర్జీ, మాలాసిన్హా, గీతారాయ్, తలత్ మహ

మూద్, రఫీ, కుమారి ఎస్. జయం, బేబీ తబసుమ్, అన్వర్ హుసేన్, శైరాజ్, మారుతి, నదిరా, జానీవాకర్, భగవాన్, లీలాగుప్తే పాల్గొనవలసి వున్నది. కాని బేబీ తబసుమ్, కుమారి ఎస్. జయంమాత్రమే హాజరయ్యారు. అన్వర్ హుసేన్, మారుతి కూడా వచ్చారుగాని, వారు ప్రదర్శించ వలసిన హాస్యనాటికలోని ఇతర పాత్రధారులైన శైరాజ్, నదిరా హాజరుకానందున ఊరికే కూర్చుండిపోయారు.

ఈ ప్రదర్శనకు పబ్లిసిటీ బాగా జరిగింది. టిక్కెట్లు ప్రత్యేకపు రేట్లకు అమ్మబడినవి. బొంబాయిగవర్నరు హరేకృష్ణ మహతాబ్ అధ్యక్షత వహించవలసి వుంది. కాని ఆయన కూడా రానందున ఎస్. కె. పాటిల్ అధ్యక్షత వహించారు.

బేబీ తబసుమ్ నృత్యం తరవాత ఎస్. కె. పాటిల్ కొంచెంసేపు మాట్లాడి మరొక కార్యక్రమానికి హాజరయేందుకు వెళ్లిపోయారు. కుమారి ఎస్. జయం భరతనాట్య ప్రదర్శనం చేసింది. ఆ తరవాత అన్వర్ హుసేన్ వేదిక ఎక్కి తన తోటి పాత్రధారులు రానందున నాటిక ప్రదర్శించలేక పోతున్నానని ప్రకటించాడు. ప్రేక్షకులు అలజడిచేయసాగారు. తమ డబ్బు వాపస్ ఇవ్వవలసిందని ఒత్తిడిచేయసాగారు.

ఈలోగా థియేటరు యజమానులు పోలీసులను పిలుచుకువచ్చారు. పోలీసులు శాంతి నెలకొల్పారు. డబ్బు వాపసు చేస్తామని నిర్వాహకుల వాగ్దానం చేశాక ప్రేక్షకులు శాంతంగా వెళ్లిపోయారు.

ప్రదర్శన నిర్వాహకులు టిక్కెట్ల డబ్బు వాపసు చేశారు. తారలు ప్రదర్శనలో టైముకి వచ్చి పాల్గొంటామని వాగ్దానం చేశారని, ఇలా మోసం చేస్తారని తలచలేదనీ నిర్వాహకులు చెబుతున్నారు.



“జషాన్” హిందీ చిత్రంలో వైజయంతీమాల.

సైగల్ జీవిత చిత్రం

న్యూ థియేటర్స్ అధినేత బి. ఎన్. సర్కార్ ఇటీవల బొంబాయి వచ్చారు. కలకత్తాలో ఒక హిందీచిత్రం తీయబోతున్నానని, దానికి బొంబాయి తారలను బుక్ చేయడానికి వచ్చాననీ ఆయన చెప్పారు.

ఇదివరలో బొంబాయిలో తీద్దామను కున్న సైగల్ జీవిత చిత్రాన్ని ఇప్పుడు కలకత్తాలో తీద్దామనుకుంటున్నానని కూడా ఆయన చెప్పారు. సైగల్ పాత్ర ఒక కన్నడ నటుడు ధరిస్తాడట. ఈ చిత్రంలో ఎక్కువ పని డైరెక్టరుదీ, ఎడిటరుదీ నట. సైగల్ నటించిన కొన్ని ముఖ్యమైన చిత్రాల్లోని భాగాలు ఈ చిత్రంలో చొప్పించబడతాయట. బినయ ఛటర్జీ ఈ చిత్రానికై స్క్రిప్టు రచించడం పూర్తిచేశాడట.

బొంబాయిలో ద్విభాషా చిత్రాలను (హిందీ, బెంగాలీ) తీయబోతున్నారా అని అడగగా బి. ఎన్. సర్కార్ లేదని సమాధానమిచ్చారు.

సైగల్ స్మారకసంఘం

బొంబాయి గవర్నరు హరేకృష్ణ మహతాబ్ అధ్యక్షతను కొందరు ఫిలిం ప్రముఖులు, పౌరప్రముఖులు బొంబాయి రాజ్ భవన్‌లో గత మాసం 16 వ సమావేశమై సైగల్ స్మారక సంఘాన్ని ఏర్పరచారు.

కె. ఎల్. సైగల్ పేరుమీద ఒక ఆరుబయలు ప్రదర్శనశాల నిర్మించాలని, సైగల్ నటించిన చిత్రాలన్నిటి నెగిటివ్‌లనూ, ప్రింట్‌లను జాగ్రత్తచేసి లైబ్రరీ రూపంలో ఉంచాలనీ వారు తీర్మానించారు.

ఆ సంఘానికి అధ్యక్షుడుగా ఎస్. కె. పాటిల్ ఎన్నుకోబడ్డారు. అంబాలాల్ పటేల్ ఉపాధ్యక్షులు, నాథలాల్ పరిఖ్ కోశాధికారి, సుదర్శన్ ఆర్యా, శ్రీమతి రాజకుమార్ రాయ్ సంయుక్త కార్యదర్శులుగాను, అచలా శచ్‌దేవ్, జైమని దివాన్, సురేంద్ర, ఉషాకాంత్ లడివాలా కార్యవర్గసభ్యులుగానూ నియమితులయ్యారు.

* * *

సెలెస్టియల్ పిక్చర్స్ వారి “జగద్గురు శంకరాచార్య” షూటింగ్ పూర్తి కావచ్చింది. శ్రీమన్ సినీ లాబొరేటరీలో ఇటీవల రెండు పాటలు రికార్డు చేయబడినవి. ఈ పాటల చిత్రీకరణం ప్రకాశ్ స్టూడియోలో వేయబడుతున్న సెట్ మీద జరుగుతుంది. శంకరజయంతి నాటికి చిత్రం పూర్తవుతుందట.

అభి భట్టాచార్య, సులోచనా చటర్జీ, దుర్గాఖోటే, సప్రూ, ఆశామధుర్, రమేష్ సిన్హా, రాజ్ కుమార్, బేబీ నంద మున్నగు

★ బొంబాయి సినిమాలేఖ ★

వారి చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్. ఫతేలాల్, జయగోపాల్ ఇద్దరూ దర్శకులు. సంగీతదర్శకుడు అవినాశ్ వ్యాస్.

* * *

దర్శకనిర్మాత ఎస్. డి. నారంగ్ "అరబ్ కా సౌదాగర్" అనే చిత్రం తీస్తున్నాడు. శశికళ, ప్రదీప్ కుమార్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేశంలోని కొన్ని సుందర ప్రకృతి దృశ్యాలను షూట్ చేయాలని దర్శకుడు ఆలోచిస్తున్నారు. ఇప్పటికి ఆరు రీళ్ళవరకూ తయారైందట. వర్తక యువకుడుగా నటించుతున్న ప్రదీప్‌కుమార్ తన ప్రేయసి మందిరంలోకి ప్రవేశించడానికి గాను కోయ వేషం మొదలుకొని వైద్యుని వేషం వరకూ అనేక రకాల వేషాలు ధరిస్తాడట. ఈ చిత్రంలో స్మృతిబిశ్వాస్, హీరాలాల్, సుందర్, నీరూ మున్నగువారు కూడా నటిస్తున్నారు. గండు స్వప్నాలను గేవాకలర్‌లో తీస్తారట. సంగీత దర్శకుడు హేమంతకుమార్.

* *

మయూనిగ్ పిక్చర్సువారు హిందీ, బెంగాలీలలో తీస్తున్న "రు ఆ" చిత్రం ఇటీవల బొంబాయి, మోడరన్ స్టుడియోలో ప్రారంభింపబడింది. సుమిత్రతో షూటింగ్ మొదలైనది. "ఏ జీ ఉఠో సవేరా హోగయా" అనే హిందీ సంభాషణ ఆమె ఉచ్చరిస్తుండగా దర్శకనిర్మాత మెహబూబ్ ఖాన్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మరి రెండు నిమిషాల తరువాత "ఓగో, ఓతో భోర్ హోయ్ గ్యాచే" అనే బెంగాలీ సంభాషణను ఆమె ఉచ్చరించగా ఫిల్మిస్థాన్‌కు చెందిన ఎస్. ముఖర్జీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు.

ఈ చిత్రంలో సుమిత్ర, అశోక్ కుమార్, మాలా సిన్హా, కిశోర్ కుమార్, ములినా, నసిర్ హుసేన్ నటిస్తున్నారు. వసంత్ జోగ్లేకర్ దర్శకుడు. బెంగాలీభాష చిత్రానికి ఆయనకు ప్రాణ్ సహాయం చేస్తున్నాడు. సంగీతదర్శకుడు హేమంతకుమార్. రతన్‌లాల్ సాగర్ ఫోటోగ్రఫీ నిర్వహిస్తున్నాడు. ఈ చిత్రం షూటింగ్ యావత్తూ జూపిటర్ స్టూడియోలో జరుగుతుంది. ప్రారంభోత్సవానికి లలితా పవార్, సుమతీగుప్తే, సర్దార్ అక్తార్, శశికళ, స్మృతిబిశ్వాస్, మలయ సర్కార్, రూమాదేవి, బిమల్ రాయ్, అభిభట్టాచార్జీ, డి. ఎస్. మధోక్ హాజరయ్యారు.

* * *

వి శాంతారాం నిర్మిస్తున్న "ఝనక్ ఝనక్ పాయల్ బాజే"లో ఒక పాటను రికార్డుచేయడానికి సంగీతదర్శకుడు వసంత్ దేశాయ్, రికార్డిస్ట్ పార్మార్‌లకు సుమారు 20 గంటలు పట్టింది. రికార్డింగ్ ఏప్రిల్ 14న పొద్దున 9 గంటలకు ప్రారంభమై, మర్నాడు ఉదయం 5 గంటలకు ముగిసింది. ఈపాటలో మొత్తం వందమంది సంగీతజ్ఞులు పాల్గొన్నారు. వీరిలో కలకత్తానుండి వచ్చిన ఆరుగురు మృదంగప్రవీణులు, 50 మంది కోరస్ గాయనీ గాయకులు ఉన్నారు. వీరందరికీ నాయకి గాయకి లతామంగేష్కర్. ఆమె శివస్తోత్రం గానం చేసింది.

ప్రసిద్ధశాస్త్రీయ గాయకుడు అమీర్ ఖాన్ ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాట పాడతారు.

రంగులలో తీయబడుతున్న యీ చిత్రం వచ్చేనెల రెండోవారానికల్లా పూర్తవుతుందని, ఆగస్టు 15న విడుదలవుతుందని తెలుస్తోంది.

* * *

గడచిన అక్టోబరులో ప్రారంభింపబడిన "భైరవి" అనే సంగీత చిత్ర నిర్మాణంనుండి తాను విరమించుకున్నానని లతామంగేష్కర్ తెలియజేసింది. ఎందుచేత విరమించినదో చెప్పలేదు. ఒకవేళ ఆ చిత్రం పూర్తిగా తయారైనా తనకూ దానికీ ఎట్టి సంబంధం వుండదనికూడా ఆమె చెప్పింది.



విగల్ ప్రొడక్షన్స్‌వారి "కన్యాదానం"లో రమాదేవి, నల్లపిల్లగా జానకి.



"కల్ గీతురా" అనే హిందీ చిత్రంలో మరొరీన ర్తకి షీలానాయిక్.

ఆజాద్

వక్షీరాజావారి ఆజాద్ మంచి వినోదం కలిగించే ఆహ్లాదకరమైన సంగీతచిత్రం. దిలీప్ కుమార్, ప్రాణ్, ఓంప్రకాష్, రణధీర్, బదరీప్రసాద్, మీనాకుమారి, షమ్మా, అచలా సచ్‌దేవ్ మున్నగువారు నటించిన ఈ చిత్రానికి దర్శకుడు, నిర్మాత శ్రీ యస్. యం యస్. నాయుడు.

ఈ చిత్రం లోగడ తెలుగు తమిళ భాషలలో అగ్గిరాముడు, మలైక్కళ్లన్ అనే పేర్లతో తీయబడింది. అవి విజయవంతములై శతదినోత్సవాలు జరుపుకున్న మీదట, హిందీ తారలతో ఆ కథను శ్రీ నాయుడు 'ఆజాద్'గా పునర్నిర్మించారు. ఆజాద్ బొంబాయి మొదలగుచోట్ల విజయవంతంగా ప్రదర్శింపబడి, ఈ సంవత్సరపు బాక్సాఫీస్ చిత్రాలలో ఒకటిగా పరిగణింపబడింది.

దిలీప్‌కుమార్ నటన అతని ప్రసిద్ధికి తగినట్లుగా ఉన్నది. ముఖ్యం గా ఖాన్ సాహెబ్‌గా ప్రేక్షకులను ఆకర్షిస్తాడు. కథానాయికగా మీనాకుమారి నటన సుమారుగా ఉన్నది హాస్యనటుడు ఓంప్రకాష్ పోలీసు భటుడుగా ప్రశంసనీయంగా నటించాడు

ఈ చిత్రంలో ముఖ్యంగా పేర్కొనదగినది శాయి, సుబ్బులక్ష్మి చేసిన నృత్యాన్ని వేశాలు. వీరికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

కథానాయికను ఎవరయినా పాట పాడమనటం తడవుగా అభినయంకూడా ఆరంభిస్తుంది. ఈ అభినయం లేకపోతే, కనీసం కొన్నిచోట్లమాత్రమే ఉంచితే, ఇంకా బాగుండేది అభినయంకాని, నృత్యంకాని మొత్తంమీద బాగున్నది ఇందుకు నృత్య దర్శకుని అభినందించాలి

సి. రామచంద్రం సంగీతం విన సొంపుగా ఉన్నది అయితే సాంగ్‌హిట్స్ కొదగిన వేవీలేవు రాజేంద్రకృష్ణవ్రాసిన సంభాషణలు బాగున్నాయి. పాటలకోసం చిత్రం విడివి పెంచినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఎడిటింగ్ వలన చిత్రానికి కొంత మెరుగు వచ్చింది.

ఈచిత్రం గత 29న స్టార్ టాకీసులో పత్రికలవారికి చూపించబడింది. ప్రస్తుతం ఆ టాకీస్‌లోనే నడుస్తున్నది. ఈ చిత్రం విజయవంతం కాగలదనటానికి సందేహం లేదు. ★


మద్రాసులోని తెలుగు సినిమాల రచయితలు మే 1వ తేదీన సమావేశమై "ఆంధ్ర స్క్రీన్ రైటర్స్ గిల్డ్" అనే సంఘం స్థాపించారు అడ్‌హాక్ కమిటీ అధ్యక్షులుగా తాపీ ధర్మారావునాయుడుగారు, కార్యదర్శులుగా ఆత్రేయ, సముద్రాల జూనియర్, శ్రీశ్రీ ఎన్నుకోబడ్డారు బొంబాయి లోని రచయితల సంఘం నిబంధనావళిని దృష్టిలో పెట్టుకుని నిబంధనావళిని వీరు తయారుచేస్తారు.

* * *

బెర్లిన్‌లో అయిదవ ప్రపంచ చలనచిత్రోత్సవం జూన్ 24 నుండి జులై 6 వరకూ జరుగనున్నది ఇండియా, జపాన్, పాకిస్థాన్, అమెరికా మొదలైన 67 దేశాలు ఈ ఉత్సవంలో పాల్గొంటాయి

* * *

బిమల్‌రాయ్ నిర్మించిన "బిరాజ్ బహు" చిత్రం కానిస్ చలనచిత్రోత్సవంలో ఇటీవల విమర్శకుల ప్రశంస లందుకున్నది. దోభీఘాజమీన్‌కు కిందటిసారి ఒక బహుమతివచ్చినట్లే ఈసారి దీనికి బహుమతి రావచ్చునని కొందరి అంచనా మెలోడ్రామా ఎక్కువగా ఉన్నదని మరికొందరు అభిప్రాయపడ్డారట. ★



పక్షిరాజావారి "ఆజాద్" మద్రాసు, స్టార్ టాకీస్‌లో విడుదలఅయింది. సంగీత దర్శకుడు సి. రామచంద్ర, నిర్మాత శ్రీరాములు నాయుడు, దిలీప్ కుమార్, తారాచంద్ గార్లను ఈ ఫోటోలో చూడవచ్చును

కాంబోడియా

(౩-వ పేజీ తరువాయి)

తులతూగుతారు. సింహం అంత బలవరాక్రమాలూ వస్తాయి!!

ఈ గోతులమీద చిన్న మట్టిగోడ కట్టి దానిమీద అడ్డంగా పుల్ల ఉంచి, ఆ పుల్లలకి యీ సెయిమాలు వేలాడదీస్తారు. ప్రార్థనలూ అవీ అయిన తరువాత బ్రాహ్మలు యీ సెయిమాలని భిక్షువులకి తప్పజెబుతారు. ఓ పెత్తాంతో యీ సెయిమాలుంచినచోట భూమిమ్మీద రెండు కాళ్లూ (పాదాలు) పట్టేటంత విశాలంగా చిన్న చిన్న *Squares* [illegible] గీస్తారు, ఏవో మంత్రాలు చెబుతూ - ఈ *Squares* గీయ్యడం ప్రారంభంతోనే అంతా మడిఅన్నమాట అప్పట్నుంచి బ్రాహ్మలకి ఒక్కసేపని — పసుపులేపి కోవెల ఆవరణంలోకి రాకుండా చూడడం! అప్పట్నుంచీ కొంతకాలం ముగిసేలోపున పీడ రాజంతు ప్రాశిగానీ కోవెల్లో అడుగుపెట్టిందా, మడి తగులబడిపోయి, తంతంతా మళ్లీ ప్రారంభించవలసిందే మొదటిదగ్గర్నుంచీ!!

యిహ అంతలో, బ్రాహ్మలు భిక్షువులని తోడ్కుని వెళ్లి సెయిమాలు ఒక్కొటి ఒక్కొటీ యిది ఫలానా యిదిఫలానా అని చూపించి చెప్పాలి తరవాత భూస్థాపితం చేసినప్పుడుకూడా సెయిమాలన్నీ ఒక్కమారు భూస్థాపితం కావాలికాని, ముందూ వెనకా కాకూడదు; అందుకని సెయిమాలు వేలాడదీసిన గోతులదగ్గిర బ్రాహ్మలు సిద్ధంగా కూచుంటారు, కత్తెరలుపట్టుకుని ఆవరణలోంచి డోలువాయిస్తారు. మొదటిసారి డోలుమీద దెబ్బపడగానే, కత్తెరలు సిద్ధంగా ఉంచుకోవాలి రెండోసారిడోలు దెబ్బకి సెయిమ తాడు చేతిలోకి తీసకోవాలి. యింకమూడోదెబ్బకి ఫైసలా!

అన్నట్టు, దీనికికొన్ని నిషిద్ధాలు మతాధిపతి (పెగోడా) పుట్టినసంవత్సరం యీ వేడుక జరుగుతున్న సంవత్సరమూ ఒక్కటేగాని అయినట్టయినా, ఆ అధిపతి పెగోడా అవతల కూచోవలసిందేగాని, కోవెల్లో కాలుపెట్టడానికి వీల్లేదు!

ఈ సెయిమా వ్రతంవల్ల వచ్చే పుణ్యం చేసినవాళ్లకి ఒక్కరికే కాకుండా, వారి తల్లిదండ్రులకీ వారిపైన ఏడుతరాలవారికీ కూడా సంక్రమిస్తుంది ఇలా యింతమంది భిక్షువులనీ, బ్రాహ్మలనీ వాళ్లనీ పిలిచి అట్టహాసంగా యిది చెయ్యలేనివాళ్లు, యిదివరకు యీ వ్రతంవల్ల పవిత్రం అయిన స్థలంలో చిన్న గుడిలాంటిదికట్టించినా, ఫలందక్కి, తిన్నగా వైకుంఠానికివెళ్లిపోతారు! అలాంటి గుళ్ళలో బ్రాహ్మలు విగ్రహాలు ప్రతిష్ఠాపన చేసి "యిది బుద్ధుడు వెలిసినచోటు" అని పవిత్రీకృతంచేస్తే, భిక్షువులు దానిమీద పవిత్రోదకాలుజల్లి "సాధు!" అంటూ ను (తథాస్తుకివొచ్చిన ప్రారబ్ధం!) ★

(యింకాఉంది)


Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras.



లినోకట్ చిత్రం

—జి. వి సుబ్బారావు

మీ ముఖమును మృదువుగ, మనోహరముగ, నవనవలాడేలా ఉంచుకొనుట ఎంతో సులభము!



మీ చర్మమునకు పాండ్స్ సౌందర్య రక్షణ యివ్వండి

ప్రసిద్ధిగాంచిన పాండ్స్ క్రీములు మీ చర్మమునకు అత్యుత్తమమైనవి. మీ పరిసరాల శీతోష్ణస్థితుల బాధలనుండి దానిని కాపాడును. ప్రపంచమంతటా సౌందర్యవతులవలెనే మీరూ ఈ క్రీముల సౌందర్యరక్షణతో మీ ముఖమును నవవికసిత పుష్పమువలె ఉంచుకొనగలరు.



పొడిగాలిగల శీతోష్ణస్థితి మీ ముఖ కాంతిని పాడుచేస్తే—పాండ్స్ కోల్డ్ క్రీమ్ మీకు అవసరము. దానిలో నున్న విశేష నూనెలు చర్మమునకు ఉపశమనము నిచ్చి తీక్షణమైన ఎండ, వడగాడ్పులతో అది వాడిపోకుండా కాపాడును



మీ చర్మము సహజముగ జిడ్డుగా యుంటే లేక వేడి చెమ్మగల గాలిలో జిడ్డుగా అవుతూ ఉంటే—పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడండి ఎంతో తేలికగా మరియు మంచువలెనున్న ఈ క్రీమ్ రోమరంధ్రాలను అద్దిన బిగటను. నిర్జీవమైన రక్త కణములను అద్దము తీసి. మీ ముఖమునకు సౌమ్య రక్షణ నిచ్చును.

ప్రపంచములో సౌందర్యరాణులు వాడే క్రీములు

పాండ్స్ క్రీములను ప్రతిదినము తప్పక వాడి మీ చర్మములో వ్యత్యాసము చూడండి — కొన్ని రోజులలో మీ ముఖము ఎంతో నిర్మలముగ, మృదువుగ ఉండుట మీరు చూడగలరు—అనుభవించగలరు కూడ.

పాండ్స్

కోల్డ్ క్రీమ్

వ్యానిషింగ్ క్రీమ్

